ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 30.09.2025 | సంపుటి :12 సంచిక : 72 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్
Simultaneously Published from Hyderabad & Karimnagar
ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## మన బతుకమ్మకు గిన్నిస్ రికార్డులు



అరుదైన ఘనత సొంతం చేసుకున్న హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం

హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించింది. అతిపెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా రికార్డు సృష్టించింది. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ ఏర్పాటు చేశారు. ఒకేసారి 1354 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. భారీ బతుకమ్మ చుట్టూ మహిళలు లయబద్ధంగా ఆడారు. మంత్రి సీతక్క బతుకమ్మపాట పాడి అలరించారు.

హైదరాబాద్(జనంసాక్షి)

# మోగిన స్థానిక ఎన్నికల నగారా





ఐదు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ

- తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసి ఎన్నికలు
- తర్వాత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక
- బీసీ రిజర్వేషన్ల జీవో విడుదలతో లైన్ క్లీయర్
- వివరాలు వెల్లడించిన ఎస్ఈసీ కుముదిని

### షెడ్యూల్ ఇలా..

**తొలివిడత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు**
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 11
పరిశీలన: అక్టోబర్ 12
నామినేషన్ల ఉపసంహరణ:అక్టోబర్ 15
ఎన్నికల తేదీ- అక్టోబర్ 23
ఓట్ల లెక్కింపు- నవంబర్ 11

**రెండో విడత ..**
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15
పరిశీలన: అక్టోబర్ 16
నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 19
ఎన్నికల తేదీ- అక్టోబర్ 27
ఓట్ల లెక్కింపు- నవంబర్ 11

**తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు**
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 17
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 19
పరిశీలన: అక్టోబర్ 20
నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 23
ఎన్నికల తేదీ, ఫలితాలు- అక్టోబర్ 31



**రెండో విడత..**
నామినేషన్ల స్వీకరణ - అక్టోబర్ 21
చివరి తేదీ: అక్టోబర్ 23
పరిశీలన: అక్టోబర్ 24
నామినేషన్ల ఉపసంహరణ : అక్టోబర్ 27
ఎన్నికల తేదీ, ఫలితాలు- నవంబర్ 4

**మూడో విడత ...**
నామినేషన్ల స్వీకరణ- అక్టోబర్ 25
చివరి తేదీ: అక్టోబర్ 27
పరిశీలన: అక్టోబర్ 28



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. బిసి రిజర్వేషన్లపై భారీ కసరత్తు జరిగినా చివరకు 42 శాతం బిసి రిజర్వేషన్లకు జివో విడుదల కావడంతో స్థానికఎన్నికలకు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ ప్రకటిం చింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో 565 మండలాల్లో 5,749 ఎంపీటీసీ, 656 జడ్పీటీసీ స్థానాలకు, 12, 733 గ్రామపంచాయతీలు, 1లక్షా12 వేల288 వార్డు ల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీకుముదిని వివరాలు వెల్లడించారు. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

మిగతా 2లో..

# సినిమాలపైనా సుంకాల మోతే..



**విదేశీ చిత్రాలపై 100% టారీఫ్‌లు**
**ట్రంప్ మరో సంచలన నిర్ణయం**



వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా వెలుపల నిర్మించే చిత్రాలపై 100 శాతం సుంకం విధిస్తామని పేర్కొన్నారు. చిన్న పిల్లల నుంచి క్యాండీని లాక్కున్నట్లు ఇతర దేశాలు తమ సినిమా నిర్మాణ వ్యాపారాన్ని లాక్కున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. అయితే ఈ సుంకాలు ఎప్పటి నుంచి వర్తించేదీ మాత్రం వెల్లడించలేదు." అమెరికా వెలుపల నిర్మించే అన్ని సినిమాలపై నూరు శాతం సుంకం విధించబోతున్నాం. మా సినిమా నిర్మాణ వ్యాపారాన్ని ఇతర దేశాలు దొంగిలించాయి. పిల్లాడి నుంచి మిఠాయిని దొంగిలించినట్లు మా వద్ద నుంచి లాక్కున్నాయి. ముఖ్యంగా కాలిఫోర్నియాకు ఉన్న బలహీన, అసమర్థత గవర్నర్ వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. దీర్ఘకాలికంగా ఉన్న ఈ సమస్యను నూరు శాతం సుంకాలు విధించడం ద్వారా పరిష్కరించి అమెరికాను మరోసారి అగ్రస్థానంలో నిలుపుతాను" అంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. సుంకాలు ఎప్పటి నుంచి? ఎలా విధిస్తారు? అనేది దానిపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిపై వైట్‌హౌస్ నుంచి అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు. అయితే, హాలీవుడ్‌ను దృష్టిలో పెట్టుకుని ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా భారతీయ చలనచిత్ర పరిశ్రమపై కూడా ప్రభావం పడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా తెలుగు సినిమాలకూ అమెరికా పెద్ద మార్కెట్. ట్రంప్ తాజా నిర్ణయం సినీ పరిశ్రమపై ఏ స్థాయిలో పడుతుందో తెలియాలంటే దీనికి సంబంధించిన మార్గదర్శకాలు రావాల్సి ఉంటుంది. అమెరికా అధ్యక్షుడి సుంకాల నిర్ణయం వేళ అమెరికా మార్కెట్‌లో నెట్‌ఫ్లిక్స్ షేరు విలువ 1.5 శాతం మేర పతనమైంది.

## సౌర విద్యుత్ గ్రామంగా కొండారెడ్డిపల్లి

దేశవ్యాప్తంగా 2వ, దక్షిణ భారత దేశంలో మొదటి స్థానం కైవసం చేసుకున్న ముఖ్యమంత్రి స్వగ్రామం

2లో

**దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠా**

# గుట్టురట్టు

**ఆరుగురిని అరెస్టు చేసిన తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు**
**500 సినిమాల పైరసీ • బీహార్‌లోని ఇంటికి 22 సీసీ కెమెరాలు: సీపీ సీవీ ఆనంద్**



హైదరాబాద్(జనంసాక్షి):దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠాను తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు ముఠాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేశారు. తెలుగు సహా పలు భాషల సినిమాలను పైరసీ చేసినట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ ముఠా పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ.3,700 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనివల్ల నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు."టెలిగ్రామ్ ఛానల్స్, టొరెంట్స్ ద్వారా సినిమాల పైరసీ జరుగుతోంది. కొత్తగా ఎంవో విధానంలోనూ చేస్తున్నారు. థియేటర్‌కు వెళ్లి కెమెరా ద్వారా రికార్డింగ్ చేసి పైరసీకి పాల్పడుతున్నారు. అందరూ విస్తుపోయేలా డిజిటల్ శాటిలైట్‌ను కూడా హ్యాక్ చేసి పైరసీ చేస్తున్నారు. పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసి బెట్టింగ్, గేమింగ్ యాప్ ప్రకటనల ద్వారా ఆదాయం పొందుతున్నారు. 'సింగిల్', 'హిట్' సినిమాల పైరసీ జరిగినప్పుడు మాకు ఫిర్యాదులు అందాయి. పైరసీ కేసులో జానా కిరణ్‌కుమార్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడు. సినిమాకు వెళ్లి కెమెరా ద్వారా రికార్డింగ్ చేసి టెలిగ్రామ్ ఛానల్ ద్వారా మరొకరికి పంపించాడు. హైఎండ్ కెమెరా ఉన్న సెల్‌ఫోన్‌తో నిందితులు

మిగతా 2లో..



## రిజర్వేషన్ల వల్ల ఎవరికీ అన్యాయం జరగదు

**స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు అందరూ సహకరించాలి: మంత్రి పొన్నం**

హైదరాబాద్(జనంసాక్షి):స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు అందరూ సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ల వల్ల ఎవరికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు. " 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఉందని కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. దానిలో మార్పులు చేసుకునేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు న్యాయపరంగా, చట్టపరంగా ముందుకెళ్తున్నాం. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీలు కూడా రిజర్వేషన్లకు మద్దతిచ్చాయి. మళ్లీ మాట మార్చకుండా ప్రభుత్వానికి సహకరించాలి. అందరి మద్దతుతోనే

మిగతా 2లో..

**స్థానిక సంస్థల ఎన్నికల్లో**

# గెలుపు మాదే..

- మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్ర ప్రజల తెలుసు
- బీఆర్ఎస్ సృష్టించిన విధ్వంసాన్ని సరిచేసుకుంటూ ముందుకెళ్తున్నాం
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగిస్తున్నాం
- కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చింది: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్(జనంసాక్షి):స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రజలు ఆదరిస్తారు, ఆశీర్వదిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఉదయం మధిర క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.బీఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, మనసులకు బాగా తెలుసు అని అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరికను నెరవేర్చింది అన్నారు. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వే నిర్వహించి బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించామన్నారు. మీ కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు, కుట్రపూరితంగా కోర్టులకు పంపిస్తున్నారని అన్నారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలు ఇచ్చి బీఆర్ఎస్ పెద్దలు అమలు చేయలేదు అన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల్లో కూడా పూర్తిగా చేయలేకపోయారని డిప్యూటీ సీఎం విమర్శించారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయింది అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చింది అన్నారు. యువతకు గ్రూప్ వన్ గ్రూప్ టు తో పాటు ఇప్పటికే 60,000 ఉద్యోగాలు, 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, తొమ్మిది

మిగతా 2లో..

## స్థానికంలో కాషాయ జెండా ఎగురవేస్తాం

**బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు**

హైదరాబాద్(జనంసాక్షి):స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలస్యమైనా తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రపతి, గవర్నర్‌ల పేరిట కాలయాపన చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రెండేళ్లకే కాంగ్రెస్ మీద ప్రజలకు విరక్తి కలిగిందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం మీద ప్రజలు

మిగతా 2లో..

# ఎన్నికలు ఏవైనా గెలుపు బీఆర్ఎస్‌దే

**కాంగ్రెస్ భరతంపట్టే బ్రహ్మాస్త్రం బాకీకార్డు**
**స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి పరాభవం తప్పదు : కేటీఆర్**

హైదరాబాద్(జనంసాక్షి):స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్రదీప్ చౌదరితోపాటు పలువురు వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్సీ ఎల్.రమణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న వాతావరణం చూస్తే.. గల్లీ ఎన్నికైనా, ఢిల్లీ ఎన్నికైనా బీఆర్ఎస్‌కు అనుకూలమే అన్న పరిస్థితి కనిపిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రజలకు తామిచ్చిన ఎన్నికల హామీలను మర్చిపోయారని కాంగ్రెస్ పార్టీ ఆడుకుంటుందని మండిపడ్డారు. ఆరు 'గ్యారెంటీల' పేరుతో కాంగ్రెస్ చేసిన గారడీని ప్రజలు ఇంకా మర్చిపోలేదని స్పష్టంచేశారు. సమాజంలోని రైతులు, మహిళలు, ఆటో డ్రైవర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, విద్యార్థులు, వివిధ సామాజిక వర్గాల వారు

మిగతా 2లో..






**జేఈఈ (మెయిన్) విద్యార్థులకు**

## ఎన్‌టీఏ సూచనలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్షకు సన్నద్ధమవుతోన్న విద్యార్థులకు అలర్ట్! ఈ పరీక్ష రాసే విద్యార్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పలు కీలక సూచనలు చేసింది. వచ్చే ఏడాది జనవరిలో జేఈఈ మెయిన్ సెషన్ 1, ఏప్రిల్‌లో సెషన్-2 పరీక్ష జరుగుతుందని స్పష్టం

మిగతా 2లో..

# కాశ్మీర్, లద్దాఖ్‌లకు కేంద్రం ద్రోహం చేసింది

- రాష్ట్ర హోదా హామీని విస్మరించారు
- మండిపడ్డ కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్(జనంసాక్షి):జమ్ముకాశ్మీర్, లడఖ్ రాష్ట్ర హోదాలపై ఇచ్చిన హామిలను నెరవేర్చడంలో విఫలమైందని కేంద్రాన్ని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబుల్లా మండిపడ్డారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించ డంలో జాప్యం చేయడం ద్వారా అవిశ్వాసాన్ని పెంచడం ద్వారా జమ్ముకాశ్మీర్, లడఖ్ రెండింటికీ ద్రోహం చేసిందని అన్నారు. కేంద్రం తన సొంత రోడ్‌మ్యాప్‌ను అనుసరించడంలో విఫలమైందని, 'అసాధ్యమైన' హామిలతో రెండు రాష్ట్రాలను తప్పుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లడఖ్ కౌన్సిల్ ఎన్నికల సమయంలో లడఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేర్చుతామని హామి ఇచ్చిందని అన్నారు. అయితే అది అసాధ్యం అని అందరికీ తెలుసు. ఒకవైపు చైనాతో, మరోవైపు పాకిస్తాన్‌తో సరిహద్దులను కలిగి ఉన్న ప్రాంతానికి గణనీయమైన రక్షణ అవసరమని అన్నారు. ఎన్నికల కోసం తప్పుడు వాగ్దానాలు చేశారని మండిపడ్డారు. లడఖ్ నేతల పట్ల,

మిగతా 2లో..

**లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్**

## ఇకపై ఉగ్ర సంస్థ

ప్రకటించిన కెనడా

9లో

## పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

20 ఏళ్లు పార్టీ కోసం కష్టపడ్డా.. అవమానాలు ఎదుర్కొన్నా: కవిత



వార్త 2లో

# సౌర విద్యుత్ గ్రామంగా కొండారెడ్డిపల్లి

### దేశవ్యాప్తంగా 2వ, దక్షిణ భారత దేశంలో మొదటి స్థానం కైవసం చేసుకున్న ముఖ్యమంత్రి స్వగ్రామం

**హైదరాబాద్(జనంసాక్షి):** సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి గుర్తింపు పొందనుంది. నాగర్ కర్నూల్ జిల్లా వంగూర్ మండలంలో అచ్చంపేట నియోజకవర్గం పరిధిలో కొండారెడ్డిపల్లి గ్రామం ఉంది. దేశంలో రెండో గ్రామంగా, దక్షిణ భారతదేశంలో మొదటి గ్రామంగా తీర్చిదిద్దుటకు చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. టీజీరెడ్కో ద్వారా రూ 10.53 కోట్లతో 514 ఇండ్లతో , పాటు 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి ఇంటికి 3 కి.వా స్థాపిత సామర్థ్యంతో 480 ఇండ్లకు సౌర విద్యుత్ వసతిని కల్పించారు. అలాగే 60 కి.వా సామర్థ్యం కలిగిన 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ పరికరాలు బిగించారు. మొత్తం సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 1,500 కి.వా ఉన్నది. మట్టి గోడలతో ఉన్న 34 ఇండ్ల కుటుంబాలు కూడా సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయి. ఈ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే, ఇండ్ల పైన సౌర విద్యుత్ పరికరాలు బిగించనున్నట్లు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మేనేజర్ కె. మనోహర్ రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లి గ్రామం సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 10.53 కోట్లు . అందులో రూ.7.96 కోట్ల వ్యయంతో సౌర విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు కేటాయించారు. ప్రతి ఇంటి నుండి నెలకు 360 యూనిట్స్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇండ్ల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ను , ఇంటి వినియోగానికి పోగా,మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కు అనుసంధానం చేశారు. గ్రిడ్ కు పంపే విద్యుత్ యూనిట్ కు రూ 5.25 చొప్పున చెల్లించుటకు లబ్దిదారులతో విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం చేసుకున్నది. సెప్టెంబర్ నెలలో విద్యుత్ గ్రిడ్ కు గ్రామం మొత్తం నుండి సుమారు ఒక లక్ష యూనిట్స్ విద్యుత్ ఎగుమతి అయింది. తద్వారా రూ 5 లక్షలు ఆదాయాన్ని గ్రామస్తులు ఒక నెలలోనే ఆర్జించారు.

# స్థానికంలో గెలుపు మాదే..

రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న ధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్, 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఇందుకుగాను 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వివరించారు. రాష్ట్రంలో 1.05 కోట్ల కుటుంబాలు ఉండగా 96 లక్షల కుటుంబాలకు మనిషికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం, బహిరంగ మార్కెట్లో 56 రూపాయలు కిలో ధర పలుకుతున్న సన్నబియ్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసి ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తున్నాం అన్నారు.

# ఇరాన్‌పై ఐరాస మళ్లీ ఆంక్షలు

– పదేళ్ల తర్వాత 'స్నాప్‌బ్యాక్' అణు కార్యక్రమంపై వెనక్కి తగ్గనందుకే..
– ప్రతిచర్య తప్పదంటున్న ఇస్లామిక్ రిపబ్లిక్

దుబాయ్: ఇరాన్ అణు కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి మళ్లీ ఆ దేశంపై పూర్తి స్థాయి ఆంక్షలను విధించింది. ఇప్పటికే ఆ దేశ ప్రజలు సంపాదించిందంతా ఆహారం కోసమే ఖర్చు పెడుతూ, భవిష్యత్తుపై ఆందోళన చెందుతుండగా వారిపై ఆంక్షల వల మళ్లీ పడింది. అణు కార్యక్రమాన్ని వదిలేయాలంటూ చిట్టచివరి నిమిషంలో ఐరాసలో జరిగిన దౌత్య చర్చలు విఫలం కావడంతో ఆదివారం రాత్రి 8 గంటల సమయం నుంచి ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. దీనిఫలితంగా, విదేశాల్లో ఉన్న ఇరాన్ ఆస్తులు ఫ్రీజ్ అవుతాయి.ఇరాన్ కుదుర్చుకున్న ఆయుధ ఒప్పందాలూ ఆగిపోతాయి. ఇరాన్ తన బాలిస్టిక్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగించాలని చూస్తే మరిన్ని ఆంక్షలు మోపే ప్రమాదముంది. ఈ ఆంక్షలు 'స్నాప్‌బ్యాక్'గా (స్వయంచాలికంగా–ఆటోమేటిక్)గా అమల్లోకి వస్తాయి. దీనివల్ల, ఇరాన్‌పై విధించిన ఇతర ఆంక్షల మాదిరిగా చైనా, రష్యాలు భద్రతామండలిలో వీటిని వీటో చేయడం కుదరదు.అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, యూకేలతో ఇరాన్ 2015లో కుదుర్చుకున్న అణు ఒప్పందంలో ఈ షర తులన్నీ ఉన్నాయి. జూన్‌లో ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా తమ అణు కేంద్రాలపై దాడి చేసిన నేపథ్యంలో ఇరాన్ అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ)నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించింది. ఇప్పటికీ ఆ దేశం వద్ద 60% శుద్ధి చేసిన యురేనియం నిల్వలున్నాయి. 90% శుద్ధి చేసిన యురేనియంతో బాంబులను తయారు చేసే సామర్థ్యం ఇరాన్ సొంతమవుతుంది. తమ అణు కార్యక్రమం శాంతియుత అవసరాలకేనంటూ ఇరాన్ చెబుతున్నా అమెరికా, పశ్చిమదేశాలు అనుమానిస్తున్నాయి.నెల రోజుల క్రితమే స్నాప్‌బ్యాక్‌ను ప్రయోగిస్తామంటూ ఫ్రాన్స్, జర్మనీ, యూకేలు హెచ్చరించాయి. అయినప్పటికీ ఇరాన్ ఐఏఈఏ పరిశీలకులను అణు కేంద్రాల్లో తనిఖీలకు అనుమతించేందుకు అంగీకరించలేదు. శుద్ధి చేసిన యురేనియం నిల్వల గురించిన సవివర నివేదికను ఐఏఈఏకు పంపలేదు. దీంతో ఆంక్షలు అనివార్యమయ్యాయని పశ్చిమ దేశాలంటున్నాయి. శాంతియుత ప్రయోజనాల కోసమైతే యురే నియంను 60 శాతం వరకు శుద్ధి చేయాల్సిన అవసరం లేదు కదా అని ప్రశ్నిస్తున్నాయి.ఐరాస ఆంక్షలు అమల్లోకి రావడంతో ఇరాన్ ప్రతీకార చర్యలపై తీవ్ర సమాలోచనలు చేస్తోంది. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం(ఎన్‌పీటీ) నుంచి వైదొలిగే ప్రతిపాదనను ఇరాన్ పార్లమెంట్ పరిశీలించే అవకాశాలున్నాయని ఎక్కువగా ఉన్నాయని స్పీకర్ మహ్మద్ బఘెర్ కలిబాఫ్ తెలిపారు. ఆంక్షలను ఆయన అన్యాయమన్నారు. ఎన్‌పీటీ నుంచి వైదొలగడం ద్వారా అణు బాంబును తయారు చేసే అవకాశాలున్నాయన్న వార్తలను ఆయన కొట్టిపారేశారు.అమెరికా ట్రంప్ హయాంలో 2018లో అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలిగినందున యూరప్ దేశాలైన యూకే, జర్మనీ, ఫ్రాన్స్‌లకు స్నాప్‌బ్యాక్ అమలు చేసే అర్హత లేదని ఆయన తెలిపారు. అయితే, ఇరాన్‌కు దౌత్య మార్గాలు తెరిచే ఉన్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తెలిపారు. ఇందుకోసం ముందుగా ఇరాన్ తమతో నేరుగా చర్చలకు రావాలని ఆయన స్పష్టం చేశారు. ఐఏఈఏ నుంచి వైదొలగడం ఇరాన్ తీవ్రమైన తప్పిదమని, ఇదే సాకుతో అమెరికా, ఇజ్రాయెల్‌లు ఆ దేశంపై మళ్లీ దాడులకు దిగే ప్రమాదముందని విశ్లేషకులు అంటున్నారు.

# దేశం విడిచి వెళ్లలేదు

– నేను ఎవరికీ భయపడను
– దేశంలోనే ఉండి రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తాను.
– నేపాల్ మాజీ ప్రధాని ఓలీ కీలక ప్రకటన

**ఖాట్మాండ్(జనంసాక్షి):** నేపాల్ మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ కీలక ప్రకటన చేశారు. తాను దేశం వీడి వెళ్లనున్నట్లు వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండిం చారు.ఇదంతా తప్పుడు ప్రచారం అంటూ కొట్టిపారేశారు. తాను దేశం విడిచి ఎక్కడికీ పారిపోవడం లేదని క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు.నేపాల్ మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ తాజాగా మాట్లాడుతూ.. నేను ఎవరికీ భయపడను. దేశంలోనే ఉండి రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తాను. దేశంలో శాంతిభద్రతలు, రాజ్యాంగ పాలనను తిరిగి పునరుద్ధరించడానికి కట్టుబడి ఉన్నాను. నేను దేశం విడిచి వెళ్లిపోతున్నట్టు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఫేక్ ప్రచారాన్ని ఖండిస్తున్నాను. నేను ఇక్కడే ఉన్నాను. ఎక్కడికీ వెళ్లడం లేదు. ఎటువంటి ఆధారం లేని ఈ ప్రభుత్వానికి దేశాన్ని అప్పజెప్పి తాను పారిపోతానని అనుకుంటున్నారా? అని పార్టీ యువ విభాగాన్ని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం తన భద్రత, అధికారిక హక్కులను రద్దు చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.ఇదే సమయంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రజల తీర్పుతో కాకుండా.. విధ్వంసం శక్తుల ద్వారా అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఇప్పటికి కూడా తనకు బెదిరింపు మెసేజులు వస్తున్నాయన్నారు.

# మోగిన స్థానిక ఎన్నికల నగారా..

నిర్వహిస్తామని వివరిం చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని అన్నారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్‌ఈసీ తెలిపారు. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాణికుముదిని వివరించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది ఎన్నికల కమిషన్. ఇందుకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరిపామన్నారు ఎన్నికల అధికారులు. ఇక ఎన్నికల్లో భాగంగా 565 మండలాల్లో ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికలు మొత్తం మూడు దశల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీమొదటి విడత ఎన్నికలు జగనున్నాయి. ఇక అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ రెండో దశ ఎన్నికలు జరగనుండగా.. అక్టోబర్ 31న మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 4న రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జగనున్నాయి. ఇక చివరగా నవంబర్ 8న మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. మొత్తంగా రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. దీనితో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే రాష్ట్రమంతటా ఎన్నికల సందడి మొదలవగా కొన్ని గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించబోవడం లేదని ఎస్‌ఈసీ ప్రకటించింది. కరీంనగర్, ములుగు జిల్లాల్లో 14 ఎంపీటీసీ, 27 గ్రామ పంచాయతీలకు 246 గ్రామ వార్డులు ఎన్నికలకు దూరంగా ఉండనున్నాయని స్పష్టం చేశారు. కోర్టు కేసుల కారణంగా ఇక్కడ ఎన్నికల నిర్వహణ సాధ్యం కావడం లేదని, హైకోర్టు ఆదేశాల మేరకు ఈ స్థానాల్లో ఎన్నికలు జరగబోవని తెలిపారు. ములుగు జిల్లాలోని 25 గ్రామ పంచాయతీలు, కరీంనగర్ జిల్లాలోని 2 పంచాయతీలకు ఎన్నికలు లేవని స్పష్టం చేశారు.

# పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

### 20 ఏళ్లు పార్టీ కోసం కష్టపడ్డా.. అవమానాలు ఎదుర్కొన్నా: కవిత

**లండన్(జనంసాక్షి):** పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. లండన్‌లోని తెలంగాణ ప్రవాసులతో కవిత ముఖాముఖి మాట్లాడారు. తెలంగాణ జాగృతిని దేశానికి రోల్ మోడల్‌గా నిలపాలన్నదే సంకల్పమని చెప్పారు. సామాజిక తెలంగాణ కోసం జాగృతి పనిచేస్తుందన్నారు. "అవసరం, సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతాం. ప్రజల జీవితాల్లో మార్పులు తేవడంపై స్పష్టమైన ఆలోచన ఉంది. తప్పనిసరిగా నాకు అవకాశం వస్తుంది. ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల సమయం ఉంది. అప్పటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలి. నా వెనక ఏ జాతీయ పార్టీ లేదు.. జాతీయ పార్టీల్లో చేరే ఉద్దేశం కూడా లేదు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ. అభివృద్ధి పథంలో సాగుతున్న తెలంగాణను భ్రష్టు పట్టిస్తోంది. భాజపా డీఎన్‌ఏ నాకు సరిపడదు. 20 ఏళ్లు భారత రాష్ట్ర సమితి కోసం కష్టపడ్డాను. కొందరిలో స్వార్థం పురుడుపోసుకుంది. వారివల్ల కోట్లాది మంది బాధపడొద్దన్నదే నా తపన. పార్టీలో చీలికలు రావొద్దని ఎంత ఇబ్బందైనా తట్టుకొని నిలబడ్డాను. పార్టీలో చాలా అవమానాలు ఎదురయ్యాయి. నా ఓటమి మొదలు అసెంబ్లీ ఎన్నికల్లో భారాస ఓటమి వరకు ఎన్నో కుట్రలు జరిగాయి. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇప్పుడు మాట్లాడాల్సి వచ్చింది. విషయం ప్రజల్లోకి వచ్చిన తర్వాత వాటిపై స్పందించకపోతే తప్పవుతుంది. అందుకే మాట్లాడాల్సి వచ్చింది. పార్టీ నన్ను వద్దనుకుంది కాబట్టే.. పార్టీ ఇచ్చిన పదవిని వద్దనుకున్నాను. నిర్ణీత నమూనాలో రాజీనామా చేశాను. ఛైర్మన్ ఎందుకు ఆమోదించడం లేదో తెలియదు. నేను ఈ పరిస్థితికి రావడానికి అవతలి వాళ్లే కారణం. కష్టమవుతుం దని తెలిసినా.. కేసీఆర్ బిడ్డగా ధైర్యంగా పంథాను ఎంచుకుంటాను. జైలు జీవితం నాలో అనేక మార్పులు తీసుకొచ్చింది. సమూలంగా మార్చేసింది. నిజమైన మార్పు కోసం తెలంగాణ ఉద్యమకారులు ఒక్కటై పని చేయాలి" అని కవిత అన్నారు.

# పీవోకేలో ఆందోళనలు..

### పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మౌలిక సంస్కరణలను కోరుతూ అవామీ యాక్షన్ కమిటీ నిరసనలు .. ఇంటర్నెట్ బంద్

**శ్రీనగర్(జనంసాక్షి):** పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ ఉద్రికత్త చోటుచేసుకుంది. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మౌలిక సంస్కరణలను కోరుతూ అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసనలు ప్రారంభమయ్యాయి.ఇటీవల ఎన్నడూ లేనంత స్థాయిలో ఆందోళనలు చేపట్టడంతో భారీ సంఖ్యలో ప్రజలు రోడ్ల మీదకు వచ్చారు. దీనికి సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి.వివరాల ప్రకారం.. అవామీ యాక్షన్ కమిటీ నాయకత్వంలో పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేలాది మంది పౌరులు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారీ నిరసనలు చేపట్టారు. కాగా, అవామీ యాక్షన్ కమిటీ.. 38 పాయింట్ల నిర్మాణాత్మక సంస్కరణలను డిమాండ్లను పాక్ ప్రభుత్వానికి ఇచ్చింది. పీఓకేలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని.. తమ 38 డిమాండ్లను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ "షటర్–డౌన్.. వీల్–జామ్" పేరుతో అవామీ యాక్షన్ కమిటీ సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో ముఖ్యంగా.. పాకిస్తాన్‌లో నివసిస్తున్న కాశ్మీరీ శరణార్థుల కోసం రిజర్వ్ చేయబడిన పీవోకే అసెంబ్లీలో 12 శాసనసభ స్థానాలను రద్దు చేయాలని, ఇది ప్రాతినిధ్య పాలనను దెబ్బతీస్తుందని తెలిపింది.ఈ సందర్భంగా అవామీ యాక్షన్ కమిటీ (ఏఏసీ) నాయకుడు షౌకత్ నవాజ్ మీర్ ముజఫరాబాద్‌లో మాట్లాడుతూ..'మా ప్రచారం ఏ సంస్థకు వ్యతిరేకంగా కాదు. గత 70 సంవత్సరాలుగా మా ప్రజలకు నిరాకరించబడిన ప్రాథమిక హక్కుల కోసమే పోరాటం. ప్రజలకు హక్కులను అందించడం ప్రభుత్వం బాధ్యత అని చెప్పుకొచ్చారు. మరోవైపు.. పాక్ ప్రభుత్వం దశాబ్దాలుగా తమను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతున్నట్లు నిరసనకారులు తెలిపారు.ఈ క్రమంలో పీవోకేలోని పలు ప్రాంతాల్లో పౌరులు పాక్ బలవంతపు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని నినాదాలు చేస్తూరోడ్ల పైకి వచ్చారు. ప్రభుత్వం తమ డిమాండ్ల విషయంలో చర్చలు జరపడానికి ముందుకురావాలని అవామీ యాక్షన్ కమిటీ కోరింది. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే నిరసనలను మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది.

# పాలమూరు రంగారెడ్డిపై కేటీఆర్ చెప్పినవన్నీ అబద్ధాలే..

– ప్రాజెక్టుపై చర్చకు సిద్ధమా.?
– మంత్రి జూపల్లి సవాల్

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. పాలమూరు రంగారెడ్డిపై కేటీఆర్ చెప్పినవన్నీ అబద్ధాలే అని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కేటీఆర్ అయినా హరీష్ రావు అయిన చర్చకు రావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 90 శాతం పనులు పూర్తి చేసినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తా అని అన్నారు. లేదంటే మీరు రాజీనామా చేస్తారా.. అని ప్రశ్నించారు. తాను కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందో రాదో అన్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఏం మాట్లాడానో పూర్తి వీడియో చూస్తే తెలుస్తుందని స్పష్టం చేశారు. కేటీఆర్ చర్చకు వస్తే.. పూర్తి వీడియో చూపిస్తా అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు రూ.8 లక్షల కోట్లు బాకీ ఉందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పులి పంజా విసిరితే బీఆర్ఎస్ గద్దె దిగిందని మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు చేశారు.

# 'సర్'ను ఆమోదించం

– వ్యతిరేకంగా తీర్మానం చేసిన కేరళ అసెంబ్లీ

**తిరువనంతపురం(జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణను వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. కేరళలో ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్న క్రమంలో.. ఆ రాష్ట్రంలోని అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్, ప్రతిపక్ష యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ కలిసి అందుకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానానికి ప్రతిపక్ష కూటమి మద్దతు తెలిపింది. దాంతో తీర్మానం ఏకగ్రీవంగా సభ ఆమోదం పొందింది. ఈ సందర్భంగా తీర్మానంలో సవరణల కోసం ఎమ్మెల్యే షంసుద్దీన్ చేసిన రెండు ప్రతిపాదనలకు సీఎం అంగీకారం తెలిపారు. మిగతా సవరణల ప్రతిపాదనలను స్పీకర్ తోసిపుచ్చారు. ఎన్నికల జాబితాలో 'ప్రత్యేక అత్యవసర సవరణ' అనేది దేశంలో 'నేషనల్ పాపులర్ రిజిస్టర్' అమలుకు వెనుక ద్వారం లాంటిదని తీర్మానంలో పేర్కొన్నారు. కాగా కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడ్డాయని, ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో అధికార బీజేపీకి లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తోందని దేశంలోని విపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు.

# రిజర్వేషన్ల వల్ల ఎవరికీ అన్యాయం జరగదు

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇదే విషయాన్ని న్యాయస్థానంలోనూ ప్రస్తావిస్తాం" అని పొన్నం తెలిపారు.

# జేఈఈ (మెయిన్) విద్యార్థులకు ఎన్‌టీఏ కీలక సూచనలు

చేసింది. అయితే, సెషన్ 1 పరీక్షకు అక్టోబర్ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులోకి వస్తాయని వెల్లడిస్తూ అభ్యర్థులకు పలు డాక్యుమెంట్‌ల అప్‌డేట్‌కు సంబంధించి పలు కీలక సూచనలు చేసింది. పది, 12 పరీక్షల తేదీలొచ్చేశాయ్.. టెన్త్ పరీక్షలు ఇక రెండుసార్లు జేఈఈ (మెయిన్) 2026 పరీక్షను సజావుగా నిర్వహించడంలో భాగంగా అర్హత కలిగిన అభ్యర్థులంతా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకొనే ముందే అవసరమైన డాక్యుమెంట్‌లను అప్‌డేట్ చేసుకోవాలని ఎన్‌టీఏ కోరింది. తద్వారా దరఖాస్తుల ప్రక్రియ, తదుపరి దశల్లో ఎదురయ్యే ఇబ్బందులు తప్పుతాయని, దరఖాస్తుల తిరస్కరణ, తదితర సమస్యలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొంది.

# కాశ్మీర్, లద్దాఖ్‌లకు కేంద్రం ద్రోహం చేసింది

ముఖ్యంగా వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పట్ల కేంద్రం భిన్నమైన వైఖరి ప్రదర్శించడాన్ని కూడా విమర్శించారు. గతంలో ప్రధానిని పర్యావరణ యోధుడిగా కొనియాడారని, 2019లో కేంద్రపాలిత ప్రాంతం (యుటి) హోదా కల్పించి, అక్కడి ప్రజల కలలను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపినపుడు ఎవరూ తప్పుపట్టలేదని అన్నారు. అటువంటి పెద్దమనిషికి అకస్మాత్తుగా ఈరోజు పాకిస్తాన్‌తో సంబంధాన్ని గుర్తించామని చెప్పారని ఇప్పుటికిప్పుడు గుర్తించారని కేంద్రాన్ని నిలదీశారు. మొదట డీలిమిటేషన్, తర్వాత ఎన్నికలు, చివరకు రాష్ట్రహోదా కల్పిస్తామని, ఇది మూడు దశల పక్రియ అని మొదట్లో చెప్పారని అన్నారు. డీలిమిటేషన్, ఎన్నికలు రెండూ కూడా పూర్తయ్యాయని, కానీ రాష్ట్ర హోదా హామీ ఎందుకు నిలిచిపోయిందని ప్రశ్నించారు.

# ఎన్నికలు ఏవైనా గెలుపు బీఆర్ఎస్‌దే..

అందరికీ హామీలు ఇచ్చి, కాంగ్రెస్ ఘోరంగా మోసం చేసింది' అని కేటీఆర్ ఆరోపించారు. 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు గ్యారెంటీ కార్డులతో చేసిన గారడీలను గుర్తుచేసేందుకు మేం 'బాకీ కార్డులను' తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి తీసుకుపోతే, అదే కాంగ్రెస్ పాలిట బ్రహ్మాస్త్రం అవుతుందన్నారు. హైదరాబాద్ నగరంలో ఒక్కటంటే ఒక్క ఫ్లైఓవర్ కూడా కట్టలేదని పేర్కొన్నారు. గత 22 నెలలుగా హైదరాబాద్ నగరంలో ఉన్న రోడ్లను కూడా ప్రభుత్వం నిర్వహించలేకపోతున్నది' అని మండిపడ్డారు. హైదరాబాద్ నగరానికి మన హయాంలో చేసిన అభివృద్ధిని చూసి, మరోసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మనకు ఓటువేసి గెలిపిస్తారన్న నమ్మకం ఉన్నది. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సునామీలా విస్తరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన అభయహస్తం భస్మాసుర హస్తమని తేలిపోయిందని తెలిపారు. ఆ మేరకు ప్రజల నుంచి స్పందన వస్తుంది. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాలన్న స్పష్టమైన ఆలోచన ప్రజల్లో కనిపిస్తున్నది. ఇది రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ప్రజల్లో ఉన్నది. కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టి, తిరిగి ప్రజల సంక్షేమ, అభివృద్ధి పాలన కోసం కేసీఆర్ సారథ్యంలో ప్రభుత్వం రావాలన్న ఆకాంక్ష బలంగా ఉన్నదని స్పష్టమవుతోంది' అని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఎరువుల కోసం లైన్లలో నిలబడి కొట్లాడే పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు గ్రామాల్లో ఆగ్రహావేశాలతో ఉన్నారు. మహిళలకు ఇస్తామని చెప్పిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ చేసిన మోసంపై ఆగ్రహం వ్యక్తమవుతుందని వివరించారు. నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇస్తామని చెప్పి వృద్ధులను మోసం చేసిందన్నారు. యువతకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యార్థులు, విద్యార్థినులకు స్కూటీలు అని చెప్పి మాటతప్పారా లేదా అని ప్రశ్నించారు?. తెలంగాణలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించిన నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నడు' అని విమర్శించారు.

**బ్రహ్మాస్త్రం బాకీకార్డు : కేటీఆర్**

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు ప్రారంభించిన 'బాకీ కార్డు' ఉద్యమమే రేవంత్ సర్కార్ భరతం పట్టే బ్రహ్మాస్త్రమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గల్లీ ఎన్నికలైనా, ఢిల్లీ ఎన్నికలైనా గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు. తెలంగాణలోని సబ్బండ వర్ణాలు తిరిగి కేసీఆర్‌నే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నాయని అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ప్రదీప్ చౌదరి, కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తాము ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోయారన్న భ్రమల్లో కాంగ్రెస్ నేతలు ఉన్నారని కానీ ప్రజలకు అన్నీ గుర్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలను గుర్తుచేయడానికే 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభయహస్తం ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు. ఈ బాకీ కార్డే కాంగ్రెస్ పతనాన్ని శాసిస్తుందన్నారు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించుకున్నట్టుగా, హైదరాబాద్ నగరం సమస్యలతో ఆగమాగం అవుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త నగరం కడతానంటూ ఊదరగొట్టే ఉపన్యాసాలు ఇస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ ప్రభుత్వ అసమర్థతతో హైదరాబాద్‌లో చెత్త తీసేవారు కరువయ్యారని, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, వీధి దీపాలు వెలగడం లేదని మండిపడ్డారు. ఉన్న నగరాన్ని ఉద్ధరించలేని వారు కొత్త నగరం కడతామని ఫోజులు కొట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పేర్చలేదని, కనీసం ఉన్న రోడ్లను కూడా సరిగా నిర్వహించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, వృద్ధులు, నిరుద్యోగులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎరువుల కోసం రైతులు యుద్ధాలు చేసే దుస్థితి ఉండేదని, నేడు మళ్లీ అవే రోజులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కోసం క్యూలైన్లలో చెప్పులు పెట్టే, ప్రాణాలు కోల్పోయే దారుణ పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని, తిరిగి కేసీఆర్ నాయకత్వాన్ని ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాగంటి గోపినాథ్ నాయకత్వంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదని గుర్తుచేశారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆయన సతీమణి మాగంటి సునీతను ప్రజలు బంపర్ మెజారిటీతో గెలిపించడం ఖాయమని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రదీప్ చౌదరి వంటి ప్రజాబలం ఉన్న నాయకుల చేరికతో బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. తెలుగువారి ఖ్యాతిని యావత్ భారతదేశానికి చాటిచెప్పింది ఎన్టీఆర్ అయితే, తెలంగాణ అస్తిత్వ పతాకాన్ని, సత్తాను హిమాలయాల స్థాయిలో ఎగరేసింది కేసీఆర్ అని కేటీఆర్ కొనియాడారు.

### దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ

# ముఠా గుట్టురట్టు

సినిమాను రికార్డింగ్ చేస్తారు. సెల్‌ఫోన్లను జేబులో గానీ, పాప్‌కార్న్ డబ్బాలో గానీ పెడతారు. కిరణ్ ముఠా ప్రత్యేకమైన యాప్ ద్వారా సినిమాలను పైరసీ చేసింది. రికార్డింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్ స్క్రీన్‌లైట్ కూడా ఆఫ్‌లో ఉంటుంది. దీంతో ఎవరికీ అనుమానం రాదు. ఇతర భాషల చిత్రాలను రికార్డింగ్ చేసేందుకు ఏజెంట్లు కూడా ఉన్నారు. సినిమా పైరసీలకు నెదర్లాండ్స్‌కు చెందిన ఐపీ అడ్రస్ వాడుతున్నారు. ఈ ముఠాను పట్టుకునేందుకు అత్యాధునిక టెక్నాలజీని వినియోగించాం. పోలీసులు ఎప్పటికీ పట్టుకోలేని టెక్నాలజీ వాడుతున్నామని నిందితులు పేర్కొన్నారు. మేం కేసును ఛేదించిన విధానం తెలిసి షాక్ అయినట్లు నిందితుడు చెప్పాడు. అతడికి బెట్టింగ్ యాప్‌ల నుంచి నెలకు సుమారు రూ.9 లక్షల వరకు చెల్లింపులు జరిగాయి. క్రిప్టో కరెన్సీ పేమెంట్స్ ద్వారా మాకు కొంత క్లూ దొరికింది. మరో ప్రధాన నిందితుడు పట్నాకు చెందిన అశ్వనీకుమార్ హ్యాకింగ్‌లో నిపుణుడు. డిజిటల్ మీడియా సర్వర్స్ మొత్తం హ్యాక్ చేసే నైపుణ్యం అతడికి ఉంది. కొన్ని సందర్భాల్లో గవర్నమెంటు వెబ్‌సైట్లను కూడా హ్యాక్ చేశాడు. ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌ను కూడా హ్యాక్ చేశాడు. ప్రభుత్వ వెబ్‌సైట్లు హ్యాక్ చేసి ఉద్యోగులు, జీతాల వివరాలు పొందగలిగాడు. బిహార్‌లో ఉన్న అతని ఇంటికి మా టీమ్ వెళ్లింది. అతని ఇంటికి 22 సీసీటీవీ కెమెరాలు పెట్టుకున్నాడు. పట్నాలో కూర్చుని పలు కంపెనీల సైట్లను హ్యాక్ చేశాడు. నిందితుల వల్ల పలు కంపెనీలు వాళ్ల ఉద్యోగులను అనుమానించే పరిస్థితి వచ్చింది. సినిమాల పైరసీని ప్రధానంగా ప్రోత్సహిస్తున్నది.. బెట్టింగ్, గేమింగ్ యాప్ నిర్వాహకులు. పైరసీ సైట్లలోని లింక్‌లను క్లిక్ చేస్తే యూజర్ వివరాలన్నీ పైరసీ ముఠాకు వెళ్తాయి. డిజిటల్ మీడియా హౌస్‌లు జాగ్రత్తగా ఉండాలి. సినిమా ఫుటేజీని భద్రపరచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలి. సర్వర్‌కు ఒక ప్రొటెక్షన్ చేస్తే.. మరో మార్గంలో వస్తారు. ఎక్కువ సినిమాల పైరసీ కిరణ్, అశ్వనీకుమార్ ముఠా వల్లే జరిగింది.

**పైరసీ ద్వారా లక్ష డాలర్ల వరకు ఆర్జన**

నిందితులు ఈసీ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి ఎన్నికల జాబితాను మాత్రమే చూశారు. పైరసీ ద్వారా నిందితులు లక్ష డాలర్ల వరకు సంపాదించారు. ఈటీవీ విన్ కంటెంట్‌ను హర్షవర్ధన్ అనే వ్యక్తి పైరసీ చేశాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. సినిమాలను పైరసీ చేయడంలో సమాజ సేవ ఏమీలేదు. పైరసీలు చేసి బెట్టింగ్ యాప్‌ల ద్వారా డబ్బు సంపాదించారు. సిరిల్ అనే వ్యక్తి నెదర్లాండ్, ప్యారిస్ ఐపీ అడ్రస్‌లు పెట్టి సినిమాలు పైరసీ చేసి అప్లోడ్ చేస్తున్నాడు. ఇతనికి బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు నెలకు రూ.9లక్షలు ఇస్తున్నారు. ఇప్పటి వరకు 500 సినిమాలు పైరసీ చేసినట్లు గుర్తించాం" అని సీవీ ఆనంద్ తెలిపారు.

# స్థానికంలో కాషాయ జెండా ఎగురవేస్తాం

విసిగిపోయారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురువేస్తామని ధీమా వ్యక్తం చేశారు రాంచందర్ రావు తమ గెలుపునకు స్థానిక సంస్థల ఎన్నికలే నిదర్శనం కాబోతున్నాయని ఉద్ఘాటించారు. తమకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తుచేశారు. తాను స్వయంగా ఇప్పటివరకు 23 జిల్లాల్లో యాత్రలు చేశానని తెలిపారు. ఇంకో నాలుగు జిల్లాల్లో యాత్ర చేయాల్సి ఉందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను తామే గెలువబోతున్నామని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.


# అబుదాబిలో ఘనంగా బతుకమ్మ ఉత్సవం



**అబుదాబి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ప్రవాస తెలంగాణీయులు అబుదాబిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇండియా సోషల్ అండ్ కల్చరల్ సెంటర్ వేదికగా, తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు ఘనంగా జరిగాయి. ఎడారి ప్రాంతమైన అబుదాబిలో పూలు దొరకడం కష్టమైన నేపథ్యంలో, సంఘ నాయకత్వం ప్రత్యేకంగా తెలంగాణ నుండి వందలాది కిలోల పూలను తెప్పించి నగరాన్ని పూల వనంగా మార్చారు. శనివారం ఉదయం సామూహిక బతుకమ్మ తయారీతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి యు.ఏ.ఈ.లోని భారత రాయబార కార్యాలయం నుండి జార్జీ జార్జ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, తెలంగాణ సంస్కృతిని ప్రశంసించారు. ఆయన ప్రవాస భారతీయుల సాంస్కృతిక అంకితభావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఇండియా సోషల్ అండ్ కల్చరల్ సెంటర్ గౌరవ అధ్యక్షుడు జయచంద్రన్ నాయర్, గౌరవ ఉపాధ్యక్షుడు షాజీ వి.కె., కర్ణాటక రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సర్వోత్తమ్ శెట్టి, మహారాష్ట్ర మండల్ అధ్యక్షుడు విజయ్ మానె, బీహార్, జార్ఖండ్ సంఘ అధ్యక్షుడు దివాకర్ ప్రసాద్, ఇండియా ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ సంఘ అధ్యక్షుడు శ్రీ వినాయక్ ఆవాటే, సంపంగి, బ్యుటికా సంస్థల యాజమాన్యం ప్రత్యేక అతిథులుగా పాల్గొని, ప్రవాస తెలంగాణీయుల సాంస్కృతిక చైతన్యాన్ని అభినందించారు. అలాగే, తమిళ సంఘం, మలయాళీ సంఘం, కన్నడ సంఘం, మరాఠీ సంఘం, గుజరాతీ సంఘం, పంజాబీ సంఘం తదితర రాష్ట్ర సంఘాల ప్రతినిధులు ప్రత్యేక అతిథులుగా విచ్చేసి, బతుకమ్మ ఉత్సవాన్ని తమ హాజరుతో మరింత వైభవవంతం చేశారు. భారతీయ సమైక్యతకు ప్రతీకగా, వారు తమ సంఘాల తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రముఖ కవి, గాయకుడు డా. కోకిల నాగరాజు, యువ గాయని సోనీ యాదర్ల ప్రత్యేకంగా ఇండియా నుండి విచ్చేసి తమ బతుకమ్మ ఆట పాట ల తో అందరినీ ఉర్రూతలూగించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలతో బతుకమ్మ ప్రాంగణం మరో తెలంగాణ ను తలపించింది. అందమైన బతుకమ్మలకు, ముందుగా వచ్చిన బతుకమ్మలకు, నాట్యం చేసిన మహిళలకు, అందంగా ముస్తాబైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఇండియా నుండి తెప్పించిన పిండి వంటలుఅరిసెలు, గారెలు, బోబట్ల వంటి వంటకాలుఅందరినీ ఆకట్టుకున్నాయి. బతుకమ్మ సంబరాలు ప్రతి సంవత్సరం మరింత ప్రాశస్త్యం పొందుతూ అందరి మన్ననలు పొందుతున్నందుకు కార్యవర్గానికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని కార్య నిర్వాహకులు రాజా శ్రీనివాస రావు, గంగారెడ్డి, వం శీ, సందీప్, గోపాల్, సతీష్, పావని, అర్చన, దీప్తి, పద్మజ తదితరులు తెలియ జేశారు "విదేశాల్లో కూడా బతుకమ్మను ఇంత ఘనంగా జరుపుకోవడం ఎంతో గర్వకారణం" అని నిర్వాహకులు తెలిపారు.

# పైరసీతో నిర్మాతలకు కోట్లల్లో నష్టాలు

- మొదటిసారిగా పైరసీ గ్యాంగ్‌ను పట్టుకున్నాం : సీపీ ఆనంద్




**హైదరాబాద్, సెప్టెంబర్29 (జనంసాక్షి) :** సినిమాల పైరసీ వల్ల నిర్మాతల కష్టం వృథా అవుతోందని.. ఈ పరిశ్రమ బాగా ప్రభావానికి గురవుతోందని హైదరాబాద్ సీపీసీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. పైరసీపై తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. నాలుగు నెలలు కష్టపడి దర్యాప్తు చేశామని గుర్తుచేశారు. దేశంలో మొదటి సారి పైరసీ చేస్తున్న ఓ గ్యాంగ్‌ను పట్టుకున్నామని వెల్లడించారు. 2023లో భారత దేశంలోని చిత్ర పరిశ్రమ రూ. 22,400 కోట్లు పైరసీతో నష్టపోయిందని చెప్పుకొచ్చారు సీపీ సీవీ ఆనంద్. 2024లో తెలుగు చిత్ర పరిశ్రమ రూ. 3700 కోట్లు నష్టపోయిందని తెలిపారు. ఈ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకుని సమగ్ర దర్యాప్తు చేశామని పేర్కొన్నారు. పైరసీ మూవీస్ వల్ల ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు కూడా ప్రేక్షకులు అలవాటు పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఓ వెబ్‌సైట్, టెలిగ్రామ్ ద్వారా పైరసీ మూవీలు స్ట్రీమింగ్ చేస్తున్నారని వివరించారు. సర్వర్స్ హ్యాకింగ్‌తో పాటు క్యామ్ కార్డర్ ద్వారా నిందితులు సినిమాలను పైరసీ చేస్తున్నారని తెలిపారు. బెట్టింగ్ గేమింగ్ యాప్స్ నిర్వాహకులు పైరసీ చేసేవారికి డబ్బులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు సీపీ సీవీ ఆనంద్. బెట్టింగ్ యాప్ నిర్వాహకులు పైరసీ మూవీల ద్వారా వారి యాప్‌లను ప్రచారం చేసుకుంటున్నారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు అందుకున్న వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. తమిళ్ బ్లాస్టర్స్, ఫైవ్ మూవీ రూల్స్, తమిళ్ మూవీ వెబ్‌సైట్ లలో పైరసీ సినిమాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన జానా కిరణ్ కుమార్ అత్తాపూర్‌లోని మంత్ర మాల్ థియేటర్‌లో సినిమా కాపీ చేశాడు. ఫిర్యాదు అనంతరం 44 మంది అనుమానితులను విచారించిన తర్వాత అసలు నిందితుడు జానా కిరణ్ కుమార్‌గా తేలింది. చాలా సినిమాలని అత్తాపూర్‌లోని మంత్ర థియేటర్‌లో మొబైల్‌తో రికార్డ్ చేసి సిరిల్ అనే వ్యక్తికి అందచేశారు. నలభై మూవీలు థియేటర్‌లో కాపీ చేశాడు. ప్రతి సినిమాకు 300 నుంచి 400 డాలర్లను బిట్ కాయిన్స్ రూపంలో కిరణ్ కుమార్ తీసుకుంటున్నాడు. అనంతరం క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ ఫ్లాట్ ఫాంని ఉపయోగించి ఇండియన్ కరెన్సీలోకి మార్చుకుంటున్నారు. సినిమా పైరసీ చేయడానికి అనువైన సీటు చూసుకుని.. టికెట్ బుక్ చేసుకుని హై ఎండ్ కెమెరా ఉన్న ఫోన్‌తో రికార్డ్ చేస్తారు. స్క్రీన్ ఆఫ్ ఉన్నా కెమెరాల్లో వీడియో రికార్డ్ చేసే యాప్ ద్వారా అనుమానం రాకుండా ఇదంతా చేస్తున్నారు. అలాగే, బీహార్‌కు చెందిన అర్సలన్ అహ్మద్ కూడా హిందీ భోజ్‌పురి సినిమాలు రికార్డ్ చేసి సిరిల్‌కు పంపుతాడు' అని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# గల్లీల్లోనూ కాషాయ జెండా ఎగరేస్తాం

- కరీంనగర్, సిరిసిల్ల జడ్పీ పీఠాలు మావే
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి బీజేపీ సిద్ధంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. "నాకు రాజకీయ జన్మనిచ్చిన కరీంనగర్ పార్లమెంట్ ప్రజల కోసం, కాషాయ జెండాను నమ్ముకున్న నా కార్యకర్తలను గెలిపించడం కోసం ఢిల్లీ ఎన్నికల్లోనే కాదు... గల్లీ ఎన్నికల్లోనూ కొట్లాడేందుకు నేను సిద్ధం. స్థానిక సమరంలో ఈసారి బీజేపీ కొత్త చరిత్రను లిఖించబోతోంది. కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలపై కాషాయ జెండా ఎగరేసి తీరుతాం" అని స్పష్టం చేశారు. ఆసియా కప్, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లలో ఇండియా ఘన విజయం సాధించినట్లుగానే రేపు జరగబోయే కరీంనగర్ పల్లె లీగ్ (కేపీఎల్ లీగ్), సిరిసిల్ల పల్లె లీగ్ (ఎస్పీఎల్) స్థానిక పోటీల్లోనూ బీజేపీ అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న నిఖార్సైన బీజేపీ కార్యకర్తలకే ఈసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో టిక్కెట్లు ఇస్తామని ప్రకటించారు. టిక్కెట్లు ఇవ్వడంతోపాటు గెలిపించుకుని కాషాయ కార్యకర్తల నుదుటిన విజయ తిలకం దిద్దుతామని తెలిపారు. ఈరోజు స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడాన్ని భారతీయ జనతా పార్టీ పక్షాన స్వాగతిస్తున్నాం. నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనా వైఫల్యాలవల్ల స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని, గత బీఆర్ఎస్ పాలనలో పంచాయతీలకు నిధులివ్వకపోవడమే కాక అభివృద్ధి పేరుతో నాటి సర్పంచులు చేసిన పనులకు కూడా బిల్లులివ్వకుండా వేధించిందని, కేంద్రం నుండి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించిందని, కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే రాష్ట్ర ప్రభుత్వం వద్ద పైసల్లేవంటూ స్థానిక సంస్థలకు నిధులివ్వకుండా ఈ పార్టీ చేతులెత్తేసిందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ చేసిన మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఎండగడతామన్నారు. అత్యధిక మండల పరిషత్ పీఠాలతోపాటు కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలను సైతం కైవసం చేసి ఈ కొత్త చరిత్రను లిఖించబోతున్నామన్నారు. బీజేపీ పక్షాన నిలబడే అభ్యర్థులను ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పరాభవమే..

- అధికారం పోయిందన్న అక్కసుతో కేటీఆర్ మాట్లాడుతున్నారు..
- ఎంపీ డాక్టర్ మల్లు రవి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** రాబోయే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పరాభవం తప్పదని.. నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి జోస్యం చెప్పారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం నాడు మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే.. తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతోందని వ్యాఖ్యానించారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లును ప్రవేశపెట్టి.. గవర్నర్ దగ్గరకు పంపింది కాంగ్రెస్ ప్రభుత్వం. 3 నెలల వరకు బిల్లును క్లియర్ చేయకపోతే.. ఆమోదించినట్టుగానే భావించి.. ప్రభుత్వం అమలు చేయాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు కూడా.. అక్టోబర్ 30 లోపే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చెప్పింది. ఈ నేపథ్యంలో.. 29 వ తేదీన ఎన్నికల సంఘం లోకల్ బాడీ ఎలక్షన్ నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చిత్తశుద్ధితో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సంకల్పించారు. గతంలో ఎంతో మంది ఈ రిజర్వేషన్లపై రాజకీయాలు చేసినా.. అది కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే సాధ్యమైంది. రిజర్వేషన్ల విషయంలో ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శించారు. అలా విమర్శించిన బీఆర్ఎస్ నేతలు తమ పశ్చాత్తాపాన్ని వ్యక్తపర చాలని డిమాండ్ చేస్తున్నాం' అని డిమాండ్ చేశారు.

'ఈ సమయంలోనూ కూడా కేటీఆర్ అచ్చంపేట మీటింగ్‌లో సీఎం గురించి ఇష్టానుసారంగా మాట్లాడారు. అధికారం నుంచి దిగిపోయి.. ప్రజలు ఛీకొట్టినా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. అయినా వారిలో మార్పు రావడం లేదు. ముఖ్యమంత్రి గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇప్పుడు సీఎం.. అమలు చేయని వాటిని ప్రజల ముందు పెడతామని అంటున్నారు. పెట్టిండి.. 10 ఏళ్లలో మీరు రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని చెప్పారు. కానీ ఇవ్వలేదు. కానీ మేము ఒకటిన్నరేళ్లలో.. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్‌పై రాయితీ ఇస్తున్నాం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని. 65 వేల ఉద్యోగాలు టీజీపీఎస్సీ ద్వారా ఇచ్చాం. మీలాగా హామీలు ఇచ్చి.. ప్రజలను మోసం చేయలేదు' అని ఎంపీ మల్లు రవి ఫైర్ అయ్యారు.

# ప్రేమ వ్యవహారంలో దారుణం

- యువకుడిని కొట్టి చంపిన యువతి బంధువులు

**జగిత్యాల,సెప్టెంబర్29 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లిలో ప్రేమ వ్యవహారం దారుణానికి దారితీసింది. గ్రామానికి చెందిన డ్రైవర్ ఎదురగట్ల సతీష్ (25)ను, అతని ప్రేమ వ్యవహారం నేపథ్యంలో యువతి కుటుంబ సభ్యులు దారుణంగా హతమార్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సతీష్, అదే గ్రామానికి చెందిన ఓ యువతితో కొంతకాలంగా ప్రేమలో ఉన్నాడు. ఈ విషయం తెలిసిన ఆమె బంధువులు పలుమార్లు హెచ్చరించారు. ఆ యువతికి మరో వివాహ సంబంధం చూస్తున్న నేపథ్యంలో, ఈ ప్రేమను కొనసాగించొద్దని సతీష్‌ను వారించారు. అయితే కలత చెందిన సతీష్, ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ యువతి ఫొటో పెట్టి, తాను ప్రేమిస్తున్నానని ప్రకటిస్తూ, ఆమెను ఎవరూ పెళ్లి చేసుకోరాదని సందేశం పోస్ట్ చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువతి బంధువులు, శనివారం రాత్రి సతీష్ ఇంటి దగ్గరికి వెళ్లి కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాల కారణంగా సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. జగిత్యాల గ్రామీణ పోలీసు ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం ముగ్గురు నిందితులు నథారి వినంజీ, శాంత వినంజీ, జలాల్‌పై హత్య కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించగా, నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# ఎక్టా ఆద్వర్యంలో ఘనంగా 15వ మెగా బతుకమ్మ సంబరాలు

- ప్రత్యేక ఆకర్షణగా అతి పెద్ద బతుకమ్మ





**దుబాయి(జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక అయిన తెలంగాణ పూల పండుగ బతుకమ్మ సంబరాలు తేదీ 28 సెప్టెంబర్ ఆదివారం దుబాయి లోని అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్ ఆడిటోరియంలో భారీ జన సందోహం నడుమ ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక మరియు వెల్ఫేర్ సంఘం(ఎక్టా) ఆధ్వర్యంలో ఎంతో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మహబూబ్ నగర్ లోకసభ సభ్యురాలు డి.కె అరుణ, మెదక్ లోకసభ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, గౌరవ అతిథులుగా కాన్సులేట్ జనరల్ సతీష్ కుమార్ శివన్, కార్యక్రమానికి స్పెషల్ అట్రాక్షన్‌గా ప్రముఖ తెలంగాణ జానపద గాయనిలు మధుప్రియ, ముకుంద అలాగే ఫోక్ డాన్సర్స్ మౌనిక డింపుల్, లాస్య స్మైలీ అలాగే రెండు తెలుగు రాష్ట్రాల నుండి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. దుబాయ్ లోని అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్ లో జరిగిన ఈ వేడుకలకు సుమారు 5000 పైగ తెలంగాణ ప్రవాసియులు పాల్గొన్న ఈ వేడుకల్లో ఉదయం నుండి మహిళా విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమ వేదికలోనే ఆడపడుచులు రంగు రంగు పూలతో బతుకమ్మలను పేర్చారు, సప్తవర్ణల శోభితిమైన పూలదొంతరుల బతుకమ్మలు చూడముచ్చటగా కనిపించాయి. ఈ సందర్భంగా ఎక్టా వ్యవస్థాపక అధ్యక్షులు కిరణ్ కుమార్ పీచర, అధ్యక్షులు జగదీష్ రావు చీటీ మాట్లాడుతూ 2011 నుండి క్రమం తప్పకుండా యూఏఈ గడ్డ మీద వందల మందితో ప్రారంభమైన మొదటి బతుకమ్మ ఈ రోజు వేలాది మంది తెలంగాణ కుటుంబ సభ్యుల మధ్య జరుపుకుంటున్నామన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి మా గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జానపద గాయినిలు మధుప్రియ, ముకుంద పాడిన బతుకమ్మ పాటలు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసాయి. ఫోక్ డాన్సర్ మౌనిక డింపుల్ మరియు స్మైలీ లాస్య ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నపిల్లలు సైతం సాంప్రదాయ దుస్తుల్లో "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ చప్పట్లతో హుషారుగా ఆడిపాడటం అందరిని ఆకట్టుకొన్నాయి. ఈ సంబరాల్లో ఎక్టా అధ్యక్షులు జగదీష్ రావు చీటీ, జనరల్ సెక్రటరీ రాణి కోట్ల, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అలిగేటి, జాయింట్ సెక్రటరీ శేఖర్ గౌడ్ గుండవేని , కోశాధికారి తిరుమల్ రావు, ఎక్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వినోద్ ఆచార్యులు, సారిక పీచర, అన్నపూర్ణ, సామ శ్రీనివాస్ రెడ్డి, రఘు అలిగేటి, రమణ స్వర్గం, రాము కందుకూరి , సంతోష్ కుమార్, మధు కుమార్, రాజేష్, పోలంపల్లి , వనజ , రాము జల, మమత కస్తూరి , కార్తీక్ రెడ్డి, అజహర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# కాళేశ్వరంలో ప్రమాద హెచ్చరికలో వరద ప్రవాహం



**కాళేశ్వరం, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ సంగమ క్షేత్రం కాళేశ్వరం వద్ద గోదావరి , ప్రాణహిత నదులకు వరద ప్రవాహం పోటెత్తింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు అధికంగా వచ్చి చేరడంతో పుష్కర ఘాటు వద్ద వరద నీరు పలు దుకాణాల లోనికి ప్రవేశించింది. దీంతో అధికారులు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వార్నింగ్ లెవెల్ 12 మీటర్లకు ఉండగా డేంజర్ లెవెల్ 13 మీటర్ల ను దాటి వరద నీరు ప్రవహిస్తుంది. సరస్వతి ఘాట్ వద్ద పుష్కరాల సందర్భంగా ఏర్పాటుచేసిన జ్ఞాన దీపాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. సాధారణ పుష్కర ఘాటు వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ కట్ట, భక్తుల కోసం నిర్మిస్తున్న బాత్రూము లు వరద నీటిలో ఉండిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ నుంచి 11 లక్షల 20 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు కిందికి విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం అధికంగా ఉండడంతో పుష్కర ఘాట్ ఒడ్డు వద్దనున్న పలు దుకాణాలను పోలీసులు ఖాళీ చేయించి సురక్షిత ప్రదేశాలకు పంపించారు. నది వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలు నది వద్దకు వెళ్లకుండా నిలిపి వేస్తున్నారు. భక్తులు వరద నీటిలోనికి ప్రవేశించకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ఎస్సై తమాషా రెడ్డి ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు, భక్తులకు తగు సూచనలు చేస్తున్నారు.వరదల వల్ల పలు పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి.

# ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వండి



**నాగర్‌కర్నూల్ (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ కుమార్ ను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునగాల సతీష్ కుమార్ కలిసారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో ఉద్యోగ ఉపాధ్యాయుల కు కేటాయిస్తున్న విధులలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధులు, క్రానికల్ డిసీజెస్ ఉన్నటువంటి ఉద్యోగ ఉపాధ్యాయులను తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి మినహాయించాలని కోరారు. దశరా సెలవుల రీత్యా దూరప్రాంతంలో ఉండి ఎన్నికల బాధ్యతలకు కేటాయించబడి, శిక్షణకు హాజరు కాలేని ఉద్యోగ ఉపాధ్యాయులకు తర్వాతి షెడ్యూలు లో ఎలక్షన్ శిక్షణకు అనుమతించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

# హైదరాబాద్ పీఆర్‌సీఐకి అవార్డులు




**పనాజీ (జనంసాక్షి) :** గోవా, పంజిమ్‌లో సెప్టెంబర్ 26, 27 తేదీల్లో నిర్వహించిన పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) 19వ గ్లోబల్ కాన్‌క్లేవ్‌లో హైదరాబాద్ పీఆర్‌సీఐ అవార్డులు గెలుచుకుంది. అంతర్జాతీయ స్థాయిలో ఉన్న పీఆర్‌సీఐ తన 19వ గ్లోబల్ కాన్‌క్లేవ్‌ను గోవా, పంజిమ్‌లోని హోటల్ ఫెర్న్ కడంబా వద్ద ఘనంగా నిర్వహించింది. కాన్‌క్లేవ్ ప్రారంభోత్సవానికి గోవా రాష్ట్ర గవర్నర్ పి.అశోక్ గజపతి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అవార్డుల ప్రదానోత్సవానికి గోవా ముఖ్యమంత్రి డా. ప్రమోద్ సావంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో 'ఉత్తమ పరిపాలన, పాలన అవార్డు'ను పీఆర్‌సీఐ హైదరాబాద్ ఛాప్టర్ దక్కించుకున్నారు. హైదరాబాద్ పీఆర్‌సీఐ హైదరాబాద్ కమిటీ చైర్మన్‌గా షకీల్ అహ్మద్, వైస్ చైర్‌పర్సన్‌గా శ్రీమతి అనీజా , కార్యదర్శిగా ఫిలిప్ జా షువా, జాయింట్ సెక్రటరీగా జేకబ్ రాస్, కోశాధికారిగా నోయెల్ రాబిన్సన్ ఉన్నారు. జాతీయ స్థాయిలో 'మోస్ట్ వాల్యూయబుల్ లీడర్ అవార్డు'ను ప్రకాశ్ జైన్ అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం, డీఎస్‌సీఐ, ఎన్ఏఎస్ఎస్‌సీఓఎం సంయుక్తంగా నడుస్తున్న సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమాలకుగాను ప్రతిష్టాత్మక 'చాణక్య అవార్డు' లభించింది. హైదరాబాద్ పీఆర్‌సీఐ చైర్మన్ షకీల్ అహ్మద్‌కు గోవా ముఖ్యమంత్రి డా. ప్రమోద్ సావంత్ 'జి.పి. జైకుమార్ మెమోరియల్ అవార్డు ఫర్ ఇంటిగ్రల్ పబ్లిక్ రిలేషన్స్'ను ప్రదానం చేశారు.

# పేదోళ్లను మోసం చేశారు!

- 45 లక్షలతో ఉడాయించిన భూ మాయగాళ్లు.
- భూమాయ గాళ్ళ ఇంటి ఎదుటే బాధితుల వంటావార్పు, రాత్రి నిద్ర.



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 29, (జనంసాక్షి) :** అమాయకంగా కనిపిస్తే చాలు మోసం చేయాలని చూస్తారు. కాని సగటు పేదోనికి కడుపు మండితే పరిస్థితులు ఎలా ఉంటాయో ఇదే ఉదాహరణ. నకిలీ అగ్రిమెంట్ భూమి పత్రాలను చూపించి నిరుపేదలైన అమాయకుల వద్ద రూ. 45 లక్షలు దండుకొని భూ మాయగాళ్ళు ఊడాయించిన ఘటన బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన రాంటెంకి హరికృష్ణ, రాంటెంకి శివ, పాత మంచిర్యాలకు చెందిన బొలిశెట్టి భీమయ్య, భీమిని రాంపూర్ కు చెందిన మొండి, చిన్న బూదకు చెందిన లగిశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తులు పెద్దపల్లి జిల్లా మంథని సమీపంలో గల దుబ్బపల్లి గ్రామానికి చెందిన బాలాని గంగరాజు, పూజారి సమ్మయ్య, పూజారి నాగేష్, దాసరి శ్యామ్, గోపి, పోల రాములు అనే వడ్డెర కులస్తుల నుండి రూ.45 లక్షలను తాండూర్ మండలంలోని అచ్చులాపూర్ శివారులో గల సర్వే నంబర్ 340/1, 341/బి లలో 12 ఎకరాలు నకిలీ అగ్రిమెంట్ పత్రాలను చూపి దండుకున్నారు. డబ్బులను చెల్లించి రెండు నెలలు గడుస్తున్న భూమి అమ్మకానికి పెట్టిన వ్యక్తులు రిజిస్ట్రేషన్ కు రాకపోవడంతో అనుమానం వచ్చి బాధితులు ఆరా తీయగా భూ మాయగాళ్ళ వలలో పడి మోసపోయినట్లు గుర్తించారు. దీంతో ఫోన్లో సంప్రదించేందుకు ప్రయత్నించిన వారు అందుబాటులోకి రాకపోవడంతో బాధితులు తమ కుటుంబాలతో బట్వాన్ పల్లి గ్రామానికి వచ్చి తమను మోసం చేసిన రాంటెంకి హరికృష్ణ, రాంటెంకి శివల ఇళ్ళ ముందు ఆందోళనకు దిగారు. వందమందికి పైగా గ్రామస్తులు మహిళలు, చంటి పిల్లలతో అక్కడే వంటలు చేసుకుని రాత్రి రోడ్డుపై అక్కడే నిద్రించారు. తమకు మధ్యవర్తిగా వ్యవహరించి డబ్బులు దండుకున్న పాత మంచిర్యాలకు చెందిన బొలిశెట్టి భీమయ్య అనే వ్యక్తిని తమ అదుపులో ఉంచుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకూ గ్రామంలోనే ఉంటామని చెబుతున్నారు. కాగా ఎంతకు సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం సైతం వారి ఆందోళన కొనసాగించారు. వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఒకపందిని మోసగాళ్ల ఇంటిముందే కోసి, మాంసాన్ని వండుకొని తిని నిరసన తెలిపారు. నకిలీ భూమి పత్రాలు చూపించి తమ నుండి రూ 45 లక్షలు దండుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు డబ్బులు చెల్లించే వరకు గ్రామంలోనే నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

# స్వతంత్ర భారతావనిలో రాష్ట్రాల ఏర్పాటు

## సెప్టెంబర్ 30... ఫజల్ అలీ కమిషన్ నివేదిక సమర్పణ దినం

స్వతంత్ర భారతంలో రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ ఒక ప్రధాన ఘట్టం, ముఖ్యమైన అంశం. దీని కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ కమిటీలను నియమించగా, అవి పలు సిఫార్సులు చేశాయి. 1955 సెప్టెంబర్ 30న ఫజల్ అలీ కమిషన్ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సందర్భంగా రాష్ట్రాల పునర్ విభజన కమిటీల గురించి పూర్వా పరాల గురించి తెలిపే ప్రయత్నం.

ఖాన్ బహదూర్ సయ్యద్ సర్ ఫజల్ అలీ (19 సెప్టెంబర్ 1886 – 22 ఆగస్టు 1959)... 15 అక్టోబర్ 1951నుండి 30 మే 1952 సుప్రీం కోర్టు న్యాయ మూర్తిగా, 1952 నుండి 1956 వరకు ఒడిశా గవర్నర్‌గా మరియు 1956 నుండి 1959 వరకు అస్సాం గవర్నర్‌గా ఉన్నారు. భారతదేశ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ గురించి సిఫార్సులు చేసిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌కు ఫజల్ అలీ నాయకత్వం వహించారు .

బ్రిటీష్ సామ్రాజ్యం నుంచి 1947లో స్వాతంత్ర్యం పొందాకా భారతదేశం వేర్వేరు కేటగిరీలుగా విభజించి వుంది. అవి ఇలా ఉన్నాయి.

1. **పార్ట్ ఎ రాష్ట్రాలు** (పాత బ్రిటీష్ ఇండియా ప్రావిన్సులు) 9 రాష్ట్రాలు: అస్సాం, బీహార్, బొంబాయి, తూర్పు పంజాబ్, మధ్యప్రదేశ్, మద్రాస్, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్
2. **పార్ట్ బి రాష్ట్రాలు** (గత సంస్థానాలు లేదా ఒప్పంద రాష్ట్రాల సమూహాలు)...9 రాష్ట్రాలు: హైదరాబాద్, జమ్ము అండ్ కాశ్మీర్, మధ్యభారత్, మైసూర్, పాటియాలా, తూర్పు పంజాబ్, రాష్ట్రాల యూనియన్ (పిఈపిఎస్‌యు), రాజస్థాన్, సౌరాష్ట్ర, ట్రావె న్కోర్–కొచ్చిన్, వింధ్య ప్రదేశ్
3. **పార్ట్ సి రాష్ట్రాలు** (గత సంస్థానాలు లేదా ప్రావిన్సులు)..10 రాష్ట్రాలు: అజ్మీర్, కూర్గ్, కూచ్ – బీహార్, భోపాల్, బిలాస్ పూర్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, కచ్, మణిపూర్, త్రిపుర
4. **పార్ట్ డి (కేంద్రపాలిత ప్రాంతం)..** అండమాన్ నికోబార్ దీవులు.

ఇవన్నీ బ్రిటీష్ వారి రాజకీయ, సైనిక, వ్యూహాత్మక ప్రణాళికకు అనుకూలంగా ఏర్పడుతూ వచ్చాయి. స్వతంత్ర్య భారతంలో రాష్ట్రాల సరిహద్దులు పునర్వి భజనకు ఒక ప్రాతిపదిక కావాల్సి వచ్చింది. భాషల ప్రాతిపదికన పునర్విభజన జరగాలన్నది ప్రతిపాదనల్లో ఒకటి. 1920 నుంచి భారత జాతీయ కాంగ్రెస్ ప్రావిన్సు లను భాష ప్రాతిపదికన ఏర్పాటు చేయడానికి కట్టుబడి వుంది.

స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రాలను భాషా ప్రాతిపదికన పునర్విభజిస్తామన్నది కాంగ్రెస్ లక్ష్యాల్లో ఒకటి. ఇది 1945–46 ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీల్లో కూడా చేరింది. విభజన సమయంలో మత వైషమ్యాలతో విపరీతమైన రక్తపాతం, హింస చోటు చేసు కోవడం వంటివి భారతదేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, తొలి ఉపప్రధాని, గృహమంత్రి వల్లభ్ భాయి పటేల్ మొదలైన వారిలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుపై వైఖరిలో మార్పు తీసుకు వచ్చింది.

1948లో రాజ్యాంగ అసెంబ్లీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఎస్.కె.దార్ (అలహాబాద్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి), జె.ఎన్.లాల్ (న్యాయవాది), పన్నాలాల్ (విశ్రాంత భారత సివిల్ సర్వీసెస్ అధికారి)లతో దార్ కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ తన నివేదికను సమర్పిస్తూ పూర్తిగా కానీ, ప్రధానంగా కానీ భాషా ప్రాతి పదికన రాష్ట్రాలను ఏర్పాటు చేయడం దేశ విస్తృత ప్రయోజనాలకు అనుగుణమైనది కాదన్నారు. దార్ కమిషన్ సూచనలను అధ్యయనం చేయడానికి జవహర్ లాల్ నెహ్రూ, వల్లభ్ భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్యలతో జేవీపీ కమిటీ వేశారు. కొత్త ప్రావిన్సుల ఏర్పాటుకు ప్రస్తుతం సరైన సమయం కాదనీ, ఆ కమిటీ తేల్చి చెప్పింది.



డా. అంబేద్కర్ ధార్ కమిషన్‌కు ఒక మెమోరాండం సమర్పించారు (తేదీ 14 అక్టోబర్ 1948), భాషా ప్రావిన్సుల ఏర్పాటుకు మద్దతుగా, ప్రత్యేకంగా మరాఠీ –మహారాష్ట్ర మహారాష్ట్ర రాష్ట్రం బొంబాయి రాజధానిగా ఏర్పడింది. 1952 నాటికి, మద్రాస్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తెలుగు–మెజారిటీ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ చాలా శక్తిమంతంగా మారింది. తెలుగు మెజారిటీ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ చేస్తున్న కార్యకర్తలలో ఒకరైన పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి 16 డిసెంబర్ 1952 న మరణించారు.

రాష్ట్రాల పునర్విభజన కమిషన్ (ఎస్సార్సీ) లేదా ఫజల్ అలీ కమిషన్ డిసెంబర్ 29, 1953లో భారత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల సరిహద్దులను పున: సమీక్షించడంలో సలహా ఇచ్చేందుకు ఏర్పరిచింది. కమీషన్ లో ఫజల్ అలీ, కె.ఎం.పణిక్కర్, హెచ్.ఎం.కుంజ్రూలు ఉన్నారు.

తెలుగు–మెజారిటీ ఆంధ్ర రాష్ట్రం 1953 లో ఏర్పడింది. ఇది దేశవ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తించింది, భాషా సంఘాలు ప్రత్యేక రాష్ట్రాల కోసం డిమాండ్ చేశాయి. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ కమిషన్ నివేదిక ప్రభుత్వం 30–సెప్టెంబర్ –1955 మధ్యాహ్నం అందుకుంది.


ఈ కమిషన్ తన నివేదికలో....మూడు అంచెల (పార్ట్–ఎ/బి/సి) రాష్ట్ర వ్యవస్థను రద్దు చేయాలని, రాజప్రముఖ సంస్థ మరియు పూర్వ సంస్థానాలతో ప్రత్యేక ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఆర్టికల్ 371 ద్వారా భారత ప్రభుత్వంలో ఉన్న సాధారణ నియంత్రణను రద్దు చేయాలని, అండమాన్ నికోబార్, ఢిల్లీ మరియు మణిపూర్ 3 రాష్ట్రాలు మాత్రమే కేంద్రపాలిత ప్రాంతాలుగా ఉండాలని, ఇతర పార్ట్–సి/డి భూభాగాలను పక్క రాష్ట్రాలతో విలీనం చేయాలని నివేదించింది. ఈ నివేదిక 14 డిసెంబర్ 1955 న లోక్ సభలో పెట్టబడింది.

కమిషన్ చేసిన సలహాల్లో కొన్నిటిని కేంద్ర ప్రభుత్వం 1956 నాటి రాష్ట్రాల పునర్విభజన చట్టం, 1956లో పరిగణనలోకి తీసుకుంది. దీనికి అనుగుణంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చట్టం, ఏడో రాజ్యాంగ సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పార్ట్ –ఎ,పార్ట్ –బి, పార్ట్–సి అనే వ్యత్యాసాలను రద్దు చేసి రాష్ట్రాలను పునర్ వ్యవస్థీ కరించింది. ఫలితంగా 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలతో నూతన వ్యవస్థ అమల్లోకి వచ్చింది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ ప్రాంతాన్ని కలుపుకొని ఆంధ్ర ప్రదేశ్‌గా రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణతో కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

1956 తర్వాత...గుజరాత్ (1 మే, 1960) 15వ రాష్ట్రంగా, నాగాలాండ్ (1 డిసెంబర్, 1963) 16వ రాష్ట్రంగా ఏర్పాటైంది. హర్యానా(1 నవంబర్, 1966)17వ రాష్ట్రంగా, 18వ రాష్ట్రంగా, మణిపూర్ (21 జనవరి, 1972) 19వ రాష్ట్రంగా, త్రిపుర (21 జనవరి, 1972) 20వ రాష్ట్రంగా, మేఘాలయ (21 జనవరి, 1972) రాష్ట్రంగా, సిక్కిం (16 మే, 1975) 22వ రాష్ట్రంగా, మిజోరాం (20 ఫిబ్రవరి, 1987) 23వ రాష్ట్రంగా, అరుణాచల్ ప్రదేశ్ (20 ఫిబ్రవరి, 1987)24వ రాష్ట్రంగా, గోవా (30 మే, 1987) 25వ, ఛత్తీస్‌గఢ్(1 నవంబర్, 2000) 26వ రాష్ట్రంగా, ఉత్తరాఖండ్ (9 నవంబర్, 2000) 27వ రాష్ట్రంగా, జారండ్ (15 నవంబర్, 2000) 28వ రాష్ట్రంగా జారండ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ (2 జూన్, 2014): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించి 29వ రాష్ట్రంగా 10 జిల్లాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయింది. భారత దేశంలో ప్రస్తుతం మొత్తం 28 రాష్ట్రాలు మరియు 8 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
9440595494

# కులవ్యవస్థపై గర్జించిన కవి గుర్రం జాషువా



భారతీయ సమాజంలో కులం వ్యక్తి గౌరవానికి, హోదాకు కీలకమైన పాత్ర పోషిస్తూ, మానవ ఉన్నతికి గీటురాయిగా మారింది. ఈ క్రమంలో సాహిత్యం ధనికులు, అగ్రవర్ణాలకు వెట్టిచాకిరీ చేసింది. రచనలు కొందరు గీసిన హద్దుల్లో తిరిగాయి, అంటరానితనం లక్షణాలు కమ్ముకున్నాయి. ఈ అన్యాయంపై సామాజిక సమరం సాగించిన కవి గుర్రం జాషువా. "పద్యమంటే పొగడ్తేనా? రాజు స్తుతి లేకుంటే రచన కాదా? కులుకులు లేని కవిత ఉండదా? సత్యం పలికితే సాహిత్యం ఒప్పుకోదా?" అంటూ గర్జించిన జాషువా, తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించిన నవయుగ కవిచక్రవర్తి, దళిత సాహిత్యానికి పితామహుడు. 1895 సెప్టెంబర్ 28న గుంటూరు జిల్లా వినుకొండలోని చాట్రగడ్డపాడులో అంటరాని కులంలో జన్మించిన జాషువా, బాల్యం నుంచే కుల వివక్ష, అవమానాలు, నిందలను ఎదుర్కొన్నాడు. ఈ చేదు అనుభవాలను కవిత్వంగా మలిచి, మానవ హక్కుల కోసం పోరాటం సాగించాడు. ఆ కాలంలో భావ కవిత్వం, అభ్యుదయ, విప్లవ కవిత్వం ఉవ్వెత్తున పొంగుతుండగా, జాషువా దళిత కవిత్వానికి గొంతునిచ్చాడు. పీడిత వర్గాల సమస్యలను, కుల వివక్షతో కూడిన అసమానతలను, పేదరికాన్ని తన రచనల్లో ప్రతిబింబించి, సాహిత్యాన్ని విశ్వదృష్టికి పరిచయం చేశాడు. "గబ్బిలం", "అనాథ", "స్వప్నకథ" వంటి కావ్యాలతో దళిత జీవన బాధలను, ఆత్మగౌరవాన్ని చిత్రించాడు. "అనాథ" తొలి తెలుగు దళిత మహిళా కావ్యంగా గుర్తింపు పొందింది. గబ్బిలం, గాడిద, గుర్రం వంటి ఉపమానాలతో దళిత జీవన వైఖరిని విలక్షణంగా వర్ణించాడు. అంటరానితనం, మూఢాచారాలపై సవాళ్లు విసిరిన ఆయన కవిత్వం సహనం, సమానత్వానికి పిలుపునిచ్చింది. 130వ జయంతి సందర్భంగా కూడా జాషువా లేవనెత్తిన కుల, మత భేదాలు, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయి. "చెప్పులు కుట్టు వాని సేవకు భరతవాని అప్పు పడ్డది" అని జాషువా చెప్పిన ఆర్థిక సూత్రం, శ్రామిక శూద్ర కులాలకు ఈ దేశం ఋణపడి ఉందని నొక్కిచెప్పింది. ఈ ఆలోచన డాక్టర్ విశారదన్ మహారాజ్ స్థాపించిన దళిత శక్తి ఉద్యమ కరపత్రంగా నిలిచి, పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రలో చైతన్యాన్ని రగిలించింది. జాషువా రచనలు అంబేద్కర్ సిద్ధాంతాలను కళాత్మకంగా వివరించి, సమాజాన్ని చైతన్యపరిచాయి. కాన్షిరాం జాషువా విగ్రహ ఆవిష్కరణకు వినుకొండ వచ్చినప్పుడు ఆయన ధిక్కార స్వరం ప్రపంచానికి పరిచయమైంది. జాషువా కవిత్వం బహుజన విముక్తి పోరాటంగా, కుల వ్యవస్థపై గర్జనగా నిలిచి, ఇప్పటికీ మనలను నడిపిస్తోంది. కేవలం ఊహాజనిత కవిత్వం విప్లవాన్ని తీసుకురాదు, క్షేత్రస్థాయి ప్రజా పోరాటం నుంచి వచ్చే కవిత్వమే విప్లవానికి తోడ్పడుతుంది. జాషువా తన గురువులుగా పేదరికం, కులమత భేదాలను చెప్పాడు. ఒకటి సహనాన్ని నేర్పితే, మరొకటి ఎదిరించే శక్తిని పెంచిందని, బానిసత్వాన్ని కలిగించలేదని అన్నాడు. నేటి సమాజంలో దళిత, వెనకబడిన వర్గాల కవులు, కళాకారులు ఉన్నప్పటికీ, జాషువా లాంటి నికార్సైన ప్రతిఘటన కరవైంది. చాలామంది అగ్రకుల పాలక పక్షంలో నిలబడి, దిశ లేకుండా రచనలు సాగిస్తున్నారు. అగ్రకుల కనుసన్నల్లో నడిచే అభ్యుదయ, విప్లవ కవిత్వంలో దళిత విముక్తి ఉందనుకోవడం భ్రమ. స్వశక్తితో నడిచే అణగారిన వర్గాల ఉద్యమాలకు తోడైన రచనలే ప్రజాధారణ పొంది, ప్రజాస్వామికీకరణకు దోహదపడతాయి. లేకుంటే రచనలు నిష్ప్రయోజనం.

**సంపతి రమేష్ మహారాజ్,**
సామాజిక విశ్లేషకులు,
7989579428

# కొత్త చూపు

కొన్ని వాస్తవాలను రోట్లో పోసి దంచి నూరి పొడి కొట్టి వస్త్రగాలం పట్టి కొంచెం తేనె కలిపి గోళీలు చేస్తారు. చింతా మణి గోళీలివి సర్వ చింతలను రూపు మపే గోళీలు అని తినిపిస్తారు. మరొకరు మరికొన్ని చెట్ల వేర్లు , బెరడు, పూలు కాయలు దంచి నూరి తేనె కల్పి కొత్త చింత మాన్పించే మణి గోళీలని ముందుకు వస్తారు. ఇక వాల్లు మనిషిని వదిలి సిద్ధాంతాల ప్రకారం మనుషులను కొలుస్తారు. విభజిస్తారు, వర్గీకరిస్తారు. లోకంలో ఇలా రకరకాల సిద్ధాంతాలు, వాటి ప్రకారం పరిష్కారాలు చూపుతారు. భూగోళమంత మనిషిని పిడికెడంత సిద్ధాంతంలో ఇరికిస్తారు. సిద్ధాంతం ప్రకారం సాగదీస్తారు. వ్యాఖ్యానిస్తారు.

అలాంటి అనేక సిద్ధాంతాల్లో ఇటీవల కులం మతం వర్గం, దేశం అనే దృక్పథాలు బాగా ప్రాచుర్యం పెందాయి. వాటి ప్రకారం కథలు నవలలు, సినిమాలు, కళలు సాహిత్యం కూడా వెలువడ్డాయి. ఆ సిద్ధాంతాల ఆసరాతో ఉద్యమాలు, సాధికారికత, రాజకీయ అధికార సిద్గాంతాలు, ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ఒకవైపు కలుపుకు వస్తూ మరోవైపు విభజిస్తూ రావడం జరుగుతున్నది. వీళ్లు మావాళ్లు, వీళ్లు మా వాళ్లు కారు అంటూ సరిహద్దులు, అడ్డు గోడలు నిర్మిస్తారు. ఇవి ఎంత అసహజమైన అడ్డుగోడలో, ఆ సిద్ధాంతాలు ఎంత అసమగ్రమో ఒకసారి చూద్దాం. చేద్దామంటే టన్నుల కొద్దీ, లారీలకొద్దీ చర్చలు చేయవచ్చు. ముందు చిన్నగా సంక్షిప్తంగా చెప్పే ప్రయత్నం చేస్తాను. కొందరు గాంధారిలా కళ్లకు గంతలు కట్టుకుని వాస్తవాలను చూడ నిరాకరిస్తారు. అలాంటి ఒకాయన గురించిఈ మధ్య ఒక మిత్రుడు మాటల సందర్భంలో చెప్పాడు. అతడెవరో గొప్ప మేధావి అట! అతడు తన వాదనా పటిమతో భారత దేశంలో వర్గం తప్ప కులమే లేదని గొప్ప పుస్తకం రాసాడని చెప్పాడు. ఆ పుస్తకం నేను చూడలేదు. చదవ లేదు. ఎవరూ చదవ నవసరంలేదు.

అయితే అతడి దృష్టిలో వర్గం కూడా లేదని ఆయన ప్రకారం ఆడ మగ అనే రెండే వర్గాలున్నాయని అతని మనసులో భావమై వుంటుందని ఆ మిత్రునితో అన్నాను. ఆ మేధావి వ్యభిచారి అయి వుంటాడు. ఫ్రీ సెక్సు ప్రాక్టీషనర్ అయి వుంటాడు. మనువు కూడా స్రీలకు కులం లేదన్నట్టు స్త్రీలంతా శూద్రులే అన్నాడు. స్త్రీలందరు రీద్రులైతే వారికి పుట్టిన వారంతా శూద్రులవుతారు బ్రాహ్మణులు, క్షత్రియులు వగైరా కాలేరు అని ఆ చెప్పిన మనువు తోచి వుండదు. మనువు లాగే వీరూ అంతే! వారికి వర్గం అనే పదం యొక్క సరైన అర్థంకూడా తెలిసి వుండదు.

కులం అనేది నేడు పెళ్లికి, కులవృత్తికి, కుల ఐక్యతకు, రాజకీయ అధికారానికి అవసరమవుతున్నది. అలాగే రిజర్వేషన్లకు కులం అవసరమవుతున్నది. కనక వారు రిజర్వేషన్ లేని కులంలో పుట్టినవారైవుంటారు. వారు కులాధిక్య లాభాలు అనుభవిస్తూ కులం లేదని అంటున్నారు. . కులాధిక్యతను అనుభవించేవారు కులం ఎక్కడుందయా ఈ కాలంలో అని అంటుంటారు. వారు మానసికంగా కులాలాతీత వ్యభిచారి కాకుండా కులం లేదు అనలేరు. వారికి స్త్రీపురుషుల సృష్టి కార్యం తప్ప ఉత్పత్తి కార్యం తెలియదు. వారెప్పుడూ ఉత్పత్తిలో పాల్గొన్న వారు కాదు. ఉత్పత్తిలో పాల్గొన్నపుడే ఉత్పత్తి నైపుణ్యాలు, ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్చి సాధనాల విలువ, మానవ సంబంధాల విలువ, సంస్కృతి విలువ తెలుస్తుంది. కులమెక్కడిది? వర్గమే ప్రధానం అనే వారు ఎన్నడూ ఉత్పత్తిలో పాల్గోనలేదని అర్థం. ఉత్పత్తిలో పాల్గొనినపుడే ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి నైపుణ్యాలు, ఉత్పత్తి సాధనాలు, అందులో ఉపయోగించే శ్రమశక్తి విలువ తెలుస్తుంది. అపుడే ఆ శ్రమశక్తి విలువల మారకంలో వివిధ ఉత్పత్తుల ఉత్పత్తి నైపుణ్యాల, సేవల విలువలలో, మానవ సంబంధాలు, సంస్కృతి, కులం ప్రకారం విలువలు నిర్ణయించడం జరుగుతుంది.. ఏ ఉత్పత్తిలో పాల్గొనని వారికి కులం కుల సంబంధాలు నిర్ణయించే తీరు తెలిసే అవకాశం లేదు. వాల్లకు కావల్సిందల్లా అందరిరిపై ఆధిపత్యం. తాము చెప్పింది వినాలనే ఆధిపత్యం. ఈ ఆధిపత్యం, పైత్యం వదిలి వాల్లెన్నడూ ఇతరులు చెప్పినట్టు వినరు, ఇతరులు చెప్పినట్టు వినే కార్యకర్తగా పని చేయరు. అలాంటి దశ వస్తే అక్కడ నుండి తప్పుకొని కొత్త సిద్ధాంతాలు చేసి తన మాట వినేవారిని తయారు చేసుకునే పనిలో పడుతారు. వీరికి కుల సంబంధాలు, కుల వృత్తి సంబంధాలు మాత్రమే కాదు, వర్గం , వర్గ సంబంధాలు కూడా తెలియవు. వర్గం అనే పదానికి కూడా వీరికి అర్థం తెలియదు. ఆ పదాలు వాడడం వీరికీ ఒక ఫ్యాషన్. ఒక సమాజిక గౌరవం సాధికారిత పొందడం కోసం చేసే ప్రక్రియ!!



వాస్తవాలు

చూద్దాం.


ఒక దొర, విశ్వనాథ వేయి పడగలు నవలలో బ్రాహ్మణుడు, ఒక భూస్వామి?, ఒక పోలీసు అధికారి మహిళలను అనుభవించినపుడు ఏ కులం ఫీలింగ్ అడ్డంకి కాలేదు.ఏ వర్గం ఫీలింంగ్ అడ్డం కాలేదు. అతడు నేను భూస్వామిని! దొరను, ఛ ! చిన్న కులం వాల్లతో శృంగారమా అని అనుకోలేదు. ఇలా ఇక్కడ వర్గ తత్వం లేదు. కులతత్వం లేదు. ఉన్నదల్లా ఆమె స్త్రీ నేను పురుషుడను అనే తత్వమే!!

ఇలా స్రీ పురుష సంబంధాల విషయానికి వస్తే కులం లేదు వర్గం మతం లేదు.

ఉత్తర ప్రదేశ్లో ఇటీవల హత్రాస్‌లో దళిత అమ్మాయిని కొందరు కలిసి రేప్ చేసినపుడు వారికి మేం ఠాకూర్లం ఈ కింది జాతి వాల్లతో సంబంధం తప్పు అనుకోలేదు. ఈ మధ్య విదేశీ వనిత ఇండియాలో రేప్ కు గురైంది. కనక స్త్రీ పురుషుల మధ్య దేశం వేరు అనేది కూడా అడ్డంకి కాలేదు. అందుకే ఒక విదేశీయుడు అంటరాని తనం గురించి చెప్పింది విని స్త్రీల పట్ల కూడా అంటరాని తనం పాటిస్తారా అని అడిగితే నోరు తెరిచాడట! ఏదో దేశంలో ఐక్య రాజ్య సమితి తరపున శాంతి సైన్యం పంపబడింది. కొన్నాళ్లకు అక్కడి నహిళలకు ఈ సైనిక అత్యాచారాలతో పిల్లలు కలిగి పెరిగారట!

ఇలా వర్గ సమస్య, కుల సమస్య మత సమస్య, దేశ సమస్య పురుషుల మధ్యనే తప్ప స్త్రీ పురుషుల మధ్య వర్తించదు అని తేలుతున్నది. కనక వర్గాలు రెండు. ఒకటి స్త్రీలు. కెండు పురుషులు అని! వర్గం కులం మతం ఎంత నిజమో స్త్రీ పురుషుల మధ్య ఇది కూడా అంతే నిజం!! అనగా మనువు చెప్పినట్టే సగం జనాభా అయిన మహిళల పట్ల కులం మతం వర్గం, దేశం, జాతి, దృక్థథాల అడ్డు గోడలు తొలగి పోయి సహజ స్క్రీ పురుష భావనలతో పురుషులు కొనసాగుతున్నారు. ఇలా వీటిని ప్రకృతి సహజ గుణాలు నిర్ణయిస్తున్నాయి. కులం వర్గం మతం దేశం దృక్పథాలను సమాజం నిర్ణయిస్తున్నది!!

అందువల్ల ఇలా కులం మతం వర్గం దేశం దృక్పథాలు పురుషులకు సంబంధించినవి. పితృస్వామిక పురుషాధిపత్యానికి సంబంధించినవి. కొందరు స్త్రీలు తమ ప్రయివేట్ అన్ టచ్బుల్ అవయవాల నుపయోగించి ఉన్నత వర్గాలతో ప్రయోజనం, గౌరవాలు, సంపదలు, పదవులు, పొందుతున్నారు. సైమన్ దిబోవర్ సెకండ్ సెక్సు అనే పుస్తకంలో మార్చ్సు చెప్పిన భౌతిక వాగం, చారిత్రక భౌతిక వాదం, అదనపు విలువ, మొదలైనవి ఎంత అసమగ్రమో, ఎంతగా పురుషుల పరంగా రూపొందిన సిద్ధాంతాలో వివరించారు. అయినప్పటికీ పురుష నాయకత్వం పాత విధానాలనే కొనసాగిస్తున్నది. అంబేద్కర్ కులం నిర్వహించే పాత్ర, కులం పుట్టుక, కుల సంబంధాలు ఎంత బలీయంగా కొనసాగుతున్నాయో వివరించారు. అయినా కొందరు వర్గం ఒకటే ప్రధానం అంటూ పాత విధానాలు కొనసాగిస్తున్నారు. వర్గాలను రూపొందిస్తున్నది కులవ్యవస్థ, వర్ణ వ్యవస్థ అని వీరికి తెలియదా? తెలుసు. కాని అలా గుర్తిస్తే వారి ఆధిపత్యం పోతుంది కనక అంగీకరించరు. కొందరు భూసంబంధాల గురించి, వర్గ సంబంధాల గురించి ఘనంగా మాట్లాడుతారు. కాని కుల సంబంధాల గురించి కుల అణిచివేత దోపిడి దౌర్జన్యాల గురించి నోరెత్తరు. అసలు విషయం ఏమంటే ఈ పురుషుల కులం మతం వర్గం, దేశం, సిద్ధాంత వలయాల నుండి బయట పడి మహిళలు ప్రపంచంలో సగం జనాభా అయిన తమ కోసం నూతన వాస్తవిక అవగాహనను దృక్పథాలను అలంకార శాస్త్రాలను, జ్ఞాన సిద్ధాంతాలను రూపొందించుకోవడం!! ఇలా మహిళలు కొత్త చూపు రూపొందించుకోవాలి



**బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
8331966987

# కరూర్ విషాదానికి – బాధ్యత ఎవరు వహిస్తారు!

2025 సెప్టెంబర్ 27న తమిళనాడు రాష్ట్రంలోని కరూర్ జిల్లాలో జరిగిన విజయ్ తమిళగ విజయం కజగం బహిరంగ సభ చరిత్రలో మరచిపోలేని విషాదం గా నిలిచింది. రాజకీయంగా కొత్తదనం చూపించాలని ఆశించిన ఈ సభలో భద్రతా లోపాలు, నిర్వాహకుల నిర్లక్ష్యం, గుంపు ప్రవర్తన పట్ల అవగాహనలేమి కలిసి ప్రాణాంతక పరిస్థితిని సృష్టించాయి. 40 మంది ప్రాణాలు కోల్పోయి, సుమారు 80 మందికి పైగా గాయపడిన ఈ సంఘటన కేవలం ఒక దుర్ఘటన మాత్రమే కాదుబీ ఇది ప్రజాస్వామ్యంలోని రాజకీయ సమీకరణలు, భద్రతా పరిపాలన, ,బాధ్యతాయుత నాయకత్వంపై ప్రశ్నార్థక చిహ్నం మిగిల్చిన ఘట్టం.



రాజకీయ వాతావరణం సభ ప్రాముఖ్యత తమిళనాడులో నటుడు విజయ్ విస్తృత ప్రజాదరణ పొందిన వ్యక్తి. సినీ కెరీర్‌లో వందలాది కోట్ల అభిమానులను సంపాదించిన ఆయన 2025లో అధికారికంగా రాజకీయ రంగ ప్రవేశం చేసి, తమిళగ విజయం కజగం (టివికె) అనే పార్టీని ప్రారంభించాడు. రాష్ట్రంలో 2026 ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న తరుణంలో కరూర్ కార్నర్ సభను పార్టీ శక్తి ప్రదర్శనగా రూపొందించింది.కరూర్, తమిళనాడులో మధ్య ప్రాంతంలో ఉన్న రాజకీయంగా చురుకైన జిల్లా. ఇక్కడి సభను విజయ్ తన అభిమానులతో నేరుగా మమేకం కావడానికి, పార్టీకి బలాన్ని చాటడానికి ఉపయోగించుకోవాలనుకున్నారు. కానీ ప్రజల స్పందన ఊహించని స్థాయిలో ఉండగా, భద్రతా వ్యవస్థలు అందుకు సిద్ధం కాలేకపోయాయి.

సభ ఉదయం మొదలై మధ్యాహ్నం వరకూ ప్రజలు చేరసాగారు. వేడి వాతావరణంలో ఆహారం, నీరు లేకపోయినా, అభిమానులు నాయకుడిని చూడటానికి ఎదురుచూశారు. విజయ్ రాకలో సుమారు 5–6 గంటల ఆలస్యం కావడంతో ఆత్రుత మరింత పెరిగింది. బారికేడ్ల వెనుక నిలిచిన జనసమూహం క్రమంగా ముందుకు నెట్టుకునే ప్రయత్నం చేసింది.ఒక ప్రాంతంలో ఒత్తిడి పెరగడం మొదలవగానే పానిక్ వ్యాపించింది. కొంత మంది బయటకు వెళ్లడానికి ప్రయత్నించగా మార్గాలు సన్నగా ఉండటంతో బాటిల్‌నెక్ ఎఫెక్ట్ ఏర్పడి ప్రజలు ఒకరి మీద ఒకరు పడిపోయారు. ఊపిరాడక అనేక మంది అక్కడికక్కడే మృతి చెందారు.

**కారణాల లోతైన విశ్లేషణ పరిశీలిస్తే నిర్మాణ వైఫల్యం**

సభ పరిమిత సామర్థ్యాన్ని దాటి జనసందోహం రావడం ముందుగా అంచనా వేయలేదు. రిస్క్ అసెస్మెంట్ లేకుండా ప్రదేశం ఎంచుకోవడం.తగిన సంఖ్యలో పోలీసు బలగాలు, భద్రతా సిబ్బంది నియమించలేదు.అత్యవసర వైద్య సేవలు (అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు) తక్కువగా ఉండటం. డ్రోన్‌లు, సీసీటీవీ వంటి రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు లేకపోవడం. వల్లనే తొక్కిసలాట జరిగినట్లు తెలుస్తుంది. నిర్వాకులు సభను ముందుగా అంచనా వేయకపోవడం అందులో ముఖ్యంగా అనుభవరాహిత్యం వల్ల సభలో ప్రజలు కిక్కిరిసిపోవడం సభ ప్రాంగణాన్ని మానిటరింగ్ చేసే విధానం సరిగ్గా లేకపోవడం ఈ సంఘటనకు దారి తీసినట్లు చెప్పవచ్చు.గుంపు ప్రవర్తన పెద్ద గుంపులో వ్యక్తులు స్వతంత్ర నిర్ణయం కోల్పోయి హెర్డ్ బిహేవియర్ ప్రదర్శిస్తారు.భయం ఒక్కసారిగా వ్యాపించే కాంటేజియన్ ఎఫెక్ట్ పరిస్థితిని మరింత క్షీణం చేసింది.బయటకు వెళ్లే మార్గాలు సరిపోకపోవడం వల్ల బాటిల్‌నెక్ ఏర్పడింది. ఒత్తిడి పెరిగినప్పుడు శరీరంపై 400–600 కిలోల వరకు బరువు పడవచ్చని పరిశోధనలు చెబుతున్నాయిబీ ఇది ఊపిరాడక మృతి చెందడానికి దారితీసింది.

**వాతావరణం శారీరక అలసట:**

వేడి వాతావరణం, నీరు ఆహారం లేమి ప్రజల్లో బలహీనత, అలసట కలిగించాయి. దీర్ఘకాలం నిలబడటం వల్ల కొన్ని ప్రాంతాల్లో ప్రజలు అపస్మారక స్థితికి చేరి, గుంపులో కలకలం రేపారు. సమాజంపై వర్తమాన రాజకీయాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపనుంది ఇది ఆ పార్టీకి పెద్ద దెబ్బ అని చెప్పవచ్చు.ప్రాణ నష్టం: అధికారిక లెక్క ప్రకారం 40 మంది మరణించారు, 80 మందికి పైగా గాయపడ్డారు.

**ప్రభుత్వ స్పందన:** ముఖ్యమంత్రి స్టాలిన్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రకటించి, రిటైర్డ్ న్యాయమూర్తి ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు.

**న్యాయ చర్యలు:** సభ నిర్వాహకులపై అపరాధ నరహత్య కింద కేసులు నమోదయ్యాయి. సామాజిక ఆగ్రహం సోషల్ మీడియా, పత్రికలలో భద్రతా లోపాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. శాస్త్రీయ క్రౌడ్ మేనేజ్మెంట్పెద్ద సభలకు జనసంఖ్య అంచనా వేసి, బఫర్ జోన్‌లు, వెడల్పైన ఎగ్జిట్ మార్గాలు తప్పనిసరిగా ఉంచాలి.రియల్ టైమ్ మానిటరింగ్ కోసం డ్రోన్‌లు, సీసీటీవీలు, సెన్సర్లు ఉపయోగించాలి.

అత్యవసర వైద్య సేవలుఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు, అత్యవసర అంబులెన్స్‌లు మరియు వైద్య సిబ్బంది తప్పనిసరిగా సిద్ధంగా ఉంచాలి.చట్టపరమైన కఠిన నియమాలు పెద్ద సభలకు తప్పనిసరి చేయాలి.నిర్వాహకులు భద్రతా ప్రణాళికలను సమర్పించకుండా అనుమతులు ఇవ్వకూడదు.ప్రజా అవగాహన పెద్ద గుంపులో ఉన్నప్పుడు ఎలా ప్రవర్తించాలి, అత్యవసర పరిస్థితుల్లో ఎటువంటి మార్గాలు అనుసరించాలి అనే విషయాలు ప్రజలకు తెలియజేయాలి. బాధ్యత పారదర్శకత సభ నిర్వాహకులపై అపరాధ నరహత్య కింద కేసులు.భల అనంతరం సేఫ్టీ ఆడిట్లు నిర్వహించి లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మార్పులు చేయాలి.

**ప్రజాస్వామ్యానికి పాఠం కావాలి!**

ప్రజాస్వామ్యంలో రాజకీయ సభలు అవసరమైనవే. కానీ ప్రజల ప్రాణ భద్రతను తక్కువ అంచనా వేసినపుడు ప్రజాస్వామ్యం మీదే నమ్మకం దెబ్బతింటుంది. నాయకులు ప్రజా మద్దతు కోసం పెద్ద సభలు నిర్వహించినప్పుడు భద్రతను ప్రథమ ప్రాధాన్యంగా పరిగణించకపోవడం బాధ్యతారాహిత్యమే. ఈ సంఘటన ప్రజాస్వామ్యాన్ని బలపరిచే మార్గంలో బాధ్యతాయుత రాజకీయ నాయకత్వం, కఠిన నియమాలు, శాస్త్రీయ ప్రణాళిక అవసరాన్ని గుర్తు చేసింది.కరూర్‌లో విజయ్ బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాట ఒకేరోజులో 40 కుటుంబాల జీవితాలను శాశ్వతంగా మార్చేసింది. రాజకీయ నాయకులు తమ పలుకుబడిని పెంచు కోవడానికి గుంపు రాజకీయాన్ని ప్రదర్శించడానికి జనాలను పెద్ద ఎత్తున పోగు చేయడం మనం గమనించదగ్గ విషయం. అయితే ప్రజలు కూడా అనవసరంగా ఇటువంటి బహిరంగ సభలకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవడం తమకు తాముగా బాధ్యత వహించుకోవాల్సి ఉంటుంది. రాజకీయ నాయకులు పిలువగానే బిర్యానీ పొట్లాలకు, క్వార్టర్ సీసలకు అలవాటు పడితే జీవితమే నాశనం అవుతుంది. కాబట్టి ఇప్పటికైనా ప్రజలు రాజకీయ నాయకులు వెదజల్లే జొన్నలకు అలవాటు పడకుండా ఎవరి ఇండ్లలో వారు ఉండి ప్రజాస్వామ్యబద్ధంగా నచ్చిన నాయకునికి ఓటు వేసే విధానాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయ నాయకుల ఉకోదంపుడు ఉపన్యాసాలకు చప్పట్లు కొట్టడం, ఈలలు వేయడం వంటి సంఘటనలకు ప్రజలు స్వస్తి చెప్పాలి. ప్రజాస్వామ్యం బహిరంగ సభలకు వేదికగా అలవాటు పడిన రాజకీయ నాయకులు ప్రజలను అమాయకులను చేసి తమ సభలకు తీసుకుపోయి హత్యలు చేస్తున్న రాజకీయ నాయకుల పై కఠినమైన శిక్షలు వేసే విధంగా చట్టాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి సంఘటనలు చరిత్రలో అనేకం జరిగినప్పటికీ వాటి నుండి చరిత్ర నుండి పాఠాలు నేర్చుకోకపోవడం రాజకీయ నాయకుల అవగాహన లోపమే అని చెప్పాలి. విస్తృతమైన సభాస్థలిని ఏర్పరచుకోకుండా కిక్కిరిసిన స్థలంలోబహిరంగ సభలు నిర్వహించి పెద్ద ఎత్తున జనం పోగొయినారని తమ సత్తా చూడండి అని పెద్దపెద్ద ఫోటోలు వేసి ప్రజలను ఆకర్షితులను అయ్యేవిధంగా ప్రదర్శనలు మానుకోవాలి.

అధికారికంగా ఖచ్చితమైన గణాంకం ప్రకటించబడలేదు, కానీ తాజా వార్తా నివేదికల ప్రకారం కరూర్‌లోని విజయ్ టివికే బహిరంగ సభకు పదివేలల్లో నుంచి లక్షకు పైగా ప్రజలు చేరారని అంచనా వేస్తున్నారు. కొన్ని తమిళ వార్తా మాధ్యమాలు "70,000–1,00,000 వరకు జనసందోహం" ఉన్నట్టు రాశాయి.స్థానిక పోలీస్ వర్గాలు కూడా అనుమతించిన దానికంటే ఎక్కువ జనాలు రాగా, భద్రతా ప్రణాళికలు తక్కువవయ్యాయని పేర్కొన్నాయి. నిర్వాహకులు ముందుగా 50–60 వేల మంది వస్తారని భావించినా, వాస్తవానికి దానికంటే ఎక్కువ సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. అధికారిక ప్రభుత్వ నివేదికలో తుది సంఖ్యను ఇంకా స్పష్టంగా ప్రకటించలేదుబీ కానీ సుమారు లక్ష వరకు జన సమీకరణం జరిగినట్టు ప్రధాన పత్రికలు, టీవీ చానెల్లు పేర్కొన్నాయి. ఏది ఏమైనా బహిరంగ సభలకు వెళ్లే ముందు ప్రజలు ఆలోచించుకొని ముందడుగు వేయాలి లేకపోతే భవిష్యత్తులో కూడా ఇటువంటి సంఘటనలకు ప్రజలే బాధ్యత వహించవలసి ఉంటుంది.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**

# జీహెచ్ఎంసీవ్యాప్తంగా ప్రజావాణికి 92 ఆర్జీలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమిషనర్‌కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు ఒకే సమస్య పై పదేపదే రాకుండా హెచ్ఓడి లు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 37 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 21, ఇంజనీరింగ్ 7, ట్యాక్స్ సెక్షన్ 5, విజిలెన్స్, హెల్త్ అండ్ శానిటేషన్, యు.బి.డి, సిటిఓ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 55 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 28, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్ లలో 9 చొప్పున, చార్మినార్ జోన్ లో 5, ఎల్బీనగర్ జోన్ లో 4 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, సత్యనారాయణ, వేణు గోపాల్, అలివేలు మంగతాయారు, విజిలెన్స్ డి.ఎస్.పి నర్సింహా రెడ్డి, హౌసింగ్ సిఈ నిత్యానంద, అడిషనల్ సిసిపిలు తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమితులైన ఉద్యోగిని సన్మానం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియామకమైన బాద శ్రేయని కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా ప్రెసిడెంట్ మామిడి మాధవి, వైస్ ప్రెసిడెంట్ వనజ, జనరల్ సెక్రెటరీ హేమలత, సీనియర్ నేతలు కుమారస్వామి, జయరాం, క్రాంతి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రూప్స్ రాసి ఉద్యోగం సంపాదించాలన్నా, ఉద్యోగాలు ఇవ్వాలన్నా ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని అన్నారు.

## ఓజీ టికెట్ ధరలపై పోలీస్ శాఖ జీవో

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమా టికెట్ ధరల పెంపును రద్దు చేయాలంటూ తెలంగాణ పోలీస్ శాఖ సోమవారం జీవో విడుదల చేసింది. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సింగిల్ స్క్రీన్స్, మల్టీప్లెక్స్ యాజమాన్యాలను ఆదేశించింది. ఈ సినిమా టికెట్ ధరల పెంపును తెలంగాణ హైకోర్టు సస్పెండ్ చేయడాన్ని, ఆ తర్వాత పరిణామాలను జీవోలో పేర్కొంది.

# ఆకలి బాధలు లేని హైదరాబాదే లక్ష్యం



- గ్రేటర్‌వ్యాప్తంగా 150 ఇందిరమ్మ క్యాంటీన్‌లు ప్రారంభం
- మోతినగర్, ఖైరతాబాద్ మింట్ క్యాంపస్‌లో ఇందిరమ్మ క్యాంటీన్లు
- ఒక్కో లబ్ధిదారుడిపై నెలకు రూ.3 వేల మేర తగ్గనున్న ఆర్థిక భారం

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) :**

గరీబి హటావో అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేసిన ఇందిరమ్మ స్ఫూర్తితో.... ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగా ఇందిరమ్మ క్యాంటీన్‌లు ఏర్పాటు చేసామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇందిరమ్మ క్యాంటీన్‌లను మోతినగర్, ఖైరతాబాద్ మింట్ క్యాంపస్‌లో ప్రారంభించారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్ లు బోర్కడే హేమంత్ సహదేవ్ రావు , అనురాగ్ జయంతి, అదనపు కమిషనర్‌లు రఘు ప్రసాద్, పంకజ, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ క్యాంటీన్ లలో లబ్ధిదారులకు సబ్సిడీతో అల్పాహారం రూ.5, భోజనం రూ.5 కు అందించబడుతుంది. జీహెచ్ఎంసీ ఒక్కో అల్పాహారం పై రూ.14, భోజనంపై రూ.24.83 వెచ్చిసుంది. ప్రతి లబ్ధిదారునికి నెలకు సగటున సుమారు రూ.3 వేల వరకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. హరే కృష్ణ హరే రామ ఫౌండేషన్ వీటి నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. ఇందిరమ్మ క్యాంటీన్ ల ద్వారా ఉదయం అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో హైదరాబాద్ లో పేదలు, అడ్డా కూలీలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, అల్పదాయ వర్గాల వారు, నిరుద్యోగులకు ప్రయోజనం కలగనుంది. ప్రారంభం అనంతరం మంత్రి, మేయర్, ఎంపీ, ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ అధికారులు లబ్ధిదారులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. పారిశుద్ధ్య కార్మికులు, లబ్ధిదారులతో వారితో కలిసి భోజనం చేశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..

గరీబి హటావో అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు ఇందిరమ్మ కృషి చేశారన్నారు. ప్రజల ఆశీస్సుల వల్ల ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామని చెప్పారు. ఒక్క హైదరాబాద్ నగరంలోని 60 వేలకు పైగా రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించామన్నారు.



ఇందిరమ్మ స్ఫూర్తిగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇందిరమ్మ క్యాంటీన్ లను ప్రారంభించాం. ఇప్పటి నుంచి ఇందిరమ్మ క్యాంటీన్ లలో రూ.5కే అల్పాహారం కూడా అందిస్తామన్నారు. ప్రభుత్వానికి ఆర్థిక భారం పడుతున్నా పేదలకు నాణ్యమైన ఆహారం తక్కువ ధరకు అందిస్తామని అన్నారు.

ఇందిరమ్మ స్ఫూర్తితో ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గృహ విద్యుత్, వడ్డీలేని రుణాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే ప్రయోజనాలను పొందేందుకు నగరంలోని ప్రతి మహిళ స్వయం సహాయక సంఘంలో సభ్యత్వం పొందాలన్నారు. అందరి సహకారంతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచుతున్నామని మంత్రి అన్నారు.

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. పేదలకు, అల్పాదాయ వర్గాలకు ఇందిరమ్మ క్యాంటీన్ లు ఎంతో ప్రయోజనకరమన్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో త్వరలో 150 ఇందిరమ్మ క్యాంటీన్ లు ప్రారంభించబోతున్నామని తెలిపారు. మహిళలను ప్రోత్సహిస్తూ స్వయం సహాయక సంఘాలకు క్యాంటీన్ లు కేటాయిస్తామని చెప్పారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... మింట్ క్యాంపస్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్ అందరికీ చేరువగా ఉందన్నారు. పేదలు, అల్పదాయ వర్గాలకు ప్రయోజనకారిగా ఉందన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.... ఇందిరమ్మ క్యాంటీన్ ల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని కోరారు.

## గ్రూప్ 2లో ప్రతిభచాటిన వనపర్తివాసి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించొచ్చు అని నిరూపించారు పసుపుల హరిప్రసాద్. ఇప్పటికే జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. గ్రూప్ 2లో 160 ర్యాంక్ సాధించి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. సివిల్స్ సాధించడం తన లక్ష్యం అన్నారు. పోటీ పరీక్షలు ఏదైనా వరుసగా ఉద్యోగాలు సాధిస్తూ వస్తున్నారు.

## పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండ

### జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి



**చేర్యాల (జనంసాక్షి) సెప్టెంబర్ 29 :** ముఖ్యమంత్రి సహాయనిది నిరుపేద ప్రజలకు కొండంత అండగా నిలుస్తుందని కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు, చేర్యాల మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిధుల కింద ప్రభుత్వం మంజూరు చేసిన గ్రామానికి చెందిన ఇరగదిండ్ల కనకయ్యకు రూ. 60,000 చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకుల సమక్షంలో లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజె మల్లేశం మండల అధ్యక్షులు కొమ్ము రవి, వీరన్నపేట తాజా మాజీ సర్పంచ్ కొండపాక బిక్షపతి, చేర్యాల పట్టణ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, గ్రామ శాఖ అధ్యక్షులు సూర్న శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, కొండాపురం మధు తదితరులు పాల్గొన్నారు.

## చివరి రోజు బస్సులో..

**హైదరాబాద్ (జనంసాక్షి) :** టీజీఎస్ఆర్టీసీ ఎండీగా తన చివరి రోజున వీసీ సజ్జనర్, ఐపీఎస్ ప్రజా రవాణాపై అనుబంధాన్ని వ్యక్తం చేస్తూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. సాధారణ ప్రయాణికుడిలా లక్డీకాపుల్-టెలిఫోన్ భవన్ బస్టాండ్ నుంచి బస్‌భవన్ వరకు 113 ఐ/ఎం రూట్ బస్సులో ప్రయాణించారు. యూపీఐ పేమెంట్ చేసి కండక్టర్ వద్ద టికెట్ తీసుకున్నారు. అనంతరం ప్రయాణికులతో ముచ్చటించారు.



*టీజీఎస్ఆర్‌టీసీ నూతన వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వై నాగిరెడ్డి, ఐపీఎస్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బస్‌భవన్‌లోని ఎండీ చాంబర్‌లో పూర్వపు ఎండీ వీసీ సజ్జనర్ ఐపీఎస్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.*

# ఇద్దరికంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అర్హులేనా?

**స్పష్టత ఇవ్వని రాష్ట్ర ఎన్నికల కమిషన్**
**నిబంధనలు సడలిస్తామని అప్పట్లో హామీ ఇచ్చిన ప్రభుత్వం**
**ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో డైలామాలో ముగ్గురు పిల్లలు ఉన్న నేతలు**
**పాత నిబంధనల ప్రకారం ఎన్నికలు జరుగుతాయన్న అధికారులు**

**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 29 (జనం సాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికలు రానే వచ్చాయి.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. కానీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న నేతలంతా సందిగ్ధంలో పడ్డారు. అందుకు కారణం ఇద్దరికీ అంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీ చేయవచ్చు లేదా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కానీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టత ఇవ్వలేదు.

వివరాల్లోకి వెళితే... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికలు నిర్వహించడానికి తేదీలు ఖరారు కావడంతో పోటీ చేసే నాయకుల్లో కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది నివృతి చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనలు ఎత్తివేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రులు కొన్ని సందర్భాల్లో ప్రకటించారు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయవచ్చునని సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాయి . దీంతో వివిధ



పార్టీల్లో పని చేస్తున్న నాయకులంతా మంద బలాన్ని పోగు చేసుకుని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయవచ్చని ధీమాతో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. కానీ అప్పుడా ఇప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల జరిగింది. కానీ ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎవరు అర్హులు అనే విషయమై నాయకులకు స్పష్టత లేదు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ పిల్లలు ఉన్న పోటీ చేయవచ్చా లేదా అని సద్దుద్దంలో ఉన్నారు. ఎందుకంటే గతంలో అనేక సందర్భాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనలు సడలిస్తామని రాష్ట్ర మంత్రులు ప్రకటించిన కారణంగా అనేకమంది నాయకులు ఈ ఎన్నికలపై ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం వైపు నుంచి ఇద్దరు పిల్లలు ఆ పైబడి ఉన్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయవచ్చునని స్పష్టత రాలేదు. ఈ నిబంధనలను సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయవలసి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు ఇద్దరు పిల్లల కంటే పైబడి ఉన్న పిల్లల విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి జీవో జారీ చేయలేదు. దీంతో పాత పద్ధతిలోనే ఎన్నికలు ఉంటాయని సంకేతాలు ప్రజల్లోకి వెళుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ పిల్లల విషయమై స్పష్టత ఇవ్వలేదు. దీంతో పాత పద్ధతిలోనే ఎన్నికలు ఉంటాయని నాయకులు భావిస్తున్నారు. ఇదే విషయమై అధికారులను ప్రశ్నిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ పిల్లలు ఉన్న పోటీ చేయవచ్చా అనే విషయమై ప్రభుత్వము నుంచి ఎలాంటి జీవో జారీ కాలేదని స్పష్టం చేశారు. దీంతో పాత పద్ధతిని అవలంబించాలని తాము భావిస్తున్నట్లు తెలియజేశారు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉన్న వ్యక్తులు ఎవరైనా నామినేషన్ వేస్తే పరిశీలనలో వాటిని తిరస్కరిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని ప్రభుత్వం నుంచి ఏదైనా జీవో వస్తే ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే వారు వేసిన నామినేషన్ పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

# మహీంద్రా విశ్వవిద్యాలయం, అపోలో హెల్త్‌కేర్ ఒప్పందం

### అలైడ్ హెల్త్ సైన్సెస్ బ్యాచిలర్ ప్రోగ్రామ్‌ల కోసం..

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) :** అలైడ్ హెల్త్ ప్రొఫెషనల్స్ కొరత తీర్చడమే లక్ష్యంగా మహీంద్రా విశ్వవిద్యాలయం, అపోలో హెల్త్‌కేర్ అకాడమీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా అలైడ్ హెల్త్ సైన్సెస్ బ్యాచిలర్ కోర్సులు అందించనున్నారు. అధిక డిమాండ్ ఉన్న స్పెషలైజేషన్‌లలో ముఖ్యంగా అనస్తీషియా, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీ, కార్డియోవాస్కులర్ టెక్నాలజీ తదితర కోర్సులు ఉన్నాయి. మహీంద్రా యూనివర్సిటీ ఆధునిక విద్యా వనరులు, అపోలో హెల్త్‌కేర్ అకాడమీ క్లినికల్ నైపుణ్యం కలయికతో ఈ కోర్సులు ఆరోగ్య రంగ అవసరాలకు సరిపోయే గ్రాడ్యుయేట్లను తీర్చిదిద్దనున్నాయి. జాతీయ అలైడ్, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఈ కోర్సుల పాఠ్యాంశాలు రూపొందించనున్నారు. దీని వల్ల జాతీయ స్థాయి నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు గ్లోబల్ గుర్తింపు కూడా లభిస్తుంది. విద్యార్థులకు అపోలో హాస్పిటల్స్, అనుబంధ హెల్త్‌కేర్ సదుపాయాలలో క్లినికల్ రొటేషన్లు లభిస్తాయి. చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అనేక దేశాల హెల్త్‌కేర్ సిస్టమ్స్.. అలైడ్ హెల్త్ ప్రొఫెషనల్స్ కొరత తీవ్రమవుతోందని హెచ్చరిస్తున్నాయి. జనాభా వృద్ధి, ఆరోగ్య సేవలపై పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ కొరత బాగా పెరుగుతుంది. ఈ కొత్త కార్యక్రమం విద్యార్థులను నైపుణ్యంతో, ఆత్మవిశ్వాసంతో, మొదటి రోజు నుంచే ఆరోగ్య రంగానికి సేవ చేయగలిగేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యజులు మెదురి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా అత్యున్నత నైపుణ్యం కలిగిన హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్‌ను తయారు చేయాలన్న మా ఉమ్మడి లక్ష్యం ప్రతిబింబిస్తోందని చెప్పారు. మహీంద్రా యూనివర్సిటీ అకడమిక్ నైపుణ్యం, అపోలో హాస్పిటల్స్ ప్రావీణ్యంతో తక్షణం, దీర్ఘకాలిక ప్రభావం చూపగలిగే గ్రాడ్యుయేట్లను తీర్చిదిద్దడమే మా లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్సిటీ, సెంటర్ ఫర్ లైఫ్ సైన్సెస్ ప్రొఫెసర్, డీన్ డాక్టర్ రాజేందర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ఈ ప్రోగ్రామ్‌లు అకడమిక్ కఠినతను ప్రాక్టికల్ అనుభవంతో కలుపుతాయన్నారు. మా విద్యార్థులు నేర్చుకోవడమే కాకుండా, ఆరోగ్య సంరక్షణలో ప్రాక్టీస్ కూడా చేస్తారన్నారు. దీని వల్ల కేవలం ఉద్యోగానికి సిద్ధంగా ఉండటం మాత్రమే



కాకుండా, భవిష్యత్తు సవాళ్లకు కూడా సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా అపోలో హెల్త్‌కేర్ అకాడమీ సీఈఓ శివరామకృష్ణన్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకునే విద్య, హాస్పిటల్‌లో ప్రాక్టీస్ మధ్య ఉన్నన్న తేడాను తగ్గించడం పట్ల అపోలో హెల్త్‌కేర్ అకాడమీ కట్టుబడి ఉందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు ఆత్మవిశ్వాసం, అనుభవం, అవసరమైన నైపుణ్యాలను సంపాదిస్తారన్నారు. భారత్‌లోనే కాక ప్రపంచవ్యాప్తంగా కూడా విజయవంతంగా నిలబడగలరన్నారు. ఇది మా ప్రపంచవ్యాప్త వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగమన్నారు. తద్వారా వచ్చే తరం హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్‌ను తయారు చేయడం, ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలకు అర్థవంతమైన సేవ చేయగలిగేలా చేయడం మా లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, అలైడ్ సైన్సెస్ డీన్, హెడ్ - అలైడ్, హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ డాక్టర్ జగదీశ్వరన్ మాట్లాడుతూ మహీంద్రా యూనివర్సిటీలోకి అపోలో ఇమర్సివ్ ట్రైనింగ్ మోడల్ తీసుకురావడం గర్వంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం కలిగిన, స్థానికంగా ప్రభావం చూపగలిగే అలైడ్ హెల్త్ గ్రాడ్యుయేట్లను తయారు చేస్తామని చెప్పారు.

# వెంచర్ పనులు ఆపకపోతే గుడిసెలు వేస్తాం..

## పొట్టిపల్లి రైతు కూలీల ఆవేదన



**ఝరాసంగం,సెప్టెంబర్ 29(జనంసాక్షి) :** వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించే వ్యవసాయ పొలంలో వెంచర్ పనులు ఆపకపోతే ఇక్కడే గుడిసెలు వేస్తామని ఝరాసంగం మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామానికి చెందిన మహిళలు సోమవారం వెంచర్ స్థలంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల క్రితం మా పెద్దలకు మాయ మాటలు చెప్పి కుటుంబ సభ్యులకు తెలియ కుండానే తక్కువ ధరకు భూములు కొని ఇక్కడ ఉపాధి కల్పిస్తామని నమ్మ బలికారన్నారు. ఇప్పుడి వరకు భూములు అమ్మిన రైతులు ఇదే పొలాల్లో పనులు చేస్తూ ఉపాధి పొందే వారని ఇక మీదట ఈ పొలాల్లో వెంచర్ వేస్తే ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారు వాపోయారు. ఇప్పటికైనా వెంచర్ పనులు ఆపాలని లేని పక్షంలో ఇక్కడే బైఠాయిస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో సుధాకర్, మహేందర్, మొగులమ్మ, పుష్పమ్మ, విజయ్ కుమార్, కిష్టమ్మ, బక్కమ్మ, సంతోషమ్మ, రాములు, నర్సమ్మ,అనిత తదితరులు పాల్గొన్నారు.



# వరద ముప్పును తప్పించండి

**నాలాల ఆక్రమణలు తొలగించాలంటూ విజ్ఞప్తులు**
**హైడ్రా ప్రజావాణికి 29 ఫిర్యాదులు**

**హైదరాబాద్, సెప్టెంబరు 29 (జనంసాక్షి) :** వర్షాలు కొనసాగుతున్న వేళ నాలాల ఆక్రమణలపైనా అదే స్థాయిలో ఫిర్యాదులందుతున్నాయి. నగరం నలుమూలల నుంచి ఇవే ఫిర్యాదులందుతున్నాయి. ఆక్రమణలతో మా కాలనీలు, నివాస ప్రాంతాలను వరద ముంచెత్తుతోందని పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నాలాలను ఆక్రమించి ప్రవాహవేగాన్ని తగ్గిస్తున్నారని.. దీంతో వరద పోటెత్తుతోందని పలువురు వాపోయారు. ఓపెన్ నాలాలను మూసేయడంతో కూడా సిల్ట్ రిమూవల్ సరిగా సాగడంలేదని పలువురు ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి వచ్చిన 29 ఫిర్యాదుల్లో అధిక మొత్తం నాలాల ఆక్రమణలపైనే ఉన్నాయి. వీటి తర్వాత స్థానం రహదారుల ఆక్రమణలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా అదనపు కమిషనర్ ఎన్. అశోక్‌కుమార్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను అధికారులకు అప్పగించారు.

**ఫిర్యాదులు ఇలా...**

బేగంపేటలోని మెథడిస్ట్‌కాలనీని వరద ముంచెత్తుతోందని ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వర్షం వస్తే చాలు పై నుంచి



బేగంపేట రైల్వే స్టేషన్, కంట్రీక్లబ్, కుందన్‌బాగ్ మీదుగా వచ్చిన వరద మా కాలనీలో నిలిచిపోతోందని వాపోయారు. ఎన్ని సార్లు అన్ని విభాగాలకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని.. తమ కాలనీ నుంచి ధారాలంగా వెళ్లే వరదకు అడ్డుకట్టలా నిర్మాణాలు జరగడంతోనే తమకు ఈ సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. 660 ఇళ్ల వారితో పాటు చుట్టుపక్కల ఉన్న అపార్టుమెంట్ వాసులు కూడా ఇబ్బంది పడుతున్నారు. వెంటనే వరద సాఫీగా వెళ్లేలా చూడాలని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని జోడిమెట్ల క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న నాలాను మేధా సెర్వో డ్రైవ్స్ కంపెనీకి చెందిన వారు ఆక్రమించడంతో వరద రహదారులను ముంచెత్తుతోందని.. వాహన రాకపోకలకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని హిగిరి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలనీలలో మురుగు నీరు నిలిచిపోయి.. రోజుల తరబడి ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు.

రంగారెడ్డి జిల్లా జల్పల్లి మున్సిపాలిటీ, ఎర్రకుంట మస్జిద్-ఏ-కుబా పరిసరాల్లోని నాలాను అక్రమంగా మూసి వేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. అసలు 20 అడుగుల వెడల్పుతో ఉన్న నాలాను సమీప ప్రాపర్టీ యజమాని తన ఇష్టప్రకారం కేవలం 3 అడుగుల %=జజ% పైప్ వేసి మూసివేశారని దీంతో వర్షాకాలంలో నీరు నిలిచిపోతూ మస్జిద్ లోపలకే మురుగు నీరు ప్రవహిస్తోందని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. సమీప నివాస ప్రాంతాల్లో కూడా మురుగు నీరు నిలిచిపోయి నానా అవస్థలు పడుతున్నామని పలువురు ఫిర్యాదులో పేర్కొన్నారు.

శేరిలింగంపల్లి మండలం, చందానగర్ సర్వే నంబర్ 366, 367లో మొత్తం 2470 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాన్ని స్థానిక భూకబ్జాదారులు ఆక్రమించేశారని ఇంజినీర్స్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. షెడ్లు వేసి సర్వీసింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సమీపంలోని 3000 కుటుంబాలకు పార్క్ సౌకర్యం అందడంలేదని వాపోయారు. వ్యాపార కార్యక్రమాలను చేపట్టిన వారి షెడ్డులను తొలగించి పార్కును కాపాడాలంటూ ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు.

## గొప్ప మనసున్న ఆటో డ్రైవర్



ఝరాసంగం, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) : తనది గాని సొమ్ము తనకు వద్దనుకుని తన ఆటోలో ఓ వ్యక్తి మరిచిపోయిన డబ్బులతో కూడిన పర్సును తిరిగి ఇచ్చిన ఘటన సోమవారం ఝరాసంగం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఝరాసంగం గ్రామానికి చెందిన సంగమేశ్వర్ కొల్లూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ ఆటోలో జహీరాబాద్ నుండి ఝరాసంగం వరకు ప్రయాణించాడు. ఈ క్రమంలో ఆటోలో తన పర్సు మర్చిపోయాడు. ఇది గమనించిన ఆటో డ్రైవర్ అందులో 8వేల నగదు ఉన్న విషయాన్ని గమనించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పర్సు అప్పగించారు.ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ పర్సు పోగొట్టుకున్న వ్యక్తిని పిలిచి అప్పగించారు. ఆటో డ్రైవర్ మానవత్వాన్ని మెచ్చుకుని శాలువాతో సన్మానించారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలి




గట్టు (జనంసాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం అంతం పల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఆదేశాల మేరకు పౌర సంబంధాల శాఖ అధికారి, మండల విద్యాధికారి ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలన వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన వ్యవస్థ పై తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగులు ప్రజలకు,పెద్దలకు, యువతకు తమ ఆట పాటల ద్వారా అవగాహన కల్పించారు. జిల్లా కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్ ప్రజలకు బాలలను, చిన్నపిల్లలను ఎవరైనా పొలాల్లో పని మరియు వివిధ వ్యాపారాలలో పిల్లలను పనికి పెట్టుకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలియజేయమని ప్రజలకు చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ రవీందర్ గౌడ్,ప్రజలు, సాంస్కృతిక ఉద్యోగులు కేశవులు,హజరత్,భూపతి, రాహుల్,పాల్గొన్నారు.

## జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు

### సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ





గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 29(జనం సాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలలో దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత, పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం కమీటీ సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వారివెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా, తాలూకా,పట్టణ, మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# పువ్వులను పూజించడం తెలంగాణ గొప్ప సంస్కృతి

### వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పోలీసులకు వారి కుటుంబ సభ్యులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) : బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మీయతను ప్రతిబింబించే పండుగని ఇలాంటి వేడుకలు సాంప్రదాయ విలువలను కాపాడటమే కాకుండా కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.సోమవారం వనపర్తి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసుకార్యాలయంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ వారి సతీమణి బండి అపర్ణ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి బతుకమ్మ ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ బతుకమ్మ వేడుకలలో జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల అధికారులు, సిబ్బంది, మహిళ అధికారులు, వారి కుటుంబసభ్యులతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒకేచోట చేర్చి, రంగురంగుల చీరలతో బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలతో ఆడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా సందడి చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే పండుగని ఇలాంటి వేడుకలు సాంప్రదాయ విలువలను కాపాడటమే కాకుండా, కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని ఎక్కడైనా దేవుళ్లకు పూలు పెట్టి కొలుస్తాము, కానీ పువ్వులనే దేవతగా కొలిచే సాంప్రదాయం ఒక తెలంగాణలో మాత్రమే ఉందన్నారు. తెలంగాణ సంస్కృతికి చారిత్రక చిహ్నం బతకమ్మని తెలంగాణ సంస్కృతికి అద్ద పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని తెలిపారు. పోలీసు వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడటం ఇంత మంది కుటుంబ సభ్యులను కలిసినందుకు వారితో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నందుకు ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది,వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడుతూ సాంప్రదాయ ఉత్సాహాన్ని పంచుకున్నారు. మహిళా






పోలీసు సిబ్బంది అందరూ రంగురంగుల చీరలతో బతుకమ్మలను అలంకరించి పాటలు పాడుతూ ఆనందోత్సాహాలతో వేడుకను జరిపారు. అనంతరం అందంగా, సాంప్రదాయ శైలిలో బతుకమ్మలను రూపొందించిన వారికి ప్రత్యేక బహుమతులను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సతీమణి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు, బండి అపర్ణ , వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వర రావు, డిసిఆర్బి డీఎస్పీ, ఉమామహేశ్వరరావు, కార్యాలయం ఏవో, సునందన, వనపర్తి సిఐ, కృష్ణయ్య, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూర్ సీఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ,నరేష్,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, మహిళా ఎస్సైలు, స్వాతి, రాణి, రజిత,దివ్య. హిమబిందు, జిల్లాలోని ఎస్సైలు, మహిళ పోలీసు సిబ్బంది పోలీసుకార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## గాజులరామారం సర్వేనెంబర్ 307 బాధితులకు న్యాయం చేయండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 29 (జనం సాక్షి) : గాజులరామారం సర్వేనెంబర్ 307లో ఇటీవల హైడ్రా కూల్చివేతల్లో నిరాశ్రులు అయిన పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నంలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన కబ్జాలను అప్పటి ప్రభుత్వం, అధికారులు అడ్డుకోకపోవడం వలన నేడు పేద ప్రజలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ ధరకు సొంతింటి కల నెరవేరుతున్న సంతోషంతో పేద ప్రజలు అక్కడ గూడును నిర్మించుకున్నారని వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. అప్పుడే నిర్మాణం అడ్డుకుంటే వారు నష్టపోయేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధితులను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్ లాంటి వసతులను కల్పించాలని సూచించారు.

## ఆర్టీఐ దరఖాస్తుల సమాచారం ఇవ్వడం అధికారుల బాధ్యత



గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) : సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం పౌరులు ఆయా శాఖల నిర్దేశిత సమాచారం నిబంధనల ప్రకారం అడిగినప్పుడు నిర్ణీత సమయంలో ఇవ్వడం సంబంధిత అధికారుల బాధ్యత అని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు.సమాచార హక్కు చట్టం కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం గద్వాల ఐడిఓసిలోని అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లా స్థాయి అప్పిలేట్ అథారిటీ,పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులతో ఆర్టిఐ దరఖాస్తుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆయా శాఖల అధికారులను దరఖాస్తుదారులు ఆర్టిఐ ప్రకారం సమాచారం అడిగినప్పుడు నిబంధనల ప్రకారం తమ వద్ద ఉన్న సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాలన్నారు. ఇదివరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించే వాళ్ళమని, ఇకపై ప్రతినెల సమావేశం ఉంటుందన్నారు. ప్రతినెల ఆయా శాఖలకు ఆర్టిఐ దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఎన్నింటికి సమాచారం ఇచ్చారు, అప్పిలేటి స్థాయిలో ఎన్ని ఉన్నాయో సమాచార కమిషనరేట్కు వివరాలు పంపించాల్సి ఉంటుందన్నారు. ఏదైనా శాఖలో పౌర సమాచార అధికారి, సహాయ అధికారి, అప్పిలేటు అధికారుల బదిలీలు జరిగినప్పుడు ప్రస్తుతం పనిచేస్తున్న అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లు తప్పులు లేకుండా బోర్డులో రాసి ఉంచాలన్నారు.

### కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు

# అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి వాకిటి శ్రీహరి



కృష్ణ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) : కృష్ణ నది పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు నారాయణపేట జిల్లా, కృష్ణా మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. సోమవారం కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నందున నది పరివాహక ప్రాంత ప్రజలు కృష్ణ మండలం పరిధిలోని, గురుజాల్, హిందూపూర్, గుడేబల్లూరు గ్రామ శివారులో వాసు నగర్, ముడుమల్, మురహరి దొడ్డి,మొదలగు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండి కృష్ణానది లోకి చేపలు పట్టడానికి, ఇతర పొలం పనులకు, పశువులను మేపడానికి వెళ్లరాదని, పిల్లలు సరదాగా ఈత కొట్టడానికి, సెల్ఫీ ఫోటోలు దిగడానికి వెళ్లరాదని పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో సంబంధిత పోలీసులకు, లేదా అధికారులకు, డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

## సాంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యను అందించడం అభినందనీయం

### మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్



మొయినాబాద్ జనం సాక్షి సెప్టెంబర్29 : భారతీయ సాంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యను అందించడం అభినందనీయమని మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లిలో గల శ్రీ స్వామి నారాయణ అంతర్జాతీయ పాఠశాలలో ఏర్పాటు చేసిన వివిధ రాష్ట్రాల సాంస్కృతిక నృత్యాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ పాల్గొని సాంస్కృతిక సాంప్రదాయ వృత్యాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్కృతి సాంప్రదాయాలు విలువలతో కూడిన విద్యను అందిస్తున్న శ్రీ స్వామి నారాయణ ట్రస్ట్ కీ అభినందనలు తెలిపారు. అన్ని రాష్ట్రాలలో కేంద్రాలు ఏర్పాటు చేసి అందరూ సమానమేనని చెప్పకనే చెప్పారని అన్నారు. ఇలాంటి పాఠశాలల ద్వారా ఎంత నేర్చుకున్న తక్కువేనని తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో బాగున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన స్వామీజీలతో పాటు చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, మొయినాబాద్ తాహసీల్దార్ గౌతమ్ కుమార్, మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, జమీలుద్దీన్, సీఐ పవన్ కుమార్ రెడ్డి, విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మొదటి నెల జీతం రూ.291699 చదువుల తల్లికి సమర్పణ



యాచారం (జనంసాక్షి) : చదువుల తల్లి జ్ఞాన సరస్వతి కి మొదటి నెల జీతం సమర్పించిన యాచారం గ్రామానికి చెందిన ఊరే రజిత శ్రీనివాస్ దంపతుల కుమారుడు సాయి తనీష్. సోమవారం యాచారం గ్రామానికి చెందిన సాయి తనీష్ అమెరికాలో ఉద్యోగం లో చేరాడు. చదువుల తల్లికి అయన మొక్కిన మొక్కు నెరవేరిన సందర్భంగా మొదటి నెల జీతం 291669 రూపాయలను జ్ఞాన సరస్వతికి అందజేశారు. ఈ సందర్భంగా ఊరే శ్రీనివాస్ దంపతులు మాట్లాడుతూ.. తమ కుమారుడు యుఎస్ఎలో ఎంఎస్సీ పూర్తి చేసుకుని ఉద్యోగం రావడం ఎంతో సంతోషకర విషయమన్నారు.కోరిన మొక్కులు తీర్చే తల్లి నా సరస్వతికి మొదటి నెల జీతం సమర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టుదలతో చదివి అమ్మవారి అనుగ్రహం తోడై ఉద్యోగం పొంది కుటుంబ సభ్యుల సంపూర్ణ మద్దతు తో ఉదారంగా వినమ్రతతో తన మొదటి నెల వేతనాన్ని అమ్మవారి ఆలయానికి సమర్పించడం జరిగిందన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



కేశంపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) : మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగుల పుష్పమ్మ మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి పల్లె నర్సింగ్ రావు పుష్పమ్మ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. స్థానికుల ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులకు 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ల మహేష్, నాగుల నవీన్, నాగుల నరసింహ, కె. వినోద్ పాల్గొన్నారు.

## ఇంటి నుంచి బాలుడు అదృశ్యం



రాజేంద్రనగర్, సెప్టెంబర్29(జనం సాక్షి) : గండిపేట మండలం కోకాపేట్ చైతన్య అపార్ట్మెంట్ వాచ్మెన్ మద్దిలేటి నాగన్న, వాచ్మెన్ వృత్తి నిర్వహిస్తున్నానని తన కుమారుడు మద్దిలేటి విష్ణు(15) 28.09.2025న మధ్యాహ్నం విద్యార్థి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుండి వెళ్లిపోయాడని, ఇప్పటివరకు తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. చుట్టుపక్కల ప్రాంతాలలో బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా కానీ అతని ఆచూకీ దొరకలేదుని, అందువల్ల, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించాడు. ఈ విషయంలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

## పదవీ విరమణ సందర్భంగా నిమ్స్ ఉద్యోగి శ్రీధర్ వీల్ చైర్ల వితరణ



ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) : నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రేడియేషన్ అంకాలాజీ విభాగానికి చెందిన ఉద్యోగి అప్పారి శ్రీధర్ పదవీ విరమణ సందర్భంగా నిమ్స్ ఆసుప త్రికి వీల్‌చైర్లు విరాళంగా అందజేశారు. నిమ్స్ కు వచ్చే రోగులకు ఉపయోగపడే విధంగా వీల్ చైర్లు ఇవ్వడం తనకు గర్వకారణమని ఆయన తెలిపా రు.ఈ సందర్భంగా దాత శ్రీధర్ కు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెం ట్ లక్ష్మీ భాస్కర్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్య గౌడ్, ఆర్ఎంఓ సల్మాన్‌తో పాటు పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాసులు, రేడియా లజీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీటీసీ,జడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల నియమావళి) అమలు

### గూగుల్ మీట్‌లో జిల్లా కలెక్టర్ జిల్లాఎన్నికల అధికారి రాహుల్ రాజ్



మెదక్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 29( జనం సాక్షి): స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సోమవారం అధికారులకు గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్, ప్రభుత్వ ఆదేశాలు నిబంధనల ప్రకారం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు, జిల్లాలో ఎంపీటీసీ (190), జడ్పిటిసి(21) స్థానాలకు ఎన్నికల నిర్వహణ నిమిత్తం జెడ్పిటిసి ఎన్నికల నిర్వహణ కోసం ఆర్వోలు (26)లకు శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీ(190) ఎన్నికల కోసం 91మంది ఆర్వోలను,91 మంది ఏఆర్వో లకు శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఎంపిటిసి ,జడ్పిటిసి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసి ,(1052), ప్రభుత్వ గెజిట్ ప్రకారం రెండు దఫాలుగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. (492)గ్రామపంచాయతీలకు, (4220) పంచాయతీ వార్డులకు, సంబంధించిన సర్పంచ్ ఎన్నికలు జిల్లాలో మూడు దఫాలుగా నిర్వహించనున్నట్లు అందుకోసం (138) మంది ఆర్వోలు, అసిస్టెంట్ ఆర్వోలు (138) మందిని నియమించి, పోలింగ్ కేంద్రాలు (4220) ద్వారా ఎన్నికలు నిర్వహించడం కోసం సిద్ధంగా ఉన్నామని, ఎన్నికల నియమావళి అనుసరించి జిల్లా స్థాయి అధికారులు అందరిని నోడల్ అధికారులుగా నియమించి ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల నియమావళి పక్కగా అమలు చేయడం జరుగుతుందని అధికారులకు సూచించారు. ఈ గూగుల్ మీట్ లోజిల్లా అధికారులు పాల్గొన్నారు.

# లంబాడీల శాంతి ర్యాలీ విజయవంతం

### గిరిజన ఉద్యోగుల సంఘం, విద్యార్థి సంఘం



నారాయణపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29(జనంసాక్షి) : జిల్లాలోని భారం భావి నుంచి సిటీజన్ క్లబ్ వరకు లంబాడీల ఆత్మగౌరవ శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగింది. జిల్లాల్లో ఉన్న లంబాడి బిడ్డల చరిత్రను తెలియ చేసిన లంబాడిల జేఏసీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించి జెఏ సి నాయకులు మాట్లాడుతూ బంజారా లంబాడిలు సింధు నాగరికత కాలం నుండే ఈ దేశ ములనివాసులు భారత దేశ స్వాతంత్రానికి ముందే గిరిజనులుగా గుర్తింపు పొందినము అన్నారు. 1871లో బ్రిటిష్ పాలకులు బంజారాలను క్రిమినల్ ట్రైబ్స్ జాబితాలో ను.1931 – 1941 లో నిజాం రాజులు చేపట్టిన కులగణన లో బంజారా లంబాడిలను గిరిజనుల పట్టికలో చూపించారు.1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆంధ్రప్రాంతంలోని లంబాడిలు, సుగాలీలను భారత పార్లమెంట్ ఉభయశభల ఆమోదంతో షెడ్యూల్ క్యాస్ట్ అండ్ ద షెడ్యూల్ ట్రైబ్స్ లిస్ట్ ఆర్డర్ 1956 ప్రకారం గిరిజనులుగా గుర్తింపు పొంది గిరిజన జాబితాలో సీరియల్ నెంబర్ 19గా చేర్చబడ్డారని వారు అన్నారు. అయితే ఒకే రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన గిరిజన లంబాడిలను సుమారు 25 సంవత్సరాలు గిరిజన జాబితాలో చేర్చకపోవడానికి అప్పటి కాంగ్రెస్ పార్టీ లంబాడిలను ఘోరమైన అన్యాయం చేసింది అని అన్నారు.1969 కే చందా అధ్యక్షతన వేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ రిపోర్ట్ ఆధారంగా నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ నెత్రుత్వంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఉభయ సభల ఆమోదంతో ద షెడ్యూల్ క్యాస్ట్ అండ్ ద షెడ్యూల్ ట్రైబ్స్ (సవరణ) యాక్ట్ 1976 (యాక్ట్ no 108 of1976) సెప్టెంబర్ 19, 1976 చట్టం చేసి తెలంగాణ ప్రాంతానికి చెందిన లంబాడిలను గిరిజన జాబితాలో క్రమ సంఖ్య 29 గలో చేర్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత శాసన సభ ఎన్నికల్లో లంబాడిల ఓట్లతోనే కాంగ్రెస్ పార్టీ తాను గద్దెనెక్కనని అనేక సభలలో ప్రకటించారు. కానీ 2017లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ప్రాంతంలో హింసత్మక ఘటనకు పాల్పడిన సోయం బాబురావు, తెల్లం వెంకట్రావులను కాంగ్రెస్ పార్టీ లోకి చేర్చుకున్నారు. జూలై 24న వీరిద్దరూ లంబాడిలను గిరిజన జాబితా నుండి తొలగించాలని రిట్ ఫిటిషన్ దాఖాలు చేశారు.ఇది కాంగ్రెస్ పార్టీ ఆదేశాల ప్రకారమే జరిగిందా? దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లంబాడిలకు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై బి ఆర్ ఎస్, బీజేపీ ల వైఖరి కూడా ఎటువైపో సమాధానం చెప్పాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు రాజు నాయక్, వల్య నాయక్,ప్రో" సీతారాం నాయక్,క్రాంతి నాయక్, ,లక్ష్మన్ నాయక్,నరేష్. నాయక్. వెంకటేష్ నాయక్ . కోస్గి వెంకటేష్ తదితరులు లంబాడ సామాజికవర్గం నాయకులు పాల్గొన్నారు.




## బస్సు రామ్ తండా సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థిగా సుధాకర్ నాయక్



మెదక్ (జనంసాక్షి) : వసురం తండా కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా... రామావత్ సుధాకర్ నాయక్ పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో బలోపేతం చేసినటువంటి సుధాకర్ నాయక్ ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో వసురం తండా అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుండి సర్పంచ్ రేసులో ఉన్నట్లు స్థానిక సమాచారం. ప్రతి పేదవాడికి ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు ఇప్పించడం జరిగింది ఇల్లు రాని వాళ్లకు కూడా ఇల్లు ఇప్పించే బాధ్యత నాది మాకు ఇల్లు రాలేదని ఎవరుదిగులు పడకూడదు ఏది అడిగినా ఇప్పించే బాధ్యత నాది ఈసారి సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నుంచి కావాల్సిన అభ్యర్థి సుధాకర్ నాయక్ మన నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్న కృషితో వస్త్రం తండా కు ఈ పని అయినా కృషి చేస్తా అని మాట ఇవ్వడం జరిగింది. మాటకు కట్టుబడి ఈసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవడం మన బాధ్యత. ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ మన తాండ డెవలప్మెంట్ చేసే మన బాధ్యత అని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో సద్దుల బతుకమ్మ వేడుకలు

### బతుకమ్మ సంబురాల్లో పులిమామిడి మమత



సదాశివపేట సెప్టెంబర్ 29(జనంసాక్షి) : పట్టణంలోని 12 వ వార్డు నందు సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని పులిమామిడి మమత తమ వార్డు సభ్యులందరితో కలిసి బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పులిమామిడి మమత మాట్లాడుతూ బతుకమ్మ అంటే బతుకును నేర్పేదని, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా రంగు రంగుల పూలను ఒకే దగ్గర చేర్చి తయారు చేసే పూల పండుగ అని తెలియజేశారు. దసరా నవరాత్రులలో భాగంగా తొమ్మిది రోజులు బతుకమ్మలను పేర్చి మహిళలందరూ కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో, కోలాటాలతో బతుకమ్మ సంబురాలను కన్నుల పండుగగా జరుపుకుంటామని వారు తెలియ జేశారు. ప్రపంచంలోనే అందులో బతుకమ్మ పండుగ అంటేనే తెలంగాణ గుర్తొచ్చేలా బతుకమ్మ పండుగ ప్రసిద్ధిగాంచడం చాలా సంతోషకరమన్నారు. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకమైన పండుగ అని తెలిపారు. చివరి రోజున పెద్ద ఎత్తున సద్దులబతుకమ్మలను తయారు చేసి చెరువుల దగ్గరకు తీసుకొని వెళ్లి గౌరమ్మను పసుపుతో తయారుచేసి బతుకమ్మలో అమర్చి బతుకమ్మలను ఆడి తదుపరి, మహిళలందరిని సంతోషంగా, చల్లంగా చూడమని, పోయిరా బతుకమ్మ పోయిరా అంటూ మళ్ళీ వచ్చే ఏడాది రమ్మని సంతోషంగా ఆ బతుకమ్మలను చెరువులో నిమర్జనం చేస్తామని పులిమామిడి మమత పత్రికా ముఖంగా తెలియపరిచారు. ఇట్టి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఆడపడుచులందరికి వారు బతుకమ్మ శు భాకాంక్షలు తెలియపరిచారు. ఇట్టి కార్యక్రమంలో తన కుమార్తె పులిమామిడి మాధవి, స్వరూప, అరుణ, తాలెల్మ రాణి, విజయ, వైట్ల అపర్ణ, లక్ష్మి, మొదలగు వారు పాల్గొన్నారు.

# దుర్గాదేవి నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) : దుర్గాదేవి నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం చేసే వినాయక సాగర్ చెరువు (బంగల్పేట్ చెరువు) ను కలెక్టర్ పరిశీలించారు. చెరువుగట్టు వెంబడి రక్షణ కోసం ఏర్పాటుచేసిన బారికేడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని చెప్పారు. మెరుగైన లైటింగ్ తో పాటు, క్రేన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ఎవరు చెరువులోకి దిగకుండా ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిమజ్జనం కార్యక్రమం పూర్తయిన వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని అన్నారు. అంతకుముందు కలెక్టర్, బంగల్పేట్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ కు పూజారులు ఘన స్వాగతం పలికారు. మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ కు అమ్మవారి ఫోటోను బహుకరించారు. పూజారులు ఆలయ చరిత్రను, విశిష్టతను వివరించారు. దసరా పర్వదినం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ధూందాంగా బతుకమ్మ ఆటాపాట

- పల్లె పాటలపై హోరెత్తించిన పశు సంవర్ధక శాఖ మహిళా ఉద్యోగులు



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : ఎంగిలి పూల బతుకమ్మ సంబరాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయం ఆద్వర్యంలో బతుకమ్మ వేడుకలను బతుకమ్మ పల్లె పాటలు పాడుతూ మహిళా ఉద్యోగులు తమదైన శైలిలో దూంధాంగా స్టెప్పులు వేస్తూ ఔరా అనిపించారు. కార్యక్రమంలో మొదటగా జిల్లా అధికారి జాయింట్ డైరెక్టర్ రామారావు ముఖ్య అతిథిగా హాజరై గౌరమ్మకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆ శాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది మొత్తం ఈ సంబరాల్లో పాల్గొని బతుకమ్మపై పాత పాటలు పాడుతూ అందరిని ఆశ్చర్య పరిచారు. నాలుగు గంటలపాటు



బతుకమ్మ పాటలపై చప్పట్లు వేస్తూ స్టెప్పులేశారు. డాక్టర్లు సైతం నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు హోరెత్తిస్తున్నాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ బతుకమ్మ సంబరాలతో కిట కిటలాడుతున్నాయి.



# రోడ్డు మధ్యలో గుంత!

- పట్టించుకునే నాధుడే లేరా?

నెక్కొండ (జనంసాక్షి) : నెక్కొండ మండల కేంద్రంలోని గూడూర్ -నెక్కొండ ప్రధాన రహదారి పై రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి, వాహనా దారులు ప్రమాదాలు జరుగుతున్నాయి, వర్షాకాలం కావడంతో నీటి గుంట నిండి ఉండడంతో దాని లోతు అంచనా వేలిక జారీ పడుతున్నారు, గాయాల పాలవుతున్నారు , ఆర్ అండ్ బి అధికారులు గుంతలను పుడిచి ప్రమాదం నివారిస్తారని వాహనదారులు కోరుతున్నారు.

# నిర్మల్ వాసికి ప్రైడ్ అఫ్ తెలంగాణ అవార్డు



నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్29 (జనంసాక్షి) : హైదరాబాద్ లో నిర్వహించిన ప్రైడ్ అఫ్ తెలంగాణ అవార్డు 2025 ను నిర్మల్ పట్టణానికి చెందిన ముత్యం సాయివీర్ కుమార్ గెలుచుకున్నారు. భారతదేశం యొక్క వేగంగా అభివృద్ధి చెందుతున్న లీగ్‌టెక్, ఫిన్‌టెక్ సాస్ ప్లాట్‌ఫాం వైదర్, ఉత్తమ స్టార్టప్ విభాగంలో ప్రతిష్టాత్మక 'ప్రైడ్ ఆఫ్ తెలంగాణ 2025' అవార్డును గెలుచుకున్నట్లు ప్రకటించింది. 'ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్' గుర్తింపు తరువాత, ఆటోమేషన్ ద్వారా వృత్తిపరమైన సేవలను మార్చడంలో వైదర్ ను స్థాపించాడు. ఈ అవార్డు లను ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నటుడు సుధీర్ బాబు విజేత లకు పురస్కారాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.పి.రఘురామ్, ఐటీ రంగ నిపుణులు రమేష్ కాజా, సృష్టి ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, టీ హబ్ మాజీ సీఈవో శ్రీనివాస్ మహంకాళి, రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధులు జి. సిద్ధార్థ్, వీనిషప్తా పాల్గొన్నారు.

# దైవచింతనతో ప్రశాంత జీవనం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



రాయపర్తి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి): దైవ సన్నిధిలోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని,ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు.వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని తిర్మలాయపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన దుర్గమాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలలో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం వల్ల ప్రశాంత జీవనాన్ని గడిపె అవకాశం ఉంటుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో అందరూ పండగలు నిర్వహించుకోవడం సంతోషకరం అన్నారు.ప్రజల కష్టాల్లో తనవంతు పాలు పంచుకుంటానన్నారు. అనంతరం ఘనంగా అన్నా ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్య నాయక్,మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి,వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, నాయకులు ముద్రబోయిన వెంకన్న,మహేందర్ రెడ్డి, కాంచనపల్లి వనజారాణి,పాల్వంచ కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ -2కు ఎంపికైన తర్లపాడ్ వాసి



ఖానాపూర్ టౌన్, సెప్టెంబర్ 29(జనంసాక్షి) : ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామానికి చెందిన కల్లెం రమేష్ గ్రూప్ 2 లో కమిషనర్ ఫర్ కోఆపరేషన్, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీల ఆధీనంలో అసిస్టెంట్ రిజిస్టర్ ఉద్యోగం సాధించాడు. నిరంతర కృషి పట్టుదల గురువుల మార్గదర్శకత ఫలితంగా విజయం సాధ్యమైందని రమేష్ తెలిపారు.గతంలో రమేష్ అక్క సైతం గ్రూప్ 2 ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా రమేష్‌ను బంధువులు,గ్రామస్తులు అభినందించారు.

# ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్



మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 29(జనం సాక్షి): తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థలు మరియు గ్రామ పంచాయతీ ఎన్నికల సిబ్బందికి దసరా సెలవుల్లో శిక్షణ తరగతులు నిర్వహించిన కారణంగా సుదూర ప్రాంతాల నుండి హాజరు కాలేని వారందరికీ తిరిగి మరొక రోజు శిక్షణ తరగతులు నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కె అనిల్ కుమార్ కి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ మెమొరాండం ఇచ్చి కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అదేవిధంగా వివిధ రకాల సెలవుల్లో ఉన్నవారికి వైద్య కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి , ఫీడింగ్ తల్లులకు , రిటైర్మెంట్ కు దగ్గరలో ఉన్న వారికి ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి హరి నాయక్, జి భద్రు నాయక్, ఉపాధ్యాయులు సురేష్ , శంకర్ , వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్‌ను కలిసిన వరంగల్ మండల రేషన్ డీలర్ల సంఘం

- డీలర్లకు రావలసిన 6 నెలల కమిషన్ ఇవ్వాలని వినతి



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) : రాష్ట్ర నాయకత్వం నాయకోటి రాజు రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా కమిటీ ఆదేశానుసారం వరంగల్ జిల్లా కలెక్టరేట్లో సోమవారం జాయింట్ కలెక్టర్ సంధ్యారాణికి వరంగల్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన గజ్జి గోవర్ధన్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ సంధ్యారాణి కలిశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లకు రావాల్సిన ఆరు నెలల కమిషన్ ఇవ్వాలని డీలర్ల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్కు వినతి పత్రం అందించారు.అదేవిధంగా సివిల్ సప్లై డిఎస్ఓ కిష్టయ్య కి కూడా మెమోరాండం ఇవ్వడం జరిగింది . డీలర్లకు రావాల్సిన ఆరు నెలల కమిషన్ వచ్చేలా రిపోర్టు తయారుచేసి పంపాలని డి ఎస్ ఓ ను కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ మండల అధ్యక్షులు గజ్జి గోవర్ధన్, కార్యదర్శి కుసుమ రాజేందర్ సీనియర్ రేషన్ డీలర్లు మాడిశెట్టి కొమురయ్య నమిండ్ల కుమారస్వామి బండి లక్ష్మణ్, ఎండి షబ్బీర్, బసవరాజు సాంబయ్య, చందు, సంజీవ, సలీం ఖాన్, మంద వాని మహేందర్ తదితర డీలర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హజ్ యాత్రకు నలుగురి ఎంపిక



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి నలుగురు ఎంపికైనట్లు తెలంగాణ హజ్ కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షులు సర్వర్ మోహియోద్దీన్ ఘాజీ, మొహమ్మద్ మోహియుద్దిన్ లు సోమవారం తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన హజ్ యాత్ర కు వెళ్లేందుకు అందరికి అవకాశం ఉండదన్నారు. జిల్లాకు కొంతమందిని మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా భూపాలపల్లి జిల్లా నుండి ఖదీర్ అహ్మద్, గౌసియా బేగం, హనీఫ్, అమీన బేగం లను ఎంపిక చేసి, వారికి సెలెక్ట్ అయిన పత్రాలను, మార్గదర్శక బుక్కును అందించినట్లు తెలిపారు. హజ్ యాత్రకు ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని వారికి శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ ఇర్ఫాన్, జామ మస్జిద్ అబ్బాసియ మజీద్ కమిటీ ఉపాధ్యక్షులు అబ్దుల్ హఫీజ్, మజీద్ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ సాబీర్ ఖాన్, సయ్యద్ నజీబ్, షాహిద్, నదీమ్, రహీం తదితరులు పూలమాలలతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.

# దసరా ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు

- ఉత్సవ కమిటీ అధ్యక్షులు సంజయ్ బాబు
- కరీమాబాదులో దసరా ఉత్సవ కమిటీ సమావేశం



వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) : వరంగల్ నగరంలోని ఉరుసుగుట్ట రంగలీల మైదానంలో ఈనెల 30న సద్దుల బతుకమ్మ అక్టోబర్ 2న దసరా ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు కరీమాబాద్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షులు నాగపూరి సంజయ్ బాబు తెలిపారు.ఈ మేరకు సోమవారం కరీమాబాద్ ఆదర్శ ఫంక్షన్ హాల్లో దసరా ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సంజయ్ బాబు మాట్లాడుతూ దేశంలోనే మైసూర్ తర్వాత అత్యంత వైభవంగా ఉరుసు రంగ లీల మైదానంలో దసరా వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.లక్షలాదిగా వచ్చే భక్తుల కోసం కావలసిన అన్ని సౌకర్యాలను కలిగించినట్లు తెలిపారు.వాహనాల కోసం పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రభుత్వ శాఖల ద్వారా బార్కెట్లు విద్యుత్ వాటర్ పారిశుధ్యం మొదలైన సౌకర్యాలను కలిగించినట్లు తెలిపారు.పోలీసులు ఈసారి మరింత బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా డోనర్ పాసులు ఇతర పాసుల వ్యవహారాన్ని చూసుకుంటున్నట్లు తెలిపారు.ఉత్సవాన్ని విజయవంతం చేయాలని సంజయ్ బాబు కోరారు. ప్రధాన కార్యదర్శి మేడి మధుసూదన్ మాట్లాడుతూ ఉత్సవాలకు రాష్ట్రమంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు, శాసనమండలి ఉపసభాపతి బండ ప్రకాష్, వరంగల్ నగరం మేయర్ గుండు సుధారాణి ,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ,వరంగల్ ఎంపీ కడియం కావ్య ,ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య తోపాటు జిల్లా కలెక్టర్ సత్య శారద సి పి సన్ ప్రీత్ సింగ్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ,కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి ,డిసిపి ప్రభాకర్, ఏఎస్పి శుభం నగరాలే తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.కోశాధికారి మంద వెంకన్న మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన ఉత్సవాలకు సంబంధించిన ఆదాయ వేయాలను వివరించారు.ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షులు గోనే రాంప్రసాద్, సహాయ కోశాధికారి వేలిడే శివమూర్తి, నాగపురి రంజిత్ గౌడ్, పొగాకు సందీప్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ ,అఖిల్ గౌడ్, అజయ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు బైక్ ఢీ

ఒకరి పరిస్థితి విషమం



కాటారం, సెప్టెంబర్ 29 ( జనం సాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మహాదేవపూర్ మార్గమధ్యలో సోమవారం ఆర్టీసీ బస్సు లూన బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. భూపాలపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టీ ఎస్ 25 టీ 4668 హైదరాబాదు నుంచి కాలేశ్వరం వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని సబ్ స్టేషన్ పల్లెకు చెందిన మాచర్ల మల్లేశం (65) అనే కూరగాయల చిరు వ్యాపారి కి తీవ్ర గాయాలయ్యాయి. లూన బైక్ బస్సు టైర్ల కిందికి వెళ్లిపోగా నుజ్జు నుజ్జు అయ్యింది. మల్లేశంకు తలకు, భుజాలకు తీవ్ర గాయాలై , రక్తస్రావం జరగగా రోడ్డు అంతా రక్తం తో నిండి పోయింది. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని అంబులెన్స్ లో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సరస్వతిమాతగా కనకదుర్గాదేవి



వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) : దేవి నవరాత్రులను పురస్కరించుకొని వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట కనకదుర్గ దేవస్థానం యందు కనకదుర్గ అమ్మవారు సోమవారం సరస్వతిమాతగా భక్తుల కు దర్శనం ఇచ్చారు. గత ఏడు రోజులుగా జరుగుతున్నటువంటి కార్యక్రమాలలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందడం జరుగుతుంది. కార్యక్రమాలలో భాగంగా అమ్మవారికి ప్రతిరోజు జరిగే చండీ హొమాలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు పాలకుర్తి ఆంజనేయ శర్మ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కుల వ్యవస్థ నిర్మూలన కోసం సంఘటితంగా పోరాడాలి

- సిపిఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు




చెన్నారావుపేట, సెప్టెంబర్ 29(జనం సాక్షి): దేశ ప్రజల ఐక్యతకు ప్రధాన అడ్డంకిగా మారిన కుల వ్యవస్థ నిర్మూలన కోసం ప్రజలంతా సంఘటితంగా పోరాడాలని సిపిఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు అన్నారు.సోమవారం చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామంలో సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, కుల నిర్మూలనే ధ్యేయంగా మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ వారోత్సవాలను పురస్కరించుకొని సెప్టెంబర్ 24 నుండి 30 వరకు నిర్వహించే కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో ఓట్లు, సీట్లు, రాజకీయ అధికారం కోసం పాలకవర్గ పార్టీలు కుల వ్యవస్థను పెంచి పోషిస్తూ, ప్రజల్లో కుల వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిజెపి- ఆర్ఎస్ఎస్ బ్రాహ్మణీయ మనువాద ఆధిపత్య విధానాలు అనుసరిస్తున్నదని, దీనివలన దేశంలో దళిత, గిరిజన, బడుగు, ముస్లిం మైనారిటీ అణగారిన వర్గాలపై కుల, మత వివక్ష, అణిచివేత, దాడులు, దౌర్జన్యాలు, హత్యలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బానోత్ జవహర్ లాల్, కత్తుల కొమురయ్య, సురేష్, ఎల్లయ్య, కొమ్మాలు, చింటు, గణేష్, రాజయ్య, రాజు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన పర్వతం విక్రమ్


విక్రమ్

పెన్ పహాడ్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) : మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన పర్వతం విక్రమ్ జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పి. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జనగామ జిల్లా లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు తున్న సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలం అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన పర్వతం గంగయ్య యాదమ్మల చిన్న కుమారుడు పర్వతం విక్రమ్ జాతీయస్థాయిలో ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక య్యారు ఈ నెల 25 నుండి 27 వరకు జనగామా జిల్లా లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టోర్నమెంటులో పర్వతం విక్రమ్ ప్రతిభా కనబరిచాడు. అక్టోబర్ 05 నుండి 08వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్ లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. విద్యార్థి కోచ్ లింగా నాయక్, పిడి కిషన్, స్టాఫ్ ప్రెసిడెంట్ వేణుమాధవ్ లను ప్రిన్సిపల్ పి. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ నరసింహులును అభినందించారు. అదేవిధంగా అన్నారం బ్రిడ్జి గ్రామ ప్రజలు విక్రమ్ జాతీయస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషకరమని గ్రామస్తులు అభినందించారు.

## హ్యాండ్ బాల్ పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకున్న పర్సనబోయిన సౌమ్య..



కనగల్, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) 17 వ, జాతీయ హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీ లో తెలంగాణ రాష్ట్ర టీం సభ్యురాలు పర్సనబోయిన సౌమ్య ప్రథమ బహుమతి సాధించింది. ఈమె మండలంలోని జీ ఎడవల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి విద్యను అభ్యసిస్తుంది. సౌమ్య విజయం పట్ల మండల విద్యాధికారి వి పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ నారాయణ, కవిత, సి ఆర్ పి తిరందాను సంతోష్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేసి, అభినందించారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తారు, ఆశీర్వదిస్తారు

- మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాలకు తెలుసు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



మధిర, సెప్టెంబర్ 29 (జనంసాక్షి): స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రజలు ఆదరిస్తారు, ఆశీర్వదిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఉదయం మధిర క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, మనసులకు బాగా తెలుసు అని అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరికను నెరవేర్చింది అన్నారు. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వే నిర్వహించి బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించామన్నారు.

మీ కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు, కుట్రపూరితంగా కోర్టులకు పంపిస్తున్నారని అన్నారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలు ఇచ్చి బీఆర్ఎస్ పెద్దలు అమలు చేయలేదు అన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల్లో కూడా పూర్తిగా చేయలేకపోయారని డిప్యూటీ సీఎం విమర్శించారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయింది అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చింది అన్నారు.

యువతకు గ్రూప్ వన్ గ్రూప్ టు తో పాటు ఇప్పటికే 60,000 ఉద్యోగాలు, 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న ధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్, 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఇందుకుగాను 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వివరించారు. రాష్ట్రంలో 1.05 కోట్ల కుటుంబాలు ఉండగా 96 లక్షల కుటుంబాలకు మనిషికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం, బహిరంగ మార్కెట్లో 56 రూపాయలు కిలో ధర పలుకుతున్న సన్నబియ్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసి ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తున్నాం అన్నారు.

## యూరియా కోసం రైతుల తిప్పలు.. క్యూలైన్లో చెప్పులు..



కల్లూరు సెప్టెంబర్ 29(జనంసాక్షి) మండల పరిధిలోని పోచవరం సొసైటీలో యూరియా కట్టల కోసం రైతు సోదరులు క్యూ లైన్ లో చెప్పులు పెట్టి నిలబడ్డ సంఘటన సోమవారం జరిగింది. ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన వారి పైరు చిరు పొట్ట దశకు రావడంతో ఈ సమయంలో యూరియా అవసరం కావటంతో రైతులు యూరియా కోసం సోమవారం ఉదయం సొసైటీ కార్యాలయానికి చేరుకొని లైన్ లో చెప్పులు పెట్టి నిలబడ్డారు. పోచావరం సొసైటీకి 550 యూరియా కట్టలు రావడంతో సొసైటీ పరిధిలోని వెన్నవల్లి గ్రామంలో 220 కట్టలు, పోచారం పెద్ద కోరుకొండ కి 130 కట్టలు, తాళ్లూరు వెంకటాపురానికి 150 కట్టలు, వచ్చాయి. వెన్నవల్లి లో 220 కట్టలు పంపిణీ చేయగా, సోమవారం సొసైటీలో 130 కట్టల కోసం ఉదయం ఆరు గంటల నుండి పెద్ద కోరుకొండి పోచావరం గ్రామాల చెందిన వందలాది మంది రైతులు సొసైటీ కార్యాలయం చేరుకొని క్యూ లైన్ లో చెప్పులు పెట్టారు. తొమ్మిదింటికి సొసైటీ అధికారులు వచ్చి లైన్లో వస్తే టోకెన్లు ఇస్తామని చెప్పి 130 మందికి టోకెన్లు పంపిణీ చేశారు. రైతుల అవసరాలను బట్టి యూరియా సరఫరా చేస్తే మా కష్టాలు తీరుతాయంటూ రైతులు పేర్కొంటున్నారు..



## సొంత ఖర్చుతో వృద్ధులకు ఇల్లు నిర్మించిన యువకుడు

### ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



మిర్యాలగూడ, సెప్టెంబర్ 29,( జనంసాక్షి) ప్రమాద వశాత్తు అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డ వృద్ధ దంపతులకు ఆసరాగా నిలిచాడు ఆ యువకుడు. సొంత డబ్బుతో ఇంటిని నిర్మించి వారికి నిలువ నీడ కల్పించి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు మిర్యాలగూడ మండలం సామగాని తండాకు చెందిన ధీరావత్ చందు నాయక్. అతని వితరణకు అబ్బురపడిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ )ఆదివారం గృహప్రవేశాన్ని ప్రారంభించి వృద్ధులకు అందజేశారు. కొన్ని నెలల క్రితం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు కేతావత్ రాములు,కమిలి లకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి దగ్ధమైపోయింది. దీంతో వారు రోడ్డున పడ్డారు. గమనించిన చందు వారికి సొంత డబ్బుతో ఇంటిని నిర్మించాడు. గతంలో కూడా రైతుల కోసం గ్రామంలో రోడ్డు నిర్మాణం చేపట్టాడని, తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు బోరు వేయించాడని, గ్రామంలో ఎలాంటి కష్టం వచ్చినా అండగా నిలబడుతూ సేవా కార్యక్రమాలు చేస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా చందును అభినందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేసే కార్యకర్తలు తమ పార్టీలో ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు. ఇలాంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బిఎల్ఆర్ అన్నారు. చందు మాట్లాడుతూ తమ నాయకుడు ఎమ్మెల్యే బిఎల్ఆర్ స్ఫూర్తితోనే తాను సామాజిక కార్యక్రమాలు చేస్తున్నానని, సేవా కార్యక్రమాలకు ఆయన ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట ప్రకారం అన్ని రంగాల్లో అభివృద్ధి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్
- 93కోట్ల తో నీటిసరఫరా పనులు, 6800 కొత్త నల్లా కనెక్షన్ లు
- 171 కోట్ల తో 136 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం
- 93 కోట్లతో టాకా రోడ్డు వెడల్పు, సీసీ రోడ్ల నిర్మాణం



మిర్యాలగూడ, సెప్టెంబర్ 29,( జనంసాక్షి): రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన మిర్యాలగూడ పట్టణం లో అభివృద్ధి పనులు ఒక్కసారిగా ఉపందుకున్నాయి. సుమారు 391 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బి ఎల్ ఆర్ శంకుస్థాపన చేశారు. 171 కోట్ల రూపాయల నిధులతో 136 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. టి యు ఎఫ్ ఐ డి సి ఫండ్స్ ద్వారా 93 కోట్లతో పట్టణంలోని టాకా రోడ్డు వెడల్పు పనులు చేపట్టడమే కాకుండా, నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు, 20 కోట్ల రూపాయల నిధులతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను నిర్మిస్తున్నామని పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే బిఎల్ఆర్ తెలిపారు. వీటితోపాటు 6.60 కోట్ల రూపాయల నిధులతో పట్టణంలో ప్రధాన చెరువులైన పందిర్లపల్లి చెరువు, చిన్న చెరువు ల మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్లు, 15వ ఆర్థిక సంఘం జనరల్ ఫండ్స్ కింద 6.80 కోట్ల రూపాయల నిధులతో పట్టణంలోని పలుచోట్ల నూతన డ్రైనేజీ కాలువల నిర్మాణం పనులు ఎమ్మెల్యే ప్రారంభించారు. 93 కోట్ల రూపాయల నిధులతో కొత్తగా మంచినీటి సరఫరా పనులు ప్రారంభించామని, దీని ద్వారా 6800 నూతన హౌస్ సర్వీస్ కనెక్షన్లు కల్పించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్న నేపథ్యంలో ముందస్తుగానే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు ఎమ్మెల్యే బిఎల్ఆర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మిర్యాలగూడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయం తో ముందుకు పోతున్నామన్నారు. తాను కొందరిలో మాటలు చెప్పేవాడిని కాదని, చేతలతోనే తానేంటో నిరూపిస్తానని అన్నారు.

## మామూళ్ల మత్తులో మైనింగ్అధికారులు

- మాడ్గులపల్లి మండలంలో యదేచ్చగా అక్రమ ఎర్రమట్టి రవాణా
- పట్టించుకోని అధికారులు పబ్బం గడుపుకుంటున్న దళారులు



మాడ్గులపల్లి సెప్టెంబర్ 29 (జనంసాక్షి): భూగర్భ జల సంపదను పరిరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాల్సిన మైనింగ్ అధికారులు మచ్చుకైన కనిపించకుండా మామూళ్ల మత్తులో పడడంతో విలువైన భూగర్భ సంపద దళారుల పాలవుతుంది. మైనింగ్ అధికారుల అండతో అక్రమంగా ఎర్ర మట్టిని తవ్వి అక్రమ రవాణా చేస్తూ మూడో టిప్పర్లు ఆరు లారీలు అన్న చందంగా ఎర్ర మట్టి తరలిస్తూ అక్రమసంపాదనకు అలవాటు పోతున్నారు ఎర్రమట్టి మాఫియా. వివరాల్లోకి వెళితే మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామపంచాయతీ పరిధిలోని వ్యవసాయ భూమిలో కొందరు ఎర్ర మట్టి మాఫియా మైనింగ్ అధికారులతో మాట్లాడుకుని జెసిబిల సహకారంతో యదేచ్చగా ఎర్రమట్టి ని తవ్వి కుక్కడం చింతలగూడెం గ్రామాల మీదుగా నార్కట్ పల్లి - అద్దంకి రహదారి నుంచి మిర్యాల గూడ కు తరలించుకపోతున్నారు. దీంతో కుక్కడ%శీ% నుంచి పూసలపాడు వెళ్లే రహదారి గుంతలమాయం అయింది. అధిక బరువుతో అతివేగంతో వెళుతున్న ఎర్రబట్టి టిప్పర్లతో రహదారి ధ్వంసం అవుతుండగా ప్రజలు రహదారిపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పూసలపాడు గ్రామంతో పాటు కుక్కడం చింతలగూడెం గ్రామ ప్రజలు వ్యవసాయ బావులకు వెళ్లాలంటే గుంతల మయమైన దారిపై నరకయాతన పడవలసి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ అరికట్టాల్సిన సంబంధిత మైనింగ్ అధికారులు స్పందించకపోవడం విశేషం. ఈ విషయం స్థానిక పంచాయతీ కార్యదర్శి తో పాటు రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకొనివెళ్లగా అప్రమత్తమైన అధికారులు సంఘటన స్థలానికి చేరుకునే లోపే మైనింగ్ మాఫియా పసిగట్టి జెసిబి టిప్పర్లతో సహా అక్కడనుండి వెళ్లిపోవడం విశేషం. ఈ సంఘటనను బట్టి అక్రమ ఎర్రమట్టి మాఫియా ఏ స్థాయిలో పనిచేస్తుందో ఊహించవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఎర్రమట్టి రవాణాను అరికట్టి గ్రామీణ రహదారులు ధ్వంసం కాకుండా ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## అన్ని మండలాల్లో జడ్పీటీసీ,ఎంపీపీ స్థానాలు కైవసం చేసుకుంటాం

- జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు



మెట్ పల్లి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) కాంగ్రెస్ పార్టీ ప్రజలందరినీ మోసం చేసిన నేపథ్యంలో ప్రతి ఒక్కరు ముఖ్యంగా మహిళలు కాంగ్రెస్ పార్టీని ఓడించి రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని బిఆరెస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. కోరుట్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జడ్పీటీసీ,ఎంపీపీ స్థానాలు బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందన్నారు. మెట్ పల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించిన విద్యాసాగర్ రావు కార్యకర్తలందరు ఐక్యంగా కష్టపడాలని మీకోసం ప్రతి రోజు కష్టపడి మిమ్మల్ని గెలిపించుకుంటామని అన్నారు. ఎన్నికల్లో దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కినాక ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి తీరును ప్రతి ఇంటికి వివరించాలని కార్యకర్తలకు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఓడించాలనే కసితో ఉన్నారని బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం తథ్యం అని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్తేనే హామీలు నెరవేరుతాయని ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.

## ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి : కలెక్టర్




సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల విధులను ఎలక్షన్ కమిషన్ నియమాలకు అనుగుణంగా సక్రమంగా బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా అధికారుల సముదాయంలోని సమావేశ మందిరంలో త్వరలో నిర్వహించు జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్,వార్డ్ సభ్యుల ఎన్నికలకు సంబంధించి ప్రీసైడింగ్ అధి,కారులకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాలలో జరుగు తున్నందున సదరు ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని,ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలు పాటించాలని, ఎలాంటి తప్పు జరిగినా అవి ఎన్నికల మీద, శాంతి భద్రతల మీద తీవ్రప్రభావం చూపుతాయని అన్నారు. అధికారులు ఎన్నికల విధులు బాధ్యతతో నిర్వహించాలని చెప్పారు. ప్రీసైడింగ్ అధికారులు ప్రీసైడింగ్ అధికారుల కరదీపిక పుస్తకాన్ని క్షుణ్ణంగా చదువుకొవాలని,అర్థం కాని పక్షంలో మాస్టర్ ట్రైనర్స్ ను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ఎలక్షన్ కమిషన్ రూల్స్ ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని,ఎలక్షన్ ప్రారంభం నుండి బ్యాలెట్ బాక్స్ అప్పగించే వరకు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అన్నారు. మండలాలలో పిఓ, ఓపిఓలకు శిక్షణ ఇవ్వాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జడ్పీ సీఈవో వివి.అప్పారావు, డిపిఓ యాదగిరి, డీఎఫ్ఓ సతీష్, మాస్టర్ ట్రైనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో సద్దుల బతుకమ్మ సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సతీమణి సునీత జగదీష్ రెడ్డి పట్టణ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఉప్పల లలిత, మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు,మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని అన్నారు.







# ఏడోరోజూ నష్టాల్లోనే..

### మదుపర్ల అప్రమత్తత సూచీల పతనం

**ముంబై:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. వరుసగా ఏడో రోజూ నష్టాలు చవిచూశాయి. ఉదయం లాభాల్లో మొదలైన సూచీ..రోజంతా లాభనష్టాల మధ్య కదలాడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరపతి విధాన సమీక్షా సమావేశం సోమవారం ప్రారంభమైన వేళ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడంతో సూచీలు స్వల్ప నష్టాలతో మగిశాయి.ఉదయం సెన్సెక్స్ 80,588.77 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,426.46) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,248.84 – 80,851.38 మధ్య చలించింది. చివరికి 61.52 పాయింట్ల నష్టంతో 80,364.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19.80 పాయింట్ల నష్టంతో 24,634.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.76గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ, యాక్సిస్ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. టైటాన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎటెర్నల్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.01 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3810 డాలర్ల వద్ద కొనసాగుతోంది.





# ఏఐతో సరిగమలు పలికించేలా రెహమాన్ వినూత్న ప్రాజెక్ట్



**న్యూఢిల్లీ:**ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ 'మొజార్ట్ ఆఫ్ మద్రాస్ సీక్రెట్ మౌంటైన్' అనే వినూత్న సంగీత ప్రాజెక్టును ప్రారంభించడానికి సిద్ధమ వుతున్నారు.ఇది మెటావర్స్‌లో వర్చువల్ ఏఐ ఆధారిత బ్యాండ్. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ ప్రాజెక్టుకులో భాగంగా ప్రత్యేకమైన డిజిటల్ సింఫనీ ద్వారా ప్రపంచ సంస్కృతులను ఏకం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రెహమన్ ఓ కార్యక్రమంలో చెప్పారు.ఇది ఆరుగురు సభ్యు లున్న వర్చువల్ బ్యాండ్. ఇందులో ప్రముఖ సంగీత కళాకారులు కారా, బ్లెసింగ్, ఎకామ్, జెంటమ్, డేవిడ్, ఆఫియా ఉన్నారు. ఈ బ్యాండ్ పూర్తిగా మెటావర్స్‌లో ఉంటుంది.ఇందులో ప్రముఖ సంగీత కళాకారులు కారా, బ్లెసింగ్, ఎకామ్, జెంటమ్, డేవిడ్, ఆఫియా ఉన్నారు. ఈ బ్యాండ్ పూర్తిగా మెటావర్స్‌లో ఉంటుంది. మెటావర్స్ అనేది ఒక సామూహిక వర్చువల్ స్పేస్. ఇందులో డిజిటల్ అవతార్లు వర్చువల్‌గా సాంకేతికతలను ఉపయోగించి పర స్పరం సంభాషించవచ్చు. కలిసి పాడవచ్చు. వర్చువల్ రియాలిటీ ఆగ్మెంటెడ్ రియాలిటీ కలయికతో ఇది పని చేస్తుంది. వీటిని ఉపయోగించి రెహమాన్ సంగీతాన్ని సృష్టించనున్నారు .ఏఐ సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ ప్రాజెక్ట్ ఉపయోగించబడు తుందని, అదే సమయంలో మానవ కళాత్మకతను ఇది భర్తీ చేయదని రెహమాన్ నొక్కి చెప్పారు. ఇందులో అవతార్లు ఉపయోగించినా సంగీతం, సాహిత్యం, స్వరాలు రియలిస్టిక్‌గా ఉంటాయన్నారు. ఏఐ మ్యూజిక్ ప్రోడక్షన్‌ను వేగవంతం చేస్తుందని చెప్పారు. ఇటీవల యూఎస్‌లో రెహమాన్ ఓపెన్ ఎఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్, పెర్‌ప్లెక్సిటీకి చెందిన అరవింద్ శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. ఈ వినూత్న ప్రాజెక్టుకు సారథ్యం వహిస్తున్న రేడియంట్ సోల్స్ అనే సంస్థ సిలికాన్ వ్యాలీలోని ఏఐ కంపెనీలతో భాగస్వామ్యం కలిగి ఉంది.


# మారిపోతున్న మనీ రూల్స్..

- అంతా ఒక్క రోజులోనే..



సెప్టెంబర్ నెల ముగియబోతోంది.. అక్టోబర్ నెలప్రారంభం కాబోతోంది. అక్టోబర్ 1నుండి అనేక ప్రధాన మార్పులు కూడా అమల్లోకి రానున్నాయి. వీటిలో పెన్షన్ల నుంచి రైల్వే బుకింగ్స్ వరకు ఉన్నాయి. ముఖ్యమైనకొత్తమార్పులు ఏంటి, అవిఎలాంటిప్రభావం చూపుతాయన్నదిఈ ?కథనంలోచూద్దాం.. అక్టోబర్ 1నుండి నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో పెద్ద మార్పు రానుంది. మల్టిపుల్ స్కీమ్ ఫ్రేమ్ వర్క్ (ఎంఎస్ఎఫ్) కింద ప్రభుత్వేతర రంగ చందాదారులు ఈక్విటీలలో 100 శాతం వరకు పెట్టుబడులు పెట్టడానికి అనుమతిస్తారు. అంటే అక్టోబర్ 1 నుండి, ప్రభుత్వేతర ఎన్పీఎస్ చందాదారులు తమ పెన్షన్ మొత్తాన్ని స్టాక్ మార్కెట్-లింక్డ్ పథకాలలో పెట్టుబడి పెట్టగలరు. గతంలో ఈక్విటీ పెట్టుబడి పరిమితి 75 శాతంగా ఉండేది. అదేవిధంగా, ప్రైవేట్ రంగ ఉద్యోగులు ప్రభుత్వ రంగం మాదిరిగానే ప్రాణ్ (శాశ్వత పదవీ విరమణ ఖాతా సంఖ్య) తెరవడానికి ఈ-ప్రాన్ కిట్ కోసం రూ .18, భౌతిక ప్రాన్ కార్డుకు రూ .40 రుసుము చెల్లించాల్సిఉంటుంది. ఇదికాకఒక్కో ఖాతాకు రూ.100 వార్షిక నిర్వహణ ఛార్జీ కూడాఉంటుంది. అటల్ పెన్షన్ యోజన (ఏపీవై), ఎన్పీఎస్ లైట్ చందాదారులకు ప్రాన్ ఓపెనింగ్, మెయింటెనెన్స్ ఛార్జీలు రూ .15 కాగా, లావాదేవీ రుసుము ఉండదు. అక్టోబర్ 1నుండి అమలులోకి వచ్చే మరో ప్రధాన మార్పు రైల్వేలకు సంబంధించినది. దీని కింద ఆధార్ వెరిఫికేషన్ ఉన్నవారు మాత్రమే రిజర్వేషన్ ప్రారంభమైన మొదటి 15 నిమిషాల్లో టికెట్లను బుక్ చేసుకోగలరు. అయితే, కంప్యూటరైజ్డ్ పీఆర్ఎస్ కౌంటర్ల నుండి టికెట్లు బుక్ చేసుకునే వారికి సమయం లేదా ప్రక్రియలో ఎటువంటి మార్పు ఉండదు.

ఇంకా, అధీకృత రైల్వే ఏజెంట్లు రిజర్వేషన్ ప్రారంభమైన మొదటి 10 నిమిషాలూటిక్కెట్లను బుక్ చేయలేరు. మోసపూరిత లావాదేవీలను నిరోధించడానికి, ప్రయోజనాలు సరైన వినియోగదారులకు చేరేలా చూసే ఉద్దేశంతోఈమార్పులనురైల్వేశాఖఅమలుచేస్తోంది. అక్టోబర్ 1నఎల్పీజీ సిలిండర్ ధరల్లోనూ మార్పు రానుంది. ప్రతినెలా 1వతేదీనచమురు మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల కమర్షియల్గ్యాస్ సిలిండర్ల ధరలను సవరిస్తుంటాయి. దీంతోపాటు ఏటీఎఫ్, సీఎన్జీ, పీఎన్జీ ధరలు కూడా మారవచ్చు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్‌లో ప్రధాన మార్పులు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఎన్పీసీఐ అమలు చేస్తున్న ఈ కొత్త మార్పులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యూజర్లపై ప్రభావం చూపుతాయి. అత్యంత విస్తృతంగా ఉపయోగించే యూపీఐ ఫీచర్లలో ఒకటైన పీర్-టు-పీర్ (పి2పి) లావాదేవీలను ఎన్పీసీఐ తొలగించవచ్చు. వినియోగదారుల భద్రతను బలోపేతం చేయడానికి, ఆర్థిక మోసాన్ని నివారించడానికి, జూలై 29 నాటి సర్క్యులర్ ప్రకారం, అక్టోబర్ 1నుండి యూపీఐ యాప్ల నుండి ఈ ఫీచర్ తొలగించనున్నాయి.




## దూసుకెళ్తున్న అరట్టై..

### 3 రోజుల్లో 3 వేల నుంచి 3.5 లక్షలకు!

**చెన్నై:**క్లౌడ్ ఆధారిత సర్వీసులు అందించే స్వదేశీ ప్లాట్‌ఫాం జోహో తీసుకొచ్చిన మెసేజింగ్ యాప్ 'అరట్టై' డౌన్‌లోడ్స్‌లో దూసుకెళ్తోంది. కేవలం మూడు రోజుల్లోనే రోజువారీ సైన్‌అప్స్ 3 వేల నుంచి 3.5 లక్షలకు పెరిగాయి. ఈమేరకు జోహో వ్యవస్థాపకులు శ్రీధర్ వెంబు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మూడు రోజుల్లో వంద రెట్ల వృద్ధి సాధించిందన్నారు. కొందరు దీన్ని 'వాట్సప్ కిల్లర్'గా పేర్కొంటున్నారు. ఈ యాప్ గురించి 5 ముఖ్యమైన విషయాలు ఇప్పుడు చూద్దాం. అరట్టై అంటే తమిళంలో మాట్లాడుకోవడం. ఈ యాప్‌ను జోహో కార్పొరేషన్ 2021లోనే లాంచ్ చేసింది. అయితే ప్రస్తు తం దీనికి మంచి ఆదరణ లభిస్తోంది. వన్-టు-వన్, గ్రూప్ చాట్స్, వాయిస్ నోట్స్, ఫొటో/వీడియో షేరింగ్, స్టోరీస్, బ్రాడ్‌కాస్ట్ ఛానల్స్ వంటి సదుపాయాలు ఉన్నాయి.



## 'రూ.45 లక్షల వేతనం.. అందుకే వదిలేసా'

**న్యూఢిల్లీ:**కొంతమంది ఎక్కువ జీతం కోసం పనిచేస్తే.. మరికొందరు ఉన్న జీతంతోనే సర్దు కుంటారు. గురుగ్రామ్‌కు చెందిన ఒక టెక్నీషియన్ ఇటీవల రెడ్డిట్‌లో చేసిన పోస్ట్..జీతం కంటే పని - జీవిత సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వడం గురించి చర్చకు దారితీసింది. నాకు రెండు ఆఫర్లు వచ్చాయి, ఒకటి ఏడాదికి 38 లక్షల ప్యాకేజీ. మరొకటి సంవత్సరానికి 45 లక్షల ప్యాకేజీతో భారతదేశంలోని అగ్రశ్రేణి ఓటీటీ ప్లాట్‌ఫామ్ నుంచి అని వినియోగదారు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. అయితే నేను నా ప్రస్తుత స్థానం గుర్గావ్ నుంచి బెంగళూరుకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ (బెంగళూరులో) పని ఒత్తిడి ఎక్కువగా ఉంది. దీంతో నేను ఆ ఉద్యోగాన్ని వదులుకున్నాను. కానీ ఇప్పుడు తప్పు చేశానేమో అనే భావన గలుగుతోంది. నేను డబ్బును ఎంచుకోవాలా లేదా స్థిరత్వాన్ని ఎంచుకో వాలా? అని అన్నారు.రెడ్డిట్ తూజార్ తన కెరీర్ గురించి కూడా వెల్లడించారు. తాను ప్రారం భంలో రూ. 3.8 లక్షల ప్యాకేజితో ఉద్యోగంలో చేరినట్లు, ఆ తరువాత మూడు ఉద్యోగాలు మార్చిన ట్లు, దీని ఫలితంగా తన ప్రస్తుత వార్షిక జీతం పెరిగిందని పేర్కొన్నారు.ఈ పోస్టుపై నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తున్నారు. ఎక్కువ మంది.. టెక్నీషియన్ ఉద్యోగాన్ని వదులుకోవడం గురించి చింతించవద్దని.. మానసిక శ్రేయస్సుపై దృష్టి పెట్టాలని చెప్పారు. సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి డబ్బు సంపాదించాలని ఇంకొకరు అన్నారు. మీ జీతం పెరిగిన తరువాత.. పని సంస్కృతి మీ కంపెనీ మిమ్మల్ని ఎలా చూస్తుందనే విషయాన్ని గమనించాలని ఇంకొకరు అన్నారు.

## మరో పావు శాతం రేట్ల

# కోత ఉంటుందా?

- మరో పావు శాతం రేట్ల కోత ఉంటుందా?
- ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా..



**ముంబై:**రుణ గ్రహీతలకు మరింత ఊరటనిచ్చేలా.. రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పాలసీ వడ్డీరేట్లను మరో పావు శాతం తగ్గించే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్ట్ అంచనా వేసింది.ప్రస్తుతానికి ఆర్‌బీఐకి ఇదే సరైన ఆప్షన్ అని పేర్కొంది. అయితే, మరికొంత మంది ఆర్థిక నిపుణులు మాత్రం పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ఈ సారి కూడా రేట్లను యథాతథంగా కొనసాగించవచ్చని అభిప్రాయపడ్డారు. ఆర్‌బీఐ ఎంపీసీ మూడు రోజుల సమావేశం నేటి నుంచి ప్రారంభమవుతోంది. అక్టోబర్ 1న (బుధవారం) పాలసీ నిర్ణయం వెలువడుతుంది. ఒకపక్క భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మరో పక్క, భారత్ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించిన నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా పాలసీ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది.ఆర్‌బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ నెల ఫిబ్రవరిలో జరిగిన తొలి ఎంపీసీ భేటీలోనే దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత రెపో రేటును పావు శాతం తగ్గించారు. ఆ తర్వాత ఏప్రిల్లో పావు శాతం మళ్లీ జూన్‌లో ఏకంగా అర శాతం తగ్గింపుతో ఇప్పటిదాకా 1 శాతం రెపో రేటు దిగొచ్చింది. ప్రస్తుతం 5.5 శాతంగా కొనసాగుతోంది. ఆర్‌బీఐ చర్యల నేపథ్యంలో బ్యాంకులు కూడా రేట్ల కోత ప్రయోజనాన్ని రుణ గ్రహీతలకు బదలాయించాయి. దీంతో రుణాలపై వడ్డీ రేట్లు కాస్త దిగొచ్చాయి. అయితే, అమెరికా సుంకాల మోత, ఇతర భౌగోళిక రాజీకయ పరిణామాల ప్రభావవంతో ఆగస్టు పాలసీ సమావేశంలో ఆర్‌బీఐ రేట్లను యథాతథంగా కొనసాగించింది.ప్రస్తుతం ధరలు పూర్తిగా అదుపులో ఉండటంతో పాటు వచ్చే ఏడాది కూడా రిటైల్ ద్రవ్యల్బణం కట్టడిలోనే ఉండొచ్చని, ఈ నేపథ్యంలో తాజా పాలసీ సమీక్షలో మరో పావు శాతం రెపో కోతకు ఆస్కారం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతంగా, టోకు ధరల ద్రవ్యోల్బణం 0.52 శాతం నమోదైన సంగతి తెలిసిందే. 'రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ టార్గెట్ 4 శాతంగానే (2 శాతం అటు ఇటుగా) ఉంది. జీఎస్‌టీ 2.0కి ముందు, ఆ తర్వాతా ఇదే పరిస్థితి. మరోపక్క, వృద్ధి రేటు స్థిరంగా 6.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నప్పటికీ, టారిఫ్‌ల ప్రభావంతో తగ్గే అవకాశం లేకపోలేదు. ఈ తరుణంలో ప్రస్తుతం యథాతథ స్థితికే చాన్సుంది. మార్కెట్ వర్గాలు మాత్రం మరో పావు శాతం కోతను ఆశిస్తున్నాయి' అని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవీస్ అభిప్రాయపడ్డారు.'జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రభావంతో రిటైల్ ద్రవ్యోల్బణం రానున్న నాలుగు త్రైమాసికాల్లో పావు శాతం నుంచి అర శాతం దిగిరావచ్చు. జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ వల్ల డిమాండ్ భారీగా పుంజుకోనుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఈసారి ఆర్‌బీఐ పాలసీ రేట్లలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు' అని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా చీఫ్ ఎకనమిస్ట్ అదితి నాయర్ చెప్పారు. అయితే, జీఎస్‌టీ రేట్ల మార్పు, ద్రవ్యోల్బణం అంచనాల కంటే దిగువనే కొనసాగుతుండటంతో పావు శాతం రెపో కోతను అంచనా వేస్తున్నట్లు క్రిసిల్ చీఫ్ ఎకనమిస్ట్ ధర్మకృతి జోషి పేర్కొన్నారు.

## చైనా కోసం గాడిదలు పెంచుతున్న పాకిస్థాన్..

**ఇస్లామాబాద్:**
తీవ్రఆర్థికసమస్యలుఎదుర్కొంటున్న పాకిస్థాన్సరికొత్త వ్యాపార అవకాశాలపైదృష్టిపెట్టింది. చైనా కోసం గాడిదలను పెంచుతోంది. ఇందు కోసం చైనా కంపెనీ జింగ్యింగ్ పెట్టుబడులతో పెషావర్‌లో 37 మిలియన్ డాలర్లతో భారీ ప్రాజెకు ్టను రూపొందించింది. ఇందులో భాగంగాఏటా 80 వేల గాడిదలను చైనాకు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకుంది.చైనాలో గాడిద మాంసానికి, ఎముకలకు మంచి డిమాండ్ ఉంటుంది.ఈ నేపథ్యంలో నెలకు 10 వేల గాడిదలను ప్రాసెస్ చేసి, మాంసం ఎగుమతులు చేయా లని నిర్ణయించినట్లు ఆహార భద్రత మంత్రిత్వ శాఖ వెల్ల డించింది. అయితేస్థానికంగా మా త్రంగాడిద మాంసం అమ్మకాల పైనిషేధంఉం టుందట.చైనాకు గాడిద మాంసాన్ని ఎగుమతి చేసేం దుకు పెషావర్ వ్యవసాయ విశ్వవి ద్యాలయంలో గాడిదల పెంపకానికి ఆధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేసి నట్లు సమాచారం. అలాగే వివిధ ప్రాంతాలలో 40 ప్రత్యేక పొలాలను కూడాఏర్పాటు చేసినట్లుతెలుస్తోంది.

## యురేనియం అన్వేషణకు ఎన్‌టీపీసీ ఒప్పందం



**న్యూఢిల్లీ:**ప్రభుత్వ యాజమాన్యం లోని ఎన్‌టీపీసీ విదేశాల్లో యురేనియం గనులను గుర్తించడానికి కన్సల్టెంట్‌ను నియమించుకోవాలని యోచిస్తోంది. దీని ద్వారా తన భవిష్యత్ అణు ప్రాజెక్టుల కోసం యురేనియం వనరులను స్థిరీకరించుకోవడానికి ముందుకు సాగుతోంది. ఈమేరకు యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంలో నియమించుకునే కన్సల్టెంట్ సంభావ్య ప్రదేశాలపై సలహా ఇస్తారు. యురేనియం నిల్వలపై మార్గనిర్దేశం చేయడానికి రిజర్వ్ పరిమాణాలు, లాజిస్టిక్స్ ఖర్చులు వంటి అంశాలను అంచనా వేస్తారు. ప్రస్తుతం ఎన్‌టీపీసీ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)తో జాయింట్ వెంచర్ ద్వారా రాజస్థాన్‌లో రూ.42,000 కోట్ల అణు ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఎన్‌టీపీసీకి 49% వాటా, ఎన్‌పీసీఐఎల్ 51% వాటా కలిగి ఉంది.ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ 4700 మెగావాట్ల మహి బన్స్‌వారా రాజస్థాన్ అణు విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. దీన్ని అణుశక్తి విద్యుత్ నిగమ్ లిమిటెడ్ (అశ్విని)తో కలిసి అభివృద్ధి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గుర్దీప్ సింగ్ మాట్లాడుతూ వివిధ అణు సాంకేతిక ప్రొవై డర్లు, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి అదనపు అణు ప్రాజెక్టులను స్వతంత్రంగా ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఈ విభాగంలో కంపెనీ తన ఉనికిని విస్తరించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## చైనా మాజీ మంత్రికి మరణశిక్ష రద్దు

- రెండేళ్ల జైలు



**బీజింగ్:** లంచం తీసుకున్నారనే ఆరోపణలపై మరణశిక్ష ఎదుర్కొంటున్న చైనా అధికార కమ్యూనిస్ట్ పార్టీ నేత, మాజీ వ్యవసాయ, గ్రామీణ వ్యవహారాల శాఖ మంత్రి టంగ్ రెంజియన్‌కు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది.2007-2024 వివిధ హోదాల్లో పనిచేసి, అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించింది. సుమారు రూ.336 కోట్ల మేర లంచాలు తీసుకున్నారని తెలిపింది.అయితే, తన ఆస్తులతోపాటు, అక్రమంగా సంపాదించిన సొత్తును సైతం ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించారని, విచారణకు పూర్తిస్థాయిలో సహకరించారని కోర్టు తెలిపింది. పశ్చాత్తాపం వ్యక్తం చేసినందున ఆయనకు మరణ శిక్షను రద్దు చేస్తూ రెండేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు పేర్కొంది. జిలిన్ ప్రావిన్స్‌లోని చంగ్‌చున్ పీపుల్స్ కోర్ట్ ఆదివారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. 2012లో జిన్‌పింగ్ అధికార పగ్గాలు చేపట్టాక అవినీతి ఆరోపణలునన కనీసం 10 లక్షల మంది అధికారులకు శిక్షలుపడ్డాయి. వీరిలో కమ్యూనిస్ట్ పార్టీ అగ్ర నేతలు సైతం పదుల సంఖ్యలో ఉన్నారు.

# బంగ్లాదేశ్‌లో ఆకృత్యం

### గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం

### నిరసనల్లో ముగ్గురు మృతి



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ఒక బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం తీవ్ర నిరసనలకు దారి తీసింది. గిరిజన పాఠశాలకు చెందిన ఒక విద్యార్థినిపై జరిగిన అత్యాచారానికి వ్యతిరేకంగా జమ్మ స్టూడెంట్స్ బృందం నిరసన ప్రదర్శన నిర్వహించింది.ఈ నేపథ్యంలో ఆదివాసీ గిరిజనులకు, ఇక్కడ స్థిరపడిన బెంగాలీవారికి మధ్య అల్లర్లు చోటుచేసుకున్నాయి. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించినప్పటికీ ఘర్షణలు కొనసాగి, ముగ్గురు మరణించారు. పలువురు గాయపడ్డారు.భారత్-మయన్మార్ సరిహద్దుల్లోని చిట్టగాంగ్ కొండ ప్రాంతాల్లోని ఖగ్రాచారీ జిల్లాలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన దరిమిలా ఘర్షణలు చోటుచేసుకున్నాయి.ఈ హింసాకాండలో 13 మంది సైనిక సిబ్బంది, ముగ్గురు పోలీసులు గాయపడ్డారని ఢాకాలోని హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఖగ్రాచారీ జిల్లా కేంద్రంలో తొలుత హింస చెలరేగింది. అక్కడి చక్మా, మర్మ అనే ఆదివాసీ తెగలకు చెందినవారు శనివారం టైర్లు కాల్చివేస్తూ, చెట్ల కొమ్మలు, ఇటుకలను అడ్డుగా పెట్టి రోడ్డు దిగ్బంధనం చేశారు. దీంతో పోలీసు అధికారులు అప్రమత్తమై పరిస్థితిని పర్యవేక్షించారు. పోలీసులతో పాటు సైనిక, పారామిలిటరీ బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ)దళాలు గస్తీ నిర్వహించాయి. అయినప్పటికీ హింస చెలరేగింది.బాధిత బాలిక ట్యూషన్ నుండి తిరిగి వస్తుండగా ఆమెపై సామూహిక అత్యాచారం జరిగింది. అర్ధరాత్రి సమయంలో ఒక నిర్మానుష్య ప్రదేశంలో అపస్మారక స్థితిలో పడివున్న బాలికను కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే ఆమెకు స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఒక బెంగాలీ యువకుడిని అరెస్టు చేశారు. అతను అత్యాచారం చేసిన వారిలో ఒకడని పోలీసులు అనుమానిస్తున్నారు. కోర్టు ఆదేశాలతో పోలీసులు ఆ యువకుడిని విచారిస్తున్నారు. కాగా గుయిమారాలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతిచెందారని, వారి మృతదేహాలను ఖగ్రాచారీ ఆస్పత్రిలో ఉంచారని పోలీసు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అహ్సాన్ హబీబ్ విలేకరులకు తెలిపారు.

## లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఇకపై ఉగ్రసంస్థ

### ప్రకటించిన కెనడా



**ఒట్టావా(జనంసాక్షి):**
భారత్‌తోపాటు విదేశాల్లో హత్యలు, దోపిడీలు, ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కార్యకలాపాలతో సంబంధం ఉన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా కెనడా ప్రకటించింది. అతడిని, అతడి ముఠాను దేశ క్రిమినల్ కోడ్ ప్రకారం.. ఉగ్రవాద సం స్థగా ప్రకటించినట్లు కెనడా ప్రజా భద్రతా మంత్రి గ్యారీ ఆనందసంగరీ ప్రకటించారు. దీంతో దేశంలోని బిష్ణోయ్ ముఠాకు సంబంధించిన ఆస్తులు, నగదు, వాహనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు లేదా స్తంభింపజేయవచ్చు. ఆ ముఠా సభ్యుల నేరాలపై విచారణ జరపడానికి కెనడియన్ చట్ట సంస్థలకు మరిన్ని అధికారాలు కూడా లభిస్తాయి. అనుమానిత ముఠా సభ్యులను దేశంలోకి ప్రవేశించకుండా ఇమిగ్రేషన్ అధికారులు నిరోధించవచ్చు. ఈ చర్య భారత్-కెనడాల మధ్య మెరుగవుతున్న సంబంధాలకు సూచన అంటూ పలువురు పేర్కొంటున్నారు. కెనడా లో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఆగడాలు పెరుగుతుండడంపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కోరుతూ మార్క్ కార్నీ ప్రభుత్వానికి కన్జర్వేటివ్ పార్టీ ఇటీవల లేఖ రాసింది. బిష్ణోయ్ గ్యాంగ్ నేర సామ్రాజ్యం విస్తరిస్తోందని, కెనడా పౌరులను దోచుకోవడం, హత్య కేసుల్లో వీరి పాత్ర ఉందని కెనడా ఎంపీ ఫ్రాంక్ కాపుటో తన లేఖలో ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే బిష్టోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రభుత్వం తాజాగా ప్రకటించింది.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
30 సెప్టెంబర్ 2025
తెలంగాణ

# దసరా పండుగను అక్టోబర్ 3వ తేదికి మార్చాలి

## అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన ఏఐటీయూసీ



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణిలో దసరా పండుగ సెలవును అక్టోబర్ 2కు బదులుగా 3వ తేదీకి మార్చాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆర్జీ.వన్ బ్రాంచి ఆధ్వర్యంలో గనులు, డిపార్ట్మెంట్స్, ఓసిపి-5 లలో అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)ఆర్జీ.వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. సోమవారం జిడికె.2వ ఇంక్లయిన్, ఏరియా హాస్పిటల్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే దసరా పండుగ జాతిపిత మహాత్ముడైన గాంధీ జయంతి అక్టోబర్ 2న రావడం దసరా పండుగను అత్యంత వైభవంగా సింగరేణి ఉద్యోగులు జరుపుకొనుటకు ఇబ్బందిగా మారిందని వారు పేర్కొన్నారు. పండుగ రోజున గనుల పైన మేకలతో మైసమ్మ పూజలు చేస్తూ సంవత్సర కాలమంతా నిర్దేశిత లక్ష్యసాధనలో మాకు ఎటువంటి ప్రమాదములు జరగరాదని భావోద్వేగంతో, భక్తి పారవశ్యంతో అమ్మవారిని కోరుకుంటారని వారు తెలిపారు.ఆ సందర్భంగా అమ్మవారి మొక్కు తీర్చునప్పుడు మద్యం ప్రధాన భూమిక పోషిస్తుందని, పూజకు సంబంధించిన అవసరమైన ప్రధాన వనరులు అక్టోబరు రెండు తారీకున మహాత్మాగాంధీ జయంతి కారణంగా నిషేధించ బడినవని వారు తెలిపారు. అందువల్ల ఉద్యోగుల కోరికను మన్నించి యాజమాన్యం సహృదయంతో ఆలోచించి కార్మికుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని అక్టోబర్ 2 తారీఖున వచ్చిన దసరా పండుగను అక్టోబర్ 3వ తారీకుకు మార్చాలని సింగరేణి లో కార్మిక వర్గం కోరుతున్నారని వారు తెలిపారు.ఈ విషయంలో సింగరేణియులందరూ కూడా యాజమాన్యానికి ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా లేదా వారికి అవకాశం ఉన్న అన్ని సందర్భాలలో దసరా పండుగ తేదిని మార్చాలని యాజమాన్యం దృష్టికి తీసుకరావడం జరిగిందని వారు పేర్కొన్నారు.

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి గుర్తింపు సంఘంగా ఇదివరకే ఉద్యోగుల మనోభావాలను, భక్తి పారవశ్యాలను దృష్టిలో పెట్టుకొని యాజమాన్యం కు లిఖిత పూర్వకంగా తెలియజేయడం జరిగిందని, దసరా సమీపిస్తున్న వేళ మరొకసారి ఉద్యోగుల మనోభావాలను దసరా పై ఉద్యోగులకు ఉన్న మక్కువను యాజమాన్యం దృష్టికి మరొకసారి విజ్ఞాపన పత్రాల ద్వారా అన్ని గనులు, డిపార్ట్మెంట్ల ఉద్యోగుల ద్వారా పంపిస్తున్నామని వారు తెలిపారు.ఈ సంవత్సరం కూడా నిర్దేశిత లక్ష్యాలను సాధించుటకు ఉద్యోగులందరూ కంకణబద్ధులై ఉన్నారని,ఇప్పటికే కోల్ ఇండియాలో వివిధ రాష్ట్రాలలో ఉన్న బొగ్గు సంస్థలు దసరా తేదీని మార్చుతూ నిర్ణయం తీసుకున్నారని వారు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, బోగ సతీష్‌బాబు,గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్,ఉప్పులేటి తిరుపతి, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, అజీంపాషా, ఎరవెల్లి రాజయ్య, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి, నాయిని శంకర్, గొడిశల నరేశ్, బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.





### రెనే హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో

# ఉచిత గుండె వ్యాధి శిబిరం విజయవంతం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):**
ప్రపంచ గుండె దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ రెనే హాస్పిటల్ గుండె వ్యాధుల విభాగం వారి ఆధ్వర్యంలో సోమవారం రోజున ఉచిత గుండె వైద్య శిబిరం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో నిర్వహించడం జరిగింది. ఇట్టి శిబిరానికి ప్రజల నుండి అనూహ్యస్పందన లభించింది. గుండె జబ్బులతో ఇబ్బంది పడుతున్న సుమారు 250 మంది పెద్దలు, పిల్లలు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దినకర్ తాటిమట్ల, రోబోటిక్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ సిరిపురపు రవికుమార్, చిన్న పిల్లల గుండె వైద్యులు డాక్టర్ రాజా విజేందర్ రెడ్డి లు ఈ శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సంబంధిత పరీక్షలు నిర్వహించి, గుండె జబ్బులు రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించగా, ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ జి. వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీనలు విశిష్ట అతిథులుగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామికి ధన్యవాదాలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న రెనే హాస్పిటల్ గుండె వైద్యులను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ... ఇలాంటి ఒక మంచి సేవా కార్యక్రమం నిర్వహించడానికి అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి, కరీంనగర్ జిల్లా సివిల్ హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ జి వీరారెడ్డికి, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణకి ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తు లో ప్రభుత్వం చేసే ఇలాంటి వైద్య సేవా కార్యక్రమాల్లో తప్పకుండా రెనే వైద్య సంస్థలు తమవంతు సహకారం అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రెనే హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రవీంద్ర చారి, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, మార్కెటింగ్ మేనేజర్ అభిలాష్ రెడ్డి, శాతవాహన లయన్స్ క్లబ్ నాయకులు కెప్టెన్ డా.బుర్ర మధుసూదన్ రెడ్డి, ఇనుగుర్తి రమేష్, వడకపురం జగదీశ్వరా చారి, తిరుపతి రెడ్డి, టిఎస్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందుపట్ల రాజిరెడ్డిలతో పాటు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎడపల్లిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల సందర్శన
- ఎంపీడీవో గైర్హాజరుపై కలెక్టర్ ఆగ్రహం



**నిజామాబాద్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) :**
ఎడపల్లి మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అయితే ఎంపీడీవో శంకర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎన్నికల నిర్వహణ ఏ విధంగా చేస్తారో అని ప్రశ్నించారు. ఎంపీడీవో శంకర్ మధ్యాహ్నమే వెళ్ళిపోయారనే సమాచారం మేరకే కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారనే ప్రచారం జోరుగా సాగుతుంది. కాగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను చేపడుతున్న తీరును పరిశీలించి సూచనలు చేశారు. గడువు లోపు ఎస్.ఐ.ఆర్ పూర్తి చేయాలని అన్నారు. అంత కుముందు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతి గురించి ఆరా తీశారు. లబ్దిదారులు అందరూ నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. చేసుకునేలా చూడాలన్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ దత్తాత్రి, స్థానిక అధికారులు ఉన్నారు.

## సుధా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం

**హయత్ నగర్, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) :**
హయత్ నగర్ లోని రిజిస్ట్రేషన్ ఆఫీస్ సమీపంలో సుధా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నూతన 8 వ బ్రాంచ్ ను హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి, చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల లో ఉన్నటువంటి యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, లాకర్ సౌకర్యం మొదలగు సేవలను కల్పించడం జరుగుతుందని బ్యాంకు వారు తెలిపారు. హయత్ నగర్‌లోని పరిసర కాలనీవాసులు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోగలరని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో బ్రాంచ్ మేనేజర్ చెరకు రవి కుమార్, బ్యాంకు సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- అధికారుల పాత్ర కీలకం, పొరపాట్లకు ఆస్కారం ఇవ్వద్దు
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ లోకల్ బాడీ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.సోమవారం రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని ఎన్నికల షెడ్యూల్ వివరాలను ప్రకటించడంతో కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, ఆర్డీవోలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ మూడు విడతల్లో గ్రామపంచాయతీ (సర్పంచ్ వార్డు సభ్యులు) ఎన్నికలు మొత్తం ఐదు విడతల్లో నిర్వహించనున్నారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నవంబర్ 11 వరకు పూర్తి కానుందని వివరించారు. ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో జిల్లాలో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని తెలిపారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత నామినేషన్ పత్రాల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశంపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే ఎన్నికలకు సంబందించిన శిక్షణ సిబ్బందికి ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్ఓ బి. వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, డీపీఓ జగదీష్, జడ్పీ డిప్యూటీ సీఈవో పవన్, కలెక్టరేట్ ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## తుక్కుగూడలో ఫైవ్ ఎలిమెంట్స్ ఇన్‌ఫ్రా 'ఆల్టిలియా' విల్లా ప్రాజెక్ట్ ఆవిష్కరణ

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) :**
ఫైవ్ ఎలిమెంట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, దక్షిణ హైదరాబాద్‌లో వేగంగా ఎదుగుతున్న తుక్కుగూడలో 'ఆల్టిలియా' పేరుతో అత్యాధునిక ప్రీమియం విల్లా కమ్యూనిటీని ఆవిష్కరించినట్లు ఫైవ్ ఎలి మెంట్స్ ఇన్‌ఫ్రా కో-ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ కోటి రెడ్డి భవనం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7.8 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో 70 వాస్తు సరిగా అమర్చిన 4 బిహెచ్‌కే విల్లాలు నిర్మిం చ బడుతున్నాయని అన్నారు. లగ్జరీ, పచ్చదనం, ప్రకృతి సమతుల్యంను సమన్వయం చేస్తూ ఈ విల్లాలను రూపకల్పన చేశామన్నారు. హెచ్ఎండీ ఏ, రేరా అనుమతులు పొందిన ఈ ప్రాజెక్ట్ పారదర్శకత, నాణ్యత, విశ్వసనీయత లో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ప్రారంభోత్సవానికి జాగిల్ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాజ్ పి.నారాయణం హాజరై మాట్లాడుతూ దక్షిణ హైదరాబాద్‌లో ఆల్టి లియా ప్రీమియం లివింగ్‌కి కొత్త ప్రమాణం సృష్టిస్తోందన్నారు. లగ్జరీ, ప్రకృతి సమతుల్యం, కమ్యూ నిటీ లైఫ్‌ను సమన్వయం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్ర కనీస వేతనాల సవరణపై కార్మిక శాఖ ఐఎల్ఓ సమావేశం

- తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్



**గోదావరిఖని, జనంసాక్షి :**
హైదరాబాద్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) సంయుక్తంగా ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ బి.జనక్‌ప్రసాద్ అధ్యక్షత వహించగా.. అదనపు కార్మిక కమిషనర్ గంగాధర్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో నెదర్లాం డ్స్ ప్రభుత్వం విదేశాంగ మంత్రిత్వ శాఖ సీనియర్ పాలసీ సలహాదారు చార్లెట్ బెర్నార్డ్, ఐఎల్ఓ డైరెక్టర్ మిచికో మియమోటో సమక్షంలో తెలంగాణలో జరుగుతున్న కనీస వేతనాల సవరణ ప్రక్రియపై విస్తృతంగా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటున్న పారామితులు, అంశాలను అధికారులు వివరించారు.ఈ సందర్భంగా చైర్మన్ జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక సంక్షేమం, సామాజిక న్యాయాన్ని అగ్రస్థానంలో ఉంచింద ని పేర్కొన్నారు. కనీస వేతనాల రూపకల్పన దాదాపు పూర్తయిందని, త్వరలో అధికారిక గేజిట్ నోటిఫికేషన్ వెలువడనున్నదని తెలిపారు.తెలంగాణ మోడల్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఐఎల్ఓ ప్రతినిధులు రంజిత్ ప్రకాష్, అనుప్‌సత్పతి చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు. ప్రముఖ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మీలా జయదేవ్, ప్రొఫెసర్ రవి, ప్రొఫెసర్ వసంతి, ట్రేడ్ యూనియన్ నేత ఆర్.డి. చంద్రశేఖర్, బోర్డు కార్యదర్శి శ్యామ్‌సుందర్ జాజు తదితరులు తమ అభిప్రాయాలు తెలియజేశారు.కనీస వేతనాలను జీవన వేతనాలతో అనుసంధానం చేయడం,అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణ కార్మికుల హక్కులను బలోపేతం చేయడం ముఖ్యమని వారు పునరుద్ఘాటించారు. సమావేశం సానుకూల వాతావరణంలో ముగియగా, తెలంగాణ రాష్ట్రం తీసుకుంటున్న ఈ చర్యలు కార్మికుల హక్కులను మరింత బలోపేతం చేసి, ఉత్పాదకతను పెంచి, దేశవ్యాప్తంగా ఒక ప్రగతిశీల మాదిరిగా నిలుస్తాయని అందరూ విశ్వాసం వ్యక్తం చేశారు.

# అధికారుల నిర్లక్ష్యం... ఓ నిండు ప్రాణం బలి

## కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్ సెప్టెంబర్ 29 (జనం సాక్షి) :**
హయత్‌నగర్ డివిజన్‌లోని కమర్షియల్ టాక్స్ కాలనీ వాసులు భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ అవుట్‌లేనందు వల్ల కాలనీ వాసులు నిర్మించుకున్నా, సెప్టిక్ ట్యాంక్‌లో పడి సురుకంటి అశోక్‌రెడ్డి మరణించడం జరిగిందని సమాచారం రావడంతో హుటాహుటిన ఘటన స్థలాన్ని స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, పోలీస్ శాఖ, జలమండలి, డిఆర్ఎఫ్ అధికారులకు సమాచారాన్ని ఇచ్చి సెప్టిక్ ట్యాంక్‌లో ఉన్నటువంటి అశోక్ రెడ్డి మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కేవలం జలమండలి అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈరోజు ఒక నిండు ప్రాణం బలైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా వారి ఇంట్లో ఉన్నటువంటి ఆడబిడ్డలకు బతుకమ్మ పువ్వులను తీసుకువస్తానని చెప్పి శవంగా వచ్చాడని వారు అన్నారు. జలమండలి అధికారుల నిర్లక్ష్యం వల్ల మనమందరం ఒక నిండు ప్రాణాన్ని కోల్పోవడం జరిగిందని వారు పేర్కొన్నారు.

నేను కార్పొరేటర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా హయత్ నగర్ డివిజన్లోని కమర్షియల్ టాక్స్ కాలనీలో భూగర్భ డ్రైనేజ్ అవుట్ లైన్ పైప్ లైన్ నిర్మాణం కోసం అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్న ఇప్పటికి కూడా అవుట్ లెట్ పైప్ లైన్ నిర్మాణం చేపట్టకపోవడం వలన ఓ నిండు ప్రాణం బలైందని అన్నారు. ఈ ఘటనకి సంబంధించి పూర్తి బాధ్యత జలమండలి అధికారులే వహించాలని వారు తెలిపారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ నుండి మేనేజర్ వరకు ఇట్టి సమస్యపై ఎన్నోసార్లు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, కానీ అధికారులు సమస్యల పట్ల సరైన సమయంలో స్పందించకపోవడం వలన అమాయక ప్రజలు ఇలా భూగర్భ డ్రైనేజ్, వరద నీటి కాలువల్లో పడి మరణించడం జరుగుతుందని వారు తెలుపుతూ, అధికారులు ఇప్పటికైనా ప్రజా సమస్యలపై చురుకుగా ఉంటూ వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు.

# ప్రజావాణికి 40 ఫిర్యాదులు



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 29 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


**పదవీ విరమణ చేస్తున్న ఎస్ఐకు సన్మానం:**
కలెక్టరేట్ లో విధులు నిర్వర్తిస్తూ ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్న పోలీస్ సబ్ ఇన్స్ పెక్టర్ ఏం.డీ.నసీరుద్దీన్ ను ఘనంగా సన్మానించారు. ఆయనను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పూల మాలలు, శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. నసీరుద్దీన్ అందించిన సేవలను కొనియాడారు.

# స్థానిక సంస్థల రిజర్వేషన్లపై పలు పార్టీల నాయకులలో అసంతృప్తి?

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 (జనంసాక్షి) :**
రాష్ట్ర ప్రభుత్వము ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సోమవారం రాష్ట్ర ఎన్నికల అధికారి ఎన్నికలకు పచ్చ జెండా ఊపరు.స్థానిక రిజర్వేషన్లపై వేములవాడ నియోజకవర్గ పరిధిలోని అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల నాయకులు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన క్రమంలో వేములవాడ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశావాహులు ఎవరి పనిలో వారు నిమగ్నమై ఉన్నారు. అదే సమయంలో పార్టీ టికెట్లపై గంపెడు ఆశలతో ఎదురు చూశారు. చివరికి వారికి రిజర్వేషన్లు అనుకూలం గా రాకపోవడంతో నిరాశ చెందిన కొంత మంది సీనియర్ నాయకులు మాత్రం మరో పనిలో బిజీగా ఉన్నట్టు సమాచారం. అధికార పార్టీలో తమకు అనుకూలంగా లేని చోట రిజర్వేషన్లను మార్పు చేయించే ప్రక్రియ కొరకు కోర్టు మెట్లు ఎక్కే ప్రయత్నం చేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు.
ఇందులో ప్రతిపక్ష పార్టీల నాయకుల కంటే అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులే ముందు వరుసలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం వేములవాడలో అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధి ఒకరు కొంతమంది పార్టీ ముఖ్య నాయకులతో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు అత్యంత సన్నిహితులైన మరికొంత మంది వ్యక్తులతో సమావేశం ఏర్పాటు చేసి తన ఆవేదనను వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎలాగైనా ఈ రిజర్వేషన్లను మార్పించాలని చర్చించినట్లు తెలుస్తోంది.జిల్లాలో అన్ని కాకపోయినా కనీసం తాను పోటీ చేయాలనుకున్న స్థానలతో పాటు జడ్పీటీసీ రిజర్వేషన్లను మార్చేల ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో చర్చించుకున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ విప్ రిజర్వేషన్ మార్పులు చేపించకపోతే చివరికి కోర్టు మెట్లు ఎక్కి అయినా సరే తమకు అనుకూలమైన రిజర్వేషన్లను పొందుదామని తోటి నాయకులతో చర్చించినట్లు తెలుస్తోంది. ఈ రహస్య సమావేశం వేములవాడలో తీవ్ర చర్చనీయాంశమైంది. మరోవైపు నియోజకవర్గ వ్యాప్తంగా ఇతర మండలాల్లో సైతం మరికొంత మంది అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష నాయకులు ఇదే బాటలో వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.రిజర్వేషన్ల మార్పు అంశంపై ఏమి జరుగుతుందో వేచి చూడాలి.

# స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం

- సిరిసిల్ల జిల్లా మొత్తం బిఆర్ఎస్ కైవసం చేసుకుంటాం
- ఎన్నికలకు మా పార్టీ సైన్యం..సిద్ధంగా ఉంది.. నాస్కబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



**గంభీరావుపేట సెప్టెంబర్ 29 (జనం సాక్షి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం రోజు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పాత్రికేల సమావేశం నిర్వహించారు, ముఖ్యఅతిథిగా నాస్కబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు హాజరయ్యారు, ఆయన మాట్లాడుతూ, ముందుగా మండల ప్రజలందరికీ దసరా,, బతుకమ్మ" పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ, రాబోయే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తుందని, వార్డ్ మెంబర్ మొదలుకొని జిల్లా పరిషత్ చైర్మన్ వరకు సిరిసిల్ల జిల్లాలోని మొత్తం బిఆర్ఎస్ కైవసం చేసుకుంటామని తెలిపారు, బిఆర్ఎస్ అధికారంలో ఉన్న లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్నామని, దాన్ని గుర్తించి ప్రజలు మమ్మల్ని ఆదరిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 22 నెలలు అవుతున్న చేసింది ఏమీ లేదని ప్రజలు నమ్మి ఓటు వేస్తే ప్రజలు మోసపోయారని తెలిపారు, కెసిఆర్ కేటీఆర్ తోనే మళ్లీ తెలంగాణ అభివృద్ధి ముందుకు సాగుతుందని, ప్రజలందరూ బిఆర్ఎస్ వైపు చూస్తున్నారని తెలిపారు, మా కార్యకర్తలు మా సైన్యం అండదండలతోని మళ్లీ ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటస్వామి గౌడ్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మాజీ జెడ్పిటిసి, కొమ్మిశెట్టి విజయ లక్ష్మణ్, దయాకర్ రావు, లింగం యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్, అంజిరెడ్డి, కేశవరావు, సతీష్ గౌడ్, ఎగదండి స్వామి, బాబు, మిను, మల్లేశం, దేవేందర్, శ్రీనివాస్ గౌడ్, రాజనర్సు దోసల శంకర్, వెంకటస్వామి గౌడ్, శీల రమేష్, కుతుబ్, శంకర్, రాజు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు


# ఈసారి ఛాన్స్ రాలే..

## తమ్ముళ్ల అసంతృప్తి

- తమ్ముళ్ల తలరాతలు మార్చిన రిజర్వేషన్లు
- పదవులపై ఆశలు వదులుకున్న నాయకులు

*ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తే చాన్స్ రాలే.. ఏం చేద్దాం ఉన్నదాంట్లో సర్దుకు పోదాం.. అంటూ వివిధ పార్టీల తమ్ముళ్లు అసంతృప్తితో ఉన్నారు. రిజర్వేషన్లు ఒక్కసారిగా తమ్ముళ్ల తలరాతలను మార్చేశా యి. ఇక ఆశలన్నీ నామినేటెడ్ పదవుల పైనే.. అంటూ గల్లి నుంచి జిల్లా దాకా తమ్ముళ్ల చర్చ జోరుగా సాగుతుంది. వివరాల్లోకి వెళితే..*

*అధికంగా జనాభా ప్రతిపాదికన బీసీ సామాజిక వర్గాలకు అధిక రిజర్వేషన్లు దక్కాయి. వికారాబాద్ జిల్లాలోని తాండూర్ వికారాబాద్ పరిగి కొడంగల్ నియోజకవర్గాల్లో ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక వర్గాలకు అధిక పదవులు దక్కే అవకాశం ఉంది.*



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 29 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేస్తూ జీవో జారీ చేయడంతో కొన్ని సామాజిక వర్గాల తమ్ముళ్ల తలరాతలు ఒక్కసారిగా మారిపోయాయి. గల్లి నుంచి జిల్లా దాకా కొన్ని సామాజిక వర్గాల నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి జిల్లా మండల స్థాయిలో పదవులు దక్కించుకోవాలని తీవ్రంగా కృషి చేశారు. ఆయా పార్టీల్లో పని చేస్తున్న చోట నాయకులంతా తమ ఉనికిని చాటుకోవడానికి వివిధ గ్రామాల్లో అనేక సామాజిక కార్యక్రమా లను చేపడుతూ ప్రజల మధ్య ఉండి సేవలందించారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఏదో ఒక ప్రాంతం నుంచి పోటీచేసి పదవులు దక్కించుకోవాలని ఆశించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయడంతో ఇతర సామాజిక వర్గాలకు వాళ్ల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ అమలు జరిగింది. బీసీ ఓట్ల శాతం గల్లి నుంచి జిల్లా దాకా అధికంగా ఉండడంతో ఎంపీటీసీ జెడ్పిటిసి గ్రామ సర్పంచ్ పదవుల రిజర్వేషన్లలో భారీగా మార్పు జరిగింది. దీంతో గ్రామపంచాయతీ నుంచి మండల జిల్లా స్థాయి వరకు ముఖ్యమైన కీలక పదవుల్లో రిజర్వేషన్లు ఒక్కసారిగా మారిపోయాయి. రెండువేల జనాభా ప్రకారం అప్పట్లో గ్రామపంచాయతీ సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి ఎంపీపీ జిల్లా పరిషత్ చైర్మన్ రిజర్వేషన్లు ఒక సామాజిక వర్గానికి అందే విధంగా ఉండేది. కానీ 2025 బీసీ జనాభా ఓటర్ల ప్రతిపాదికన అన్ని సామాజిక వర్గాల్లో రిజర్వేషన్ల మార్పు జరిగింది. దీంతో తాము పోటీ చేయాలనుకుంటున్నా పదవి రిజర్వేషన్ ఇతర సామాజిక వర్గాలకు కేటాయించడంతో వాళ్ల ఆశలు నీరు కారిపోయాయి. అధికంగా జనాభా ప్రతిపాదికన బీసీ సామాజిక వర్గాలకు అధిక రిజర్వేషన్లు దక్కాయి. వికారాబాద్ జిల్లాలోని తాండూర్ వికారాబాద్ పరిగి కొడంగల్ నియోజకవర్గాల్లో ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక వర్గాలకు అధిక పదవులు దక్కే అవకాశం ఉంది. ఈ సామాజిక వర్గాలు సర్పంచులుగా జెడ్పిటిసి ఎంపీటీసీ అభ్యర్థులుగా గెలుపొంది మండల స్థాయిలో ఎంపీపీ జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవులు దక్కించుకునే అవకాశం ఏర్పడింది. దీంతో ఇంతకాలం పదవులపై ఆశలు పెట్టుకున్న కొన్ని సామాజిక వర్గాల నాయకులు నామినేటెడ్ పదవులు లేదా వివిధ రాజకీయ పార్టీల కీలక పదవులను ఆశించే పనిలో పడ్డారు. రిజర్వేషన్ ఈ వర్గానికి వచ్చిన పార్టీ పరంగా మద్దతు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకొని అత్యధికంగా సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి ఎంపీపీ జిల్లా పరిషత్ చైర్మన్ పదవి దక్కించుకోవడానికి తీవ్రంగా కృషి చేయాలని ఆయా పార్టీల నాయకులకు అధిష్టాన వర్గం దిశ దశ నిర్దేశం చేసింది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన కారణంగా గట్టి పోటీ ఇచ్చే అభ్యర్థుల అభ్యర్థుల కోసం ఆయా పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. అక్టోబర్ 9న అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అప్పటిలోగా తమ అభ్యర్థులను ఖరారు చేసుకోవడానికి గ్రామాల వారీగా నాయకుల జాబితా కోసం పార్టీల కసరత్తు జరుగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా పార్టీలో బలం ఎంతో ఎన్నికల తర్వాత ఓటింగ్ లో భవితం తేలనుంది అప్పటివరకు వేచి చూద్దాం..

## లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



**మొయినాబాద్ సెప్టెంబర్ 29 జనంసాక్షి :** డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య సోమవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామంలో లో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. గతంలో చాలా మంది ఇల్లు లేని నిరుపేదలను అధికారులు గుర్తించి ఎవరైతే ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారో వారిని తాహసీల్దార్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. సోమవారం వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభించి వారికి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పేదవారి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఇక్కడ డబుల్ బెడ్ రూం ఇండ్లకు సంబంధించిన ,వాటర్ కనెక్షన్, వీధి దీపాలు, సీసీ రోడ్డు, కరెంటు పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. సమస్యలు లేని కాలనీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, మొయినాబాద్ తాహసీల్దార్ గౌతమ్ కుమార్, మాజీ జెడ్పిటిసి కాలే శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, ఫిషర్మెంట్ చైర్మన్ మహేందర్ ముదిరాజ్, పల్లగొల్ల అశోక్ యాదవ్, పట్నం రామ్ రెడ్డి, ఎలిగేపల్లి శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రేనేట్ల రాజు గౌడ్, యాదయ్య, కుమ్మరి శంకర్, యాదగిరి చారి, రమేష్ ముదిరాజ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### మెట్రో రైలు ప్రాజెక్టు పనులు నిలిపివేతతో

## నియోజకవర్గ ప్రజలకు తీరని అన్యాయం

- రాజేంద్రనగర్ నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి
- నిరసన కార్యక్రమాన్ని అడ్డుకున్న నార్సింగ్ పోలీసులు





**రాజేంద్రనగర్, (జనంసాక్షి) :** ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రభుత్వానికి పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ పట్లలో కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం గచ్చిబౌలిలోని మైండ్స్పేస్ నుంచి శంషాబాద్ వరకు గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేసిన ప్రాజెక్టును నిలిపివేయడం పట్ల బిఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. నిరసన తెలిపిన వారిలో మణికొండ మున్సిపాలిటీ బిఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం దూళిపాల, బిజెయంసి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావు కోళ్ల నాగరాజ్, నార్సింగ్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి,అండే లక్ష్మణ్, నరసింహ, ముక్తార్, శ్రీకాంత్ రెడ్డి, మైపాల్, సాయి గణేష్, ప్రవీణ్, సంతోష్, వీరేష్, కార్తీక్ ప్రవీణ్ తదితర నాయకులందరిని అరెస్టు చేసి నార్సింగి, రాయదుర్గం, మాదాపూర్, గచ్చిబౌలి పోలీసు స్టేషన్లకు తలరించి, సొంత పూచికత్తుపై వదలిపెట్టారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకను నొక్కి ప్రతిపక్షాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కాల రాస్తుందని ధ్వజమెత్తారు. రాజేంద్రనగర్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందే మెట్రో ప్రాజెక్టును ఆపి ఇక్కడి అభివృద్ధిని నిలిపివేయడం ఇక్కడి ప్రజలకు తీవ్ర అన్యాయమని ఆయన నిరసన వ్యక్తం చేశారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## హైడ్రా అధికారులకు పిర్యాదు చేసిన బోయపల్లి కొండల్ రెడ్డి



**ఘట్కేసర్ సెప్టెంబర్,29 (జనం సాక్షి) :** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని జోడిమెట్ల వద్ద నల్లా ఆక్రమనను తొలగించి సమస్యను పరిష్కరించాలని పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి హైడ్రా అధికారు లను కోరారు. ఈ మేరకు సోమవారం హైడ్రా అధికారులకు వినతి పత్రాన్ని అందజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్బావతిని నర్సిహ్మా, గవ్వల రాములు, శ్రీనివాసులు, ఆకిటి కృష్ణారెడ్డి, సామల శ్రీనివాస్ రెడ్డి, కూర రాజిరెడ్డి, ఆకిటి భరత్ రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థి దశ నుండి అన్ని రంగాల్లో రాణించాలి

- విద్యార్థులకు వసతి ఏర్పాటు చేయడం అభినందనీయం
- ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగయ్య

**తాండూరు సెప్టెంబర్ 29(జనంసాక్షి) :** విద్యార్థి దశ నుండి అన్ని రంగాల్లో రాణించాలని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగయ్య పేర్కొన్నారు రైతు సదస్సు మరియు వాలెడిక్టరీ కార్యక్రమం నివేదిక ఆదివారం తాండూరు మండలం జినుగుర్తి గ్రామంలో ప్రత్యేక ఎన్ ఎస్ ఎస్ శిబిరం చివరి రోజు సందర్భంగా, ఏకలవ్య కళాశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది సహకారంతో ఒక రైతు సదస్సు, వాలెడిక్టరీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగయ్య ముఖ్య అతిథిగా, వ్యవసాయ కళాశాల రాజేంద్ర నగర్ అసోసియేట్ డీన్ డా. ఎం. గోవర్ధన్ ప్రధాన అతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా ఏకలవ్య కాలేజ్ చైర్మన్ పి.వి. రావు , డా. అలీబాబా , మరియు తాండూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డా. సుధారాణి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు.డా. గోవర్ధన్ విద్యార్థులకు వసతి మరియు సదుపాయాలు కల్పించినందుకు ఏకలవ్య ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చూపిన చురుకైన పాత్ర మరియు అంకితభావాన్ని అభినందించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. నవీన్ శిబిరంలో జరిగిన అన్ని కార్యక్రమాలపై వివరమైన నివేదిక సమర్పించారు.ఈఓఏపీ ప్రిన్సిపాల్ డా. రాజవర్ధన్ విద్యార్థుల కృషి పట్ల సంతోషం వ్యక్తం చేసి, భవిష్యత్‌లో జరగబోయే శిబిరాలలో రాబోయే విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. డా. అలీబాబా, పి.వి. రావు మార్గదర్శకత్వంలో తన అభిప్రాయాలను తెలియజేశారు. అనంతరం పి.వి. రావు విద్యార్థులకు వసతి సౌకర్యాలు సమకూర్చినందుకు ఆనందం వ్యక్తం చేసి, తన అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా బి.ఎస్.సి మరియు చివరి సంవత్సరం విద్యార్థులు సేంద్రియ వ్యవసాయాన్ని స్వీకరించి ముందుకు రావాలి అని ప్రోత్సహించారు. తాండూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డా. సుధారాణి ప్రసంగిస్తూ, విద్యార్థులు మరియు అధ్యాపకులు కలసి చేసిన కృషి పట్ల ప్రశంసలు తెలిపారు. రైతులు సాంకేతికతతో కూడిన సేంద్రియ పద్ధతులు అనుసరించాల్సిన అవసరాన్ని వివరించారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు భాగయ్య, పి.వి. రావు , మరియు డా. గోవర్ధన్ ని సన్మానించారు. అనంతరం వాలెడిక్టరీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుని, ఈ శిబిరం తమకు ఇచ్చిన ప్రేరణ మరియు సేవా భావాన్ని జీవితాంతం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమం (నేను కాదు - మీరు) అనే ఎన్ఎస్ఎస్ ఆత్మను మరింత బలపరుస్తూ విజయవంతంగా ముగిసింది.

## ఆటపాటలతో విద్య నేర్పడం అభినందనీయం

**పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 29( జనం సాక్షి) :** చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పడానికి కృషి చేయటం అభినందనీయమని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. శంకర్పల్లి మండలం మోకిల గ్రామంలో ఏర్పాటుచేసిన ఆర్నిస్‌నెస్ట్ ప్రీ స్కూల్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా.. పాఠశాల డైరెక్టర్ స్వప్న తరుణ్‌రెడ్డిని అభినంది ఓంచారు. అంతేకాకుండా చదువుతోపాటు ఆట పాట నేర్పించడం కోసం ప్రీస్కూల్ ఎంతో దోహ దం చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. అందరూ చదువుకోవడం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని కుటుంబాలు బాగుపడతా యని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రభాకర్ రెడ్డి,రాములు గౌడ్, భయానంద్, దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపాల్ రెడ్డి, సాతప్రవీణ్ కుమార్, చంద్రమౌళి, జిల్లా వీఆర్వోల సంఘం మాజీ అధ్యక్షుడు పి.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## అబద్ధాల కాంగ్రెస్‌కు కాలం చెల్లింది


**జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) :** మోసపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. అబద్ధాల కాంగ్రెస్ కు తగురీతిలో బుద్ధిచెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ఉద్ఘాటించారు. సోమవారం జరిగిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ఆవేధన చెందుతున్నారని చెప్పారు. అన్ని వర్గాలకు మేలు చేసిన కేసీఆర్ ను కాదనుకుని కాంగ్రెస్ పార్టీని నమ్మిన ప్రజలు తాము మోసపోయామని గ్రహించారని అన్నారు. రైతులు, కూలీలు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు తమకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే పోలీసులతో నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు యేడాదిలో భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే నిరుద్యోగులను నిలువునా వంచించారని విమర్శించారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఇంటింటికి వెళ్లి గుర్తు చేయవలసిన బాధ్యత బిఆర్ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. సమర్థులైన నాయకులను, పార్టీ కోసం ప్రజల కోసం పనిచేసే వారిని స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులుగా నిలబెట్టి గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకులు జక్క రాంరెడ్డి, దండెం రాంరెడ్డి, ఆకుల యాదగిరి, పల్లె గోపాల్ గౌడ్, బూడిద రాంరెడ్డి, చక్రవర్తి గౌడ్, మాజీ ఎంపిపిలు కృపేష్, రజితారాజునాయక్, మండల పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేశ్ గౌడ్, చిలుకల బుగ్గరాములు, కొత్త కిషన్ గౌడ్, చీరాల రమేశ్, మున్సిపల్ అధ్యక్షులు కొప్పు జంగయ్య, అల్వాల్ వెంకట్ రెడ్డి, కళ్యాణ్ నాయక్, బొక్క గౌతంరెడ్డి, ఈదమ్మల బలరాం నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

**జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** స్థానిక ఎన్నిలకలను ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నుండి ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను, సర్పంచ్ ఎన్నికలను రెండు విడుతలలో నిర్వహించ డం జరుగుతుందని తెలిపారు అక్టోబర్ 9 వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, అక్టోబర్ 9 నుంచి 11 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్, అక్టోబర్ 13 నుంచి15 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ రెండో విడత పోలింగ్ ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 17న సర్పంచ్ ఎన్నికలకు తొలి విడత నోటిఫికేషన్ జారీ, అక్టోబర్ 17 నుంచి 19 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 31న సర్పంచ్ ఎన్నికలకు తొలి విడత పోలింగ్, అక్టోబర్ 21 నుంచి 23 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, నవంబర్ 4 న సర్పంచ్ ఎన్నికలకు రెండో విడత పోలింగ్ ఉంటుందని తెలిపారు స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని, ఎంసిసి నియమావళిని పక్కగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల విధులలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

## “స్థానిక” సమరానికి బీజేపీ సై..

- ఢిల్లీలోనే కాదు...ఈసారి గల్లీ గల్లీలోనూ కాషాయ జెండా ఎగరేయబోతున్నాం
- కరీంనగర్, సిరిసిల్ల జడ్పీ పీఠాలను కైవసం చేసుకుని కొత్త చరిత్రను లిఖిస్తాం
- స్థానిక నగారా నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు




**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి బీజేపీ సిద్ధంగా ఉందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. “నాకు రాజకీయ జన్మనిచ్చిన కరీంనగర్ పార్లమెంట్ ప్రజల కోసం, కాషాయ జెండాను నమ్ముకున్న నా కార్యకర్తలను గెలిపించడం కోసం ఢిల్లీ ఎన్నికల్లోనే కాదు, గల్లీ ఎన్నికల్లోనూ కొట్లాడేందుకు నేను సిద్ధం అని స్థానిక సమరంలో ఈసారి బీజేపీ కొత్త చరిత్రను లిఖించబోతోందిని కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలపై కాషాయ జెండా ఎగరేసి తీరుతాం” అని స్పష్టం చేశారు. ఆసియా కప్, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లలో ఇండియా ఘన విజయం సాధించినట్లుగానే రేపు జరగబోయే కరీంనగర్ పల్లె లీగ్ (కేపీఎల్ లీగ్), సిరిసిల్ల పల్లె లీగ్ (ఎస్పీఎల్) స్థానిక పోటీల్లోనూ బీజేపీ అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న నిఖార్సైన బీజేపీ కార్యకర్తలకే ఈసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో టిక్కెట్లు ఇస్తామని ప్రకటించారు. టిక్కెట్లు ఇవ్వడంతో పాటు గెలిపించుకుని కాషాయ కార్యకర్తల నుదుటిన విజయ తిలకం దిద్దుతామని తెలిపారు. సోమవారం రోజు స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ చేసిన మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఎండగడతాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పల్లెపల్లెకూ వివరిస్తాం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ చేసిన పాపాలను సైతం వివరించి ప్రజల ముందు దోషులుగా నిలబెడతాం. పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మాయ మాటలు నమ్మి గెలిపిస్తే ఈసారి ఊరు వల్లకాడు అవుతుందనే వాస్తవాన్ని ప్రజల ముందుంచుతాం. అదే సమయంలో గ్రామ పంచాయతీలకు మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోపాటు ఆ నిధులవల్ల జరిగిన అభివృద్ధిని సైతం ఇంటింటికీ వివరిస్తాం. ఢిల్లీలోనే కాదు, ఈసారి జరగబోయే ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గల్లీ గల్లీలోనూ కాషాయ జెండా ఎగరేస్తాం. అత్యధిక మండల పరిషత్ పీఠాలతోపాటు కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలను సైతం కైవసం చేసి ఈ కొత్త చరిత్రను లిఖించబోతున్నాం.

బీజేపీ పక్షాన నిలబడే అభ్యర్థులను ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు విజప్తి చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలకు నేను చెప్పేదొక్కటే. ఈ ఎన్నికల్లో గెలిచే అవకాశమున్న నాయకులకు మాత్రమే టిక్కెట్లు ఇస్తాం. అభ్యర్థుల ఎంపిక కోసం ఇప్పటికే సర్వే టీంలు ఒక దఫా సర్వే పూర్తి చేశాయి. రిజర్వేషన్లు ఖరారైన నేపథ్యంలో నిన్నటి నుండి సర్వే టీంలు రంగంలోకి దిగాయి. అభ్యర్థుల ఎంపిక విషయంలో పైరవీలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాం. గెలుపే గీటురాయిగా భావించి టిక్కెట్లు ఇస్తాం. పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేస్తున్న నాయకులు కొన్ని చోట్ల గెలిచే అవకాశం లేకపోయినా, రిజర్వేషన్ల మూలంగా టిక్కెట్లు రాకపోయినా నిరాశ చెందవద్దు. వారికి పార్టీలో, ఇతరత్రా పదవుల్లో సముచిత స్థానం కల్పించి గౌరవిస్తాం. అంతిమంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి అత్యధిక స్థానాలు సాధించి కాషాయ జెండా సత్తాను చాటాలని కోరుతున్నానని తెలిపారు.

## సవాళ్లను ఎదుర్కొని ‘గ్లోబల్ సంస్థ’గా సింగరేణి

- పండుగల సందర్భంగా బోనస్‌లు
- మార్కెట్ పోటీలో నిలవడానికి ఉత్పత్తి పెంచాలి
- కొత్త బొగ్గు బ్లాకుల కోసం వేలంపాటలు
- సోలార్, థర్మల్‌తో వ్యాపార విస్తరణ



**గోదావరిఖని, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) :** సింగరేణి కార్మికులు, అధికారులు, కుటుంబ సభ్యులకు బతుకమ్మ, దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు ఛైర్మన్ ఎన్.బలరాం. తెలంగాణలో ఈ పండుగలను ఉత్సాహంగా జరుపుకుంటామని, లాభాల వాటా బోనస్‌ను పండుగకు ముందే అందించామని చెప్పారు. 34 శాతం వాటాగా రూ.819 కోట్లు, ఒక్కో ఉద్యోగికి సగటున రూ.1.95 లక్షలు జమ చేశామని, దీపావళి బోనస్‌గా రూ.1.03 లక్షలు, అడ్వాన్స్‌గా రూ.25 వేలు అందజేశామని, మొత్తంగా సగటున రూ.3 లక్షలు అందుతాయని తెలిపారు. ఈ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగరేణి బొగ్గు మార్కెట్లో తీవ్ర పోటీని ఎదుర్కొంటోందని, ఉత్పత్తి ఖర్చు టన్నుకు రూ.3,500 కాగా, అమ్మకం ధర రూ.3,900గా ఉందని, కానీ కోల్ ఇండియా, ప్రైవేటు కంపెనీలు రూ.2 వేలకే అమ్ముతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వినియోగదారులు ఆసక్తి చూపడం లేదని, డిమాండ్ తగ్గుతోందని చెప్పారు. అమ్మకం ధర తగ్గించాలంటే ఉత్పత్తి ఖర్చు తగ్గించాలని, 8 గంటల షిఫ్టులో యంత్రాలను పూర్తిగా వాడి 25 శాతం ఎక్కువ ఉత్పత్తి చేయాలని సూచించారు. కంపెనీని రక్షించుకోవాలంటే బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.

ప్రస్తుతం 38 గనుల్లో ఉత్పత్తి జరుగుతోందని, 5 ఏళ్లలో 10 గనులు, 10 ఏళ్లలో మరో 10 గనులు మూతపడతాయని, కొత్త బొగ్గు బ్లాకులను వేలం పాట ద్వారా సాధించాలని, గతంలో పాల్గొనక పోవడంతో సత్తుపల్లి, కోయగూడెం బ్లాకులు కోల్పోయామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాను కూలంగా స్పందించి వేలంపాటలో పాల్గొనాలని ఆదేశించిందని, ఒడిశాలో నైనీ బ్లాకు ప్రారంభించామని, సింగరేణి జాతీయ సంస్థగా ఎదగనుందని చెప్పారు. సింగరేణి సోలార్, థర్మల్ ప్రాజెక్టులతో విస్తరిస్తోందని, 5 వేల మెగావాట్ల సోలార్ ప్లాంట్లు, రాజస్థాన్‌తో 1500 మెగావాట్ల సోలార్, 800 మెగావాట్ల థర్మల్, ఒడిశాలో 1600 మెగావాట్ల థర్మల్, మేడిపల్లి వద్ద 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్, పవన, జియోథర్మల్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించి కర్ణాటకలో బంగారం, రాగి గనుల లైసెన్సు సాధించామని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
30 సెప్టెంబర్ 2025

# పంచాయతీ కార్యదర్శుల బకాయిలకు నిధులు విడుదల

- రూ.104 కోట్లు క్లియర్






హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల కోసం ఒకేసారి భారీ మొత్తంలో నిధులను విడుదల చేసింది. పంచాయతీ కార్యదర్శుల బిల్లుల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం రూ. 104 కోట్లు విడుదల చేసింది. దీంతో పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ అయ్యాయి. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చొరవతో ఈ ఎప్పుడూ లేని విధంగా ఒకే విడతలో ఇంత పెద్ద మొత్తాన్ని విడుదల చేసింది. ఈ చర్యతో పంచాయతీ కార్యదర్శులపై ఉన్న ఒత్తిడి తగ్గి ఊరట లభించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ 'పంచాయతీ కార్యదర్శుల సమస్యలు అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గారు వెంటనే స్పందించి రూ. 104 కోట్లు విడుదల చేశారు. ఇంతకు ముందు ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి ఇంత పెద్ద మొత్తాన్ని విడుదల చేయడం పంచాయతీ వ్యవస్థ పటిష్టతకు దోహదం చేస్తుంది' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు.

# మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు ప్రభుత్వ అండ

- ఉద్యమకాలంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిది
- మంత్రి సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు ప్రభుత్వ అండ ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో జర్నలిజం వృత్తిలో అమరులైన జర్నలిస్టుల కుటుంబాలకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవల మరణించిన 18 మంది జర్నలిస్టు కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చొప్పున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ వ్యాప్తికి జర్నలిస్టులు విశేషంగా కృషి చేశారన్నారు. కొన్ని యాజమాన్యాలు వ్యతిరేకించినా జర్నలిస్టు లు వెనక్కి తగ్గలేదన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు పనిచేస్తారని, ప్రభుత్వ దృష్టికి సమస్యలు తీసుకొచ్చి వాటిని పరిష్కరింప చేయడంలో జర్నలిస్ట్ ల పాత్ర గొప్పదని కొనియాడారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. డ్యూటీలో భాగంగా మరణించిన జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం బాధ్యతగా స్వీకరిస్తుందని తెలిపారు. జర్నలిస్టులకు శిక్షణ తో పాటు చికిత్స, దురదృష్టవశాత్తు మరణిస్తే ఆర్థిక చేయుత అందిస్తున్నామని తెలిపారు. జర్నలిస్టు కుటుంబం ఒంటరి కాదు అని చెప్పడానికి ఆ కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నామన్నారు. ఒకరి కోసం అందరూ.. అందరి కోసం ఒకరు అన్నట్లుగా జర్నలిస్టులంతా ఒకరికొకరు తోడుగా ఉండాలన్నారు. జర్నలిస్టులంతా వాస్తవాలకు అద్దం పడుతూ వార్తలు అందించాలని ఆకాక్షించారు. విశ్వసనీయత పెరిగేలా సమాచారం అందించాలని, నిజమైన వార్త వ్యక్తిగత ప్రయోజనాలను కాకుండా ఎల్లప్పుడు సామాజిక ప్రయోజనాన్ని కోరుకుంటుందని తెలిపారు. ఆ విధానాన్ని అంతా నిలబెట్టుకోవాలని కోరారు. ఇల్లు లేని జర్నలిస్టులకు ఇంటి సదుపాయం కల్పించాలని జర్నలిస్టులు కోరుతున్నారని, సీఎం దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టులకు పెండ్లను కేటాయిస్తామని తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని, మరణించిన జర్నలిస్టు కుటుంబంతో ఇది అనుబంధాన్ని కొనసాగిస్తామని, వారికి తోడుగా, తోబుట్టువుగా అండగా ఉంటామని తెలిపారు.

# ఆస్తులను అమ్మేందుకు అనుమతి ఇవ్వండి

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన సహారా

న్యూఢిల్లీ, సెప్టెంబర్29 (జనంసాక్షి) : సహారా గ్రూప్ కంపెనీల కంపెనీ పాలసీ మేకర్స్ ఈ గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు అనుమతి కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మహారాష్ట్రలోని అంబీ వ్యాలీ, లక్నోలోని షహారా సిటీతో సహా వివిధ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించడానికి అనుమతి కోరుతూ సహారా ఇండియా కమర్షియల్ కార్పొరేషన్ లిమిటెడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 14న విచారణ జరిగే అవకాశం ఉన్నది. న్యాయవాది గౌతమ్ అవస్థి దాఖలు ఈ పిటిషన్ దాఖలు చేశారు. సెప్టెంబర్ 6 నాటి టర్మ్ షీట్‌లో పేర్కొన్న నిబంధనలు, షరతులపై గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది సహారా గ్రూప్. పెండింగ్‌లో ఉన్న సహారా గ్రూప్ కేసుల్లో దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తులో కోర్టు ఎప్పటికప్పుడు జారీ చేసిన వివిధ ఆదేశాలకు అనుగుణంగా.. అనుమతి పొందిన తర్వాత ఎస్ఐసీసీఎల్, సహారా గ్రూప్ కొన్ని చరాస్తులు, స్థిరాస్తుల అమ్మకాలను చాలా కష్టంతో చేయగలిగాయని తెలిపింది. ఈ నిధులను సెబీ-సహారా రీఫండ్ ఖాతాలో జమ చేశారు. మొత్తం రూ.24,030 కోట్ల ప్రిన్సిపల్ మొత్తంలో సహారా గ్రూప్ తన చరాస్తులు, స్థిర ఆస్తుల అమ్మకం, లిక్విడేషన్ ద్వారా సుమారు రూ.16వేల కోట్లు సేకరించి, సెబీ-సహారా రీఫండ్ ఖాతాలో జమ చేసింది అని తెలిపింది. ఎస్టేట్ బ్రోకరేజ్ కంపెనీల సేవలను ఉపయోగించినప్పటికీ సహారా గ్రూప్ ఆస్తులను లిక్విడేట్ చేయడం, విక్రయించడంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అసమర్థతను ఎత్తి చూపుతూ.. సెబీ-సహారా రీఫండ్ ఖాతాలో జమ చేసిన మొత్తాన్ని చాలా కష్టంతో, దరఖాస్తుదారు, సహారా గ్రూప్ ప్రయత్నాల ద్వారా జమ చేశామని ఎస్ఐసీసీఎల్ తెలిపింది. నవంబర్ 2023లో సహారా గ్రూప్ చీఫ్ సుబ్రతా రాయ్ మరణం తర్వాత.. గ్రూప్ తన ఏకైక నిర్ణయాధికారిని కోల్పోయిందని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. ఆయన తన జీవితకాలంలో గ్రూప్ తరఫున అన్ని నిర్ణయాలు తీసుకున్నారని.. దివంగత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు సహారా గ్రూప్ రోజువారీ వ్యాపార కార్యకలాపాలు, నిర్వహణలో పాల్గొనలేదని.. అయితే పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడాలనే కుటుంబ సభ్యుల కోరికను దృష్టిలో ఉంచుకుని సహారా గ్రూప్ ఆస్తులను సాధ్యమైనంత ఎక్కువ ధరకు విక్రయించాలని.. ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలను పాటించాలని, సహారా గ్రూప్ బాధ్యతలను తీర్చాలని, ప్రస్తుత ధిక్కార చర్యలను ముగించాలని నిర్ణయించినట్లుగా పిటిషన్‌లో పేర్కొంది. వాటాదారుల ప్రయోజనాల కోసం, ముఖ్యంగా సహారా గ్రూప్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఐసీసీఎల్ తెలిపింది. ఎస్ఐసీసీఎల్ ప్రకారం.. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, ఆచరణీయమైన ఆఫర్లు లేకపోవడం, అనేక పెండింగ్ వ్యాజ్యాల కారణంగా ఈ ప్రయత్నాలు ఎలాంటి సానుకూల ఫలితాలను ఇవ్వలేదని.. ఇది సమష్టిగా కొనుగోలుదారుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని, ఆస్తుల మార్కెట్ సామర్థ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేసిందని తెలిపింది. దివంగత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు, సహారా గ్రూప్, ఇతర సీనియర్ అధికారులపై బహుళ దర్యాప్తు సంస్థలు విచారణలు ప్రారంభించడం ద్వారా ప్రయత్నాలు మరింత క్లిష్టంగా మారాయని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. తాము పేర్కొన్నవన్నీ సమాంతర, సమన్వయం లేని చర్యలు పెట్టుబడిదారులు, డిపాజిటర్ల మనసులో గందరగోళం, విరుద్ధమైన కథనాలు, అవసరమైన అనుమానాలను సృష్టించడమే కాకుండా సహారా గ్రూప్ తన ఆస్తులను డబ్బు ఆర్జించడానికి, కోర్టు ఆదేశాలను పాటించడానికి చేస్తున్న ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకుంటున్నాయని పిటిషన్‌లో వెల్లడించింది.

# నా స్టాప్ వచ్చిసింది.. ప్రయాణం కొనసాగుతుంది

- చివరి రోజు బస్సులో ప్రయాణం...
- సజ్జన్నార్ ఆసక్తికర ట్వీట్



హైదరాబాద్, సెప్టెంబర్29 (జనంసాక్షి) : తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ పదవి నుంచి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా బదిలీ కావడంపై వీసీ సజ్జనార్ భావోద్వేగానికి లోనవుతూ తన 'ఎక్స్' ఖాతాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తన స్టాప్ వచ్చేసిందని.. బస్సు దిగి కొత్త మార్గం వైపు అడుగులేసే సమయం వచ్చిందని ఆయన పోస్ట్ చేశారు. ప్రయాణాలు ముగుస్తుంటాయని, ప్రయాణికులు దిగిపోతుంటారని.. కానీ రోడ్డు మాత్రం ఎప్పటికీ అలానే ముందుకు సాగుతుందని సజ్జనార్ ట్వీట్ చేశారు. బస్ పార్క్ చేసి.. సరికొత్త సవాల్ వైపు దూసుకెళ్లాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. టీజీఎస్ఆర్టీసీకి లైఫ్ లైన్ అయిన ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సంస్థతో, ఉద్యోగులతో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని ఆర్టీసీ ఎండీ సజ్జనర్ అన్నారు. నాలుగేళ్ల పాటు ఎండీగా పని చేశానని.. ఈ సమయంలో ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఆర్టీసీ ఎండీ నుంచి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బదిలీ అవుతున్న క్రమంలో.. ఆర్టీసీ అధికారులు బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళా భవన్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేశానని సజ్జనర్ అన్నారు. ఉద్యోగులపై దాడులు జరిగినప్పుడు, కఠినంగా వ్యవహరించమని పేర్కొన్నారు. సినీ నటుడు అల్లు అర్జున్ నటించిన ఓ యాడ్‌లో ఆర్టీసీ సంస్థను ప్రతిష్టను దిగజారిన విషయంలో లీగల్ నోటీసులు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నాలుగేళ్ళ సమయంలో ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో సహాయ సహకారాలు అందించిన ఉద్యోగులకు సజ్జనర్ ధన్యవాదాలు తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీగా తన చివరి రోజున వీసీ సజ్జనార్ ప్రజా రవాణాపై తన అనుబంధాన్ని వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. సాధారణ ప్రయాణికుడిలా లక్డీకాపుల్ - టెలిఫోన్ భవన్ బస్టాండ్ నుంచి బస్‌భవన్ వరకు బస్సులో ప్రయాణించారు. యూపీఐ పేమెంట్ చేసి కండక్టర్ వద్ద సొంత ఖర్చుతో టికెట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో ముచ్చటించారు. వీసీ సజ్జనార్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బదిలీపై వెళుతున్న సంగతి తెలిసిందే.

# విజయ్ పార్టీ నాయకులపై కేసు

చెన్నై, సెప్టెంబర్29 (జనంసాక్షి) : తమిళనాడులోని కరూర్‌లో టీవీకే పార్టీ నాయకులు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ పార్టీ అధినేత విజయ్ ప్రచారసభలో శనివారం తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనను రాజకీయం చేయబోమని, దీనిపై విచారణకు నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా తగిన చర్యలుంటాయని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తెలిపారు. తొక్కిసలాట నెలకొన్న ప్రాంతంలో చెల్లాచెదురుగా పడిన చెప్పులు, చిరిగిన బ్యానర్లు, నలిగిన పార్టీ కండువాలు ఈ ఘటనకు మూగ సాక్ష్యాలుగా నిలిచాయి. ఈ తొక్కిస లాటలో మృతుల సంఖ్య సోమవారానికి 41కి చేరింది. 80 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మృతి చెందిన వారిలో ఒక్క కరూర్ జిల్లాకు చెందినవారే 32 మంది ఉన్నారు. జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఆదివారం ఘటనాస్థలిని పరిశీలించి, దుర్ఘటనకు సంబంధించి ఆరా తీశారు. సోమవారం క్షతగాత్రులను విచారి స్తున్నారు. మృతులకు నివాళిగా ఆదివారం కరూర్ జిల్లాలో 15వేల దుకాణాలకు పైగా వ్యాపారులు మూసి వేశారు. తొక్కిసలాట ఘటన నేపథ్యంలో టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సి ఆనంద్, పార్టీ కరూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి మతియ ళగన్, నిర్మల్‌కుమార్ సహా నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ప్రజలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్29 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేక ఆడబిడ్డలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. మహి ళలు ఆనందోత్సాహాల నడుమ జరుపు కొని, చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగిసే బతుకమ్మ సాంస్కృతిక సంప్రదా యం తెలంగాణకు ప్రత్యేక మని చెప్పా రు. కష్టాలన్నీ తొలగి, ప్రతి ఇల్లూ సుఖసంతోషాలతో నిండేలా, ప్రకృతి మాత బతుకమ్మ దీవెనలు అందించాలని కేసీఆర్ ప్రార్థించారు.

# రాష్ట్రంలో ఫుల్‌గా రియల్‌ఎస్టేట్ దందా

- రాష్ట్రాన్ని దోచుకుంటున్న రేవంత్
- తెలంగాణ ఆస్తులను ప్రైవేటు కంపెనీలకు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపణలు



హైదరాబాద్, సెప్టెంబర్29 (జనంసాక్షి) : సీఎం రేవంత్‌రెడ్డికి రియల్‌ఎస్టేట్ దందా తప్పిదే ఇంకేం తెలియదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ దందా ఫుల్‌గా నడుస్తున్నదని ఆరోపించారు. ఓ పథకం ప్రకారం ఎల్ అండ్ టీ సంస్థపై ఒత్తిడి తెచ్చి హైదరాబాద్ మెట్రో నుంచి తప్పించారని, తద్వారా రూ.వెయ్యి కోట్లు లాభం పొందాడన్నారు. రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. హైదరాబాద్ మెట్రో ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ మెట్రోకు ఉన్న రూ.35వేల కోట్ల ఆస్తులను ఆదాని, మెగాకి కట్టబెట్టడానికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్ బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీ ప్రజలను మోసం చేసి తెలంగాణ ప్రజలపై రుద్దాలని చూస్తున్నారని చెప్పారు. ఈ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అంటేనే ప్రకలకు ఒక జోక్ అయిందని ఎద్దేవా చేశారు. పెరుగుతున్న జనాభాకు ఇంకో 50 ఏండ్లకు సరిపోయే పద్ధతుల్లో మెట్రోను మూడు ఫేజ్‌ల్లో విస్తరించాలని కేసీఆర్ ఆనాడు చెప్పారని గుర్తుచేశారు. దీనికి క్యాబినెట్ సమావేశంలో చర్చ చేసి, మంత్రుల అభిప్రాయాలను తీసుకొని అవసరమున్న చోట మెట్రో విస్తరణ చేయడానికి ప్రణాళికలు చేశారని తెలిపారు. మూడు ఫేజ్‌ల్లో హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలకు అనువుగా ఉండేవిధంగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు కలుపుతూ మెట్రోను కట్టాలని కేసీఆర్ ప్రణాళికలు చేశారన్నారు. ముఖ్యమంత్రి ఒక మాట మాట్లాడితే, మంత్రులు, ఎమ్మెల్యేలు మరో మాట మాట్లాడుతున్నారు. ఫ్యూచర్ లేని సిటీ ఫ్యూచర్ సిటీ అన్నారు. జనమే లేని చోట, ఇండ్లు లేని చోట, జనావాసాలు లేని చోట ఫోర్త్ సిటీకి రోడ్లు వేస్తా, మెట్రో తీసుకోపోతా అని రేవంత్ రెడ్డి అంటున్నాడని మండిపడ్డారు. గురు శిష్యులు ఇద్దరు కలిసి ఒకే రైలులో అమరావతికి వెళ్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. కాంగ్రెస్ వచ్చాక ఒక్క తట్టెడు మట్టి కూడా వేయలేదు. ఇల్లు లేని దగ్గర రోడ్లు వేయడం రేవంత్ మూర?త్వమే అవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి అని ప్రజలు నమ్మడం లేదని, ఈ ప్రభుత్వంపై విశ్వాసం లేదన్నారు. వీళ్ళు ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా?. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మైక్ ముందు ట్రిపుల్ ఆర్ రోడ్డు వెంటనే పూర్తి చేస్తామని అంటాడు.. బాధితులు వెళ్తే అది ఇప్పట్లో అవ్వదు వెళ్లిపోండి అని అంటాడు. సినిమాలకు ముందు రోజు టికెట్ రేట్లు పెంచితే, తనకు తెలియకుండా పెంచారు అని అంటాడని విమర్శించారు.

# ఘర్షణలకు దారితీసిన ఐలవ్ మహమ్మద్

ముంబై, సెప్టెంబర్29 (జనంసాక్షి) : ఐ లవ్ మహమ్మద్' వివాదంపై మహారాష్ట్రలోని అహిల్యానగర్‌లో మత ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జి జరిపారు. 30 మందిని అరెస్టు చేశారు. అహిల్యానగర్ సిటీలోని మలివాడ ప్రాంతంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు 'ఐ లవ్ మహమ్మద్' రంగోలిని ఏర్పాటు చేశారు. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని ఆగ్రహిస్తూ ఒక వర్గానికి చెందిన వందలాది మంది సిటీలోని కొత్వాలి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనలకు దిగారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వదంతులు నమ్మరాదని ప్రజలను కోరారు. కాగా, రంగోలి వేసిన వ్యక్తులను స్థానిక పోలీసులు గుర్తించారు. ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఒకరు పోలీసు కస్టడీలో ఉన్నారు. రంగోలి వివాదంతో రోడ్లపైకి వచ్చిన పలువురిని అదుపు చేసేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి జరిపారు. అహిల్యానగర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశామని, ప్రజలు వదంతులు నమ్మరాదని పోలీసులు కోరారు.

# నిండుకుండల్లా తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులు

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద ప్రవాహం



నిజామాబాద్, సెప్టెంబర్29 (జనంసాక్షి) : తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులైన సింగూరు, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్‌లకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో జలాశయాలు నిండుకుండలా మారాయి. దీనితో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 158 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 94,383 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 96,003 క్యూసెక్కులను బయటకు పంపుతున్నారు. 29.917 టీఎంసీల పూర్తి సామర్థ్యం గల ప్రాజెక్టులో ప్రస్తుతం 18.237 టీఎంసీల నీరు ఉంది. ఇక నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కూడా భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. 39 గేట్లను ఎత్తివేసి 4,10,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 3,40,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. 1091 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి, ప్రస్తుతం 1083.30 అడుగుల వద్ద ఉంది. 80.5 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి, ప్రస్తుతం 54.623 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,50,244 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు 21 గేట్లను ఎత్తివేసి 1,51,144 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1401.22 అడుగుల వద్ద ఉంది. అలాగే, 17.802 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి ప్రస్తుతం 12.736 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోని 26 గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 5,86,379 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే మొత్తాన్ని బయటకు పంపుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 585.50 అడుగులకు చేరింది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 44.3 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.






Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370